
ఆంధ్రపత్రిక


సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు

17-7-57

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



బుద్ధం శరణం గచ్ఛామి...


నల్లగొండజిల్లా విద్యావిషయిక ప్రదర్శనములో ప్రదర్శింపబడిన చిత్రములు. —ఫొటో. యస్. బి. మల్లయ్య..

*

పాఠకలోకంపై పన్నీటిజల్లు!

★ వినాయక చవితికి ★

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక



నవ్వు ఆనందానికీ, ఆరోగ్యానికి పర్యాయపదం. హాస్యం అనేకవిధాలుగా ఉంటుంది. పల్లెటూరిహాస్యం ముతక, బస్తీహాస్యం మెతక. కోర్టుల్లో జడ్జీలు, లాయర్లు, ముద్దాయిలు; ఆస్పత్రుల్లో డాక్టర్లు, రోగులు; పాఠశాలల్లో మేష్టర్లు, విద్యార్థులు, ఒకరిమీదఒకరు ఛలోక్తులు విసురుకుంటారు. ఇంట్లో భార్యాభర్తలు, బావామరదళ్లు, బావామరుదులు, పెళ్లిళ్లలో వియ్యాలవారు వేళాకోళా లాడుకుంటారు. రాజకీయాల్లో, సాహిత్యంలో, నాటక రంగస్థలాలమీద హాస్యప్రియులుగా ప్రసిద్ధికెక్కిన ప్రముఖు లెందరో ఉన్నారు. హాస్యానిది జీవితంలో విశిష్టస్థానం.

తెలుగులో హాస్యరచనలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ఏడాది ఆంధ్ర వారపత్రిక, వినాయకచవితి [28-8-57] సంచికను హాస్యసంచికగా ప్రచురిస్తున్నాము. సంచిక ఆసాంతం హాస్యం ఉట్టిపడేలా చేయాలని మా ఆశయం.

హాస్యరసప్రధానమైన కథలు, నాటికలు, వ్యాసాలు, గేయాలు, ఛలోక్తులు, వేళాకోళాలు, ఇవికాక దైనికజీవితానికీ, రాజకీయాలకూ సంబంధించిన కార్టూన్ చిత్రాలు ప్రచురిస్తాము. వనితాలోకం, బాలసాహితి, సినిమాశీర్షికలలో కూడా అన్నీ హాస్యరచనలే ప్రచురిస్తాము. ఆంధ్ర రచయితలు, ముఖ్యంగా హాస్య రచయితలు మా ఆశయం జయప్రదంగా నెరవేరడంలో సహకరిస్తారని విశ్వసిస్తున్నాము. వేళాకోళమాడడం తెలుగు ఆడబడుచులకు వెన్నతో పెట్టిన విద్య. అందుచేత వనితల సహకారానికీ ఇదే మా ప్రత్యేక విజ్ఞప్తి.

హాస్యసంచికకు రచనలు పంపేవారు ఆగస్టు 1 వ తేదీకే మాకు అందేలా "సచిత్ర వారపత్రిక హాస్యసంచికకు" అని వ్రాసి పంపించాలి. కథలైనా, నాటికలైనా, వ్యాసాలైనా వారపత్రికలో మూడు పేజీలకు మించకూడదు. కార్టూన్ చిత్రాలు డ్రాయింగ్ పేపరుమీద ఇండియన్ ఇంక్ తోనే వేసిపంపాలి.

ఒక ముఖ్యమైన గమనిక

వినాయకచవితి హాస్యసంచిక కవరుపేజీ విషయమై ఒక చిన్న సవరణ చేస్తున్నాము. కవరు పేజీకి వినాయకునికి సంబంధించిన సన్నివేశంకాక, చిత్రకారులు తమకుతోచిన ఏహాస్య సన్నివేశమైనాసరే తీసుకుని వర్ణచిత్రం పంపవలసిందిగా విజ్ఞప్తి. కవరుపేజీకి అంగీకరించిన చిత్రానికి రూ. 50/- పారితోషిక మిస్తాము. [సైజు 8" × 11".]

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO


సంపుటము 51
సంచిక 46
17-7-57

హేవిళంబి ఆషాఢ [illegible] బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం: నళినీ జయవంత్.




ఆం(డాత్ దీవి సముద్రతీరంలో రమణీయదృశ్యం.

లక్కదీవుల పురోగమనం

భారతసమాఖ్యలోని అతి రమణీయమైన భూభాగాలలో లక్కదీవులను చేర్చకుండా వుండలేము. అమీన్‌దీవి, మినికోయ్ దీవి, లక్కదీవి మొదలైన అనేకదీవుల సముదాయాన్నే లక్కదీవులని వ్యవహరించడం జరుగుతున్నది. ఇవి కేరళకోస్తాకు 280 మైళ్ల దూరంలో వున్నవి.

స్వతంత్రం స్వర్గలోకంలాంటి దన్నారు.



మినికోయ్ దీవిలో కొత్తగా స్థాపించిన ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలు ఉపయోగించుకుంటున్నారు.

దేశస్వాతంత్ర్య స్థాపనానంతరం ఈ దీవులు క్రమక్రమంగా ఆర్థిక, రాజకీయ, వైజ్ఞానిక రంగాలలో పురోభివృద్ధి సాధించగలుగుతున్నది. మినికోయ్‌దీవిలో ఈమధ్య ఒక ప్రభుత్వ ఆసుపత్రిని స్థాపించారు. ద్వీపవాసుల ఆరోగ్యాభివృద్ధికి ఇది ఎంతో సహాయపడుతున్నది. ఈ దీవి బోదవ్యాధి వ్యాపింపచేసే దోమలకు, తదితర అంటువ్యాధులకూ ప్రసిద్ధిచెందింది. ఈ వ్యాధుల బాధనుంచి ప్రజలను కాపాడడానికి ప్రభుత్వ ఆస్పత్రి యథాశక్తి కృషి చేస్తున్నది.


వ్యాధులతోపాటు వ్యాపిస్తున్న నిరక్షరాస్యతా నిర్మూలనకు ఇదే దీవిలో ఒక ప్రాథమికపాఠశాలకూడా పనిచేస్తున్నది.

మినికోయ్‌దీవి ప్రజల ప్రధాన వృత్తి మత్స్యపరిశ్రమ; నాటుబోట్ల నిర్మాణం. త్వరలోనే భారతభూభాగానికీ, ఈ దీవికీ మధ్య స్టీమర్ సర్వీస్‌ను ప్రభుత్వం ప్రారంభించబోతున్నది. నౌకాయానం అభివృద్ధిచెందడంతో వారి చేపల పరిశ్రమకు, బోట్ల నిర్మాణపరిశ్రమకు కూడా తగిన ప్రోత్సాహం లభ్యమైతీరుతుంది. లక్కదీవుల పరిపాలనావ్యవహారాల నిర్వహణపట్ల శ్రద్ధవహించడానికి ఒక సలహాదారుల సంఘం ఏర్పాటైంది. ఈ సంఘం

★ లక్క దీవుల పురోగమనం ★

లోని సభ్యులు 1958 మార్చి 31 వరకూ పనిచేస్తారు. సభ్యుల పేర్లు: (1) శ్రీ పురాకత్ భూమి మహమ్మద్ (ఇతడి స్వగ్రామం అమెనీ) (2) శ్రీ నల్లకోయ (అంద్రాత్) (3) శ్రీ పి. ఏ. పూకోయ (కాల్పెనీ) (4) శ్రీ అనిసాకత్ సయ్యద్ మహమ్మద్ కాశీం కోయ తంగల్ (కవరాతి) (5) శ్రీ లాండి రాయ్ గండువార్ ఇబ్రహీం మణిక్ ఫాన్ (మినికోయ్).

ఈ దీవుల పరిపాలనాధికారి (ప్రభుత్వ నియమితుడు) ఈ సలహాసంఘంలో సభ్యుడుగావుంటూ సంఘ సమావేశాలకు అధ్యక్షత వహిస్తుంటాడు. కనీసం సాలుకురెండు సార్లయినా ఈసమావేశాలుజరుపుతుంటారు. ఇది కేవలం సలహాసంఘమే అయినప్పటికీ, ప్రభుత్వానికి అవసరమైన సిఫార్సులు పంపవలసిన సందర్భంలో దీని సలహాలకు విశేష ప్రాధాన్యమిస్తుంటారు.




మినికోయ్ దీవిలోని మరొక దృశ్యం: తేనీరు విక్రయిస్తున్న పూరిపాకలు.

పరిపాలనా నిర్వహణకు సంబంధించిన ప్రధాన వ్యవహారాలలో ప్రభుత్వ ప్రతినిధి ఈ సంఘం అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటాడు. వ్యవసాయం, వ్యాపార పరిశ్రమలు, ఆరోగ్యం మొదలైన వాటిని అభివృద్ధి చేయడంలో కూడా సంఘం అతడికి చేదోడువాదోడుగా వుంటుంది. ద్వీపవాసుల స్వయంపోషకత్వ సాధన అన్నది వీరందరి ప్రధానధ్యేయం.

భారత ప్రభుత్వం ఎప్పుడు ఏ సమస్యను ప్రస్తావించినా పరిపాలనాధికారి సలహాసంఘం అభిప్రాయాన్ని అడిగి తెలుసుకోవలసి వుంటుంది.

ద్వీపవాసుల క్షేమం దృష్ట్యా ఏ విషయమైనా బయటపెట్టడం భావ్యం కాదని తోస్తే పరిపాలనాధికారి ఆ విషయంపై సలహాదార్లతో సంప్రతించకపోవచ్చు. ఇది కేవలం సలహాసంఘమే అయినప్పటికీ దీని సభ్యులు భారత పార్లమెంటు సభ్యులమాదిరిగానే సమావేశాలలో ప్రశ్నలవర్షం కురిపించి పరిపాలనాధికారిని ఉక్కిరిబిక్కిరి చేయవచ్చు. ★



దక్షిణధ్రువ హిమక్షేత్రంలో—భూమి అడుగున ఒక పరిశోధనాలయం—మంచు భూమిమీద కనపడేవి, ఉషాజ్యోతిని, వాయుద్యుతిని పరిశీలించడానికి పెట్టిన దుర్భిణీయంత్రాలు, దూరదర్శిని యంత్రాలు.

మనం, మన సైన్యం

న్యూఢిల్లీ ప్రతినిధి

రహదారి ధానం

రాష్ట్రపతి వద్ద సైనిక కార్యదర్శిగా పని చేసిన మేజర్ జనరల్ యదునాథ్ సింగ్ ఈ నెల 1 వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. భారతసైన్యంలో సుమారు 30 ఏళ్లపాటు ప్రశంసనీయమైనపాత్ర నిర్వహించిన శ్రీ యదునాథ్ సింగ్ అపూర్వ వ్యక్తి. సైనికునికి ఉండవలసిన కఠినతనం, తాత్వికునిలోని సాత్వికత ' ఆయన మేళవించుకున్నారు. 1945 లో ఆయన సేవాగ్రాం వెళ్లినప్పుడు మహాత్మాగాంధీ దర్శనంతో ముగ్ధులైపోయారు. ఆశ్రమంలోని నిరాడంబర జీవితం ఆయన్నెంతో ఆకర్షించింది. స్వతహాగా ఆయనలో ఉన్న మతచింతన ద్విగుణీకృతమైంది. మిలిటరీ యూనిఫారంలో లేనప్పుడు జనరల్ యదునాథ్ సింగ్ ఖద్దరే ధరిస్తారు. గాంధీజీ ఉపదేశాలు సంపుటిని ఎప్పుడూ దగ్గర ఉంచుకుంటారు.


శ్రీ యదునాథ్ సైనిక కుటుంబంలోంచి వచ్చిన మనిషి. తండ్రి జనరల్ గిరిధారీ సింగ్ (గ్వాలియర్.) కుటుంబ సంప్రదాయానుసారంగానే సైనిక వృత్తిలోకి దిగారు. కాండ్ హర్స్టులో విద్యానంతరం 1928 లో సైన్యంలో ప్రవేశించారు. బ్రిటిష్ రాజసైన్యమైన యార్క్ షైర్ లైట్ ఇన్ఫెంట్రీలో ముందు ప్రవేశించి, తరువాత కుమవాన్ రెజిమెంట్ లో చేరారు. 1948 లో ఆయనను జమ్మూలో బ్రిగేడ్ అధికారిగా నియమించారు. నాటినుంచీ ఆయన ఆధిపత్యంలోని సైనికదళం విజయంనుంచి విజయానికి పురోగమించింది. కీ॥ శే॥ బ్రిగేడియర్ ఉస్మాన్ తో కలిసి, ఝాన్ గర్ ను ఆయన ఆక్రమించారు. తరవాత రాజౌరీలో విజయం పొందారు. పూంచ్ దాడిలో ఆయనకీర్తి పరాకాష్ఠ అందుకుంది. ఆయన కర్తవ్యదీక్షకు, దేశభక్తికి, పట్టుదలకు, నాయకత్వలక్షణాలకు మెచ్చి భారత ప్రభుత్వం ఆయనకు "మహావీరచక్ర" బహూకరించింది.

ఝాన్ గర్ పునరాక్రమణ యుద్ధంలో ఆయన సైనికదళం చాలా కష్టాలు పడింది. అటు శత్రువులనే గాక ఇటు ప్రకృతి శక్తులనుగూడా ఎదుర్కొనవలసి వచ్చింది. ఇక ముందుకు సాగడం అసాధ్యమని మన సైనికులు నిరాశపడినఘట్టం తటస్థించింది. మార్గానికడ్డంగా నదులు, ఏళ్ళూ అన్నీ వరదల్లో ఉన్నాయి దాటడంకష్టమనిపించింది. ఆ సమయంలో జనరల్ యదునాథ్ ఒక సాహసకార్య చేసి తన సైనికులకు మార్గదర్శి అయ్యారు. శత్రువులు నిర్విరామంగా జరుపుతున్న కాల్పులను లెక్క చేయకుండా షాంఘీర్ ఏరుదాటి వెళ్లారు. ఆయనవెంటే ఉన్న అగ్రగామిదళం అనుసరించింది. పురోగమనానికి అవసరమైన ఒక స్థావరాన్ని ఆనాడు వారు పట్టుకున్నారు. రాజౌరీ పునరాక్రమణ యుద్ధంలోకల్లా తీవ్రంగా జరిగిన బర్వాలీ పోరాటంలో (1948 ఏప్రిల్) కూడా ఆయన విశేషధైర్యసాహసాలు ప్రదర్శించారు. తన సైనికదళాన్ని స్వయంగా ముందుకు నడిపించారు. గాయాలు తీవ్రంగా తగిలినా వెనుకంజవేయలేదు. చివరికి ఆయనే బర్వాలీ పర్వతశ్రేణిని సాధించారు.

* * *

సైన్యాలకు అత్యవసరమైన వాటిల్లో మందుగుండు సామగ్రి, పెట్రోలు, ఇతరనూనెలు ముఖ్యమైనవి. వీటిని సైన్యాలు భారీ ఎత్తున నిలవచేసుకుని ఉండాల్సి ఉంటుంది. మాట మాట్లాడితే ఒకచోటినుంచి ఇంకోచోటికి తీసుకుపోవలసి ఉంటుంది. అందుచేత వీటికి అగ్నిప్రమాదం జరిగే అవకాశాలెక్కువ. సైన్యంలో ఉండే ఫైర్మన్ అటు సైనికుని పనీ, ఇటు అగ్ని నిర్వాపకుని పనీ కూడా చేయాల్సి ఉంటుంది. ఈ రెండు పనుల్లోనూ ఫైర్మన్కు తర్ఫీదు ఇస్తారు. ముఖ్యంగా మంటలు ఆర్పే పనిలో దీర్ఘమైన శిక్షణ ఇస్తారు. తర్ఫీదు ఇచ్చే శిక్షకులకు, పర్యవేక్షకులకు రక్షణశాఖవారు 60 రోజులపాటు శిక్షణ ఇస్తారు. అగ్ని నిర్వాపక పరికరాలను నింపడం, నిచ్చెన లెగబ్రాకడం, ఫైర్ పంపులతో, నీటిగొట్టాలతో పనిచేయడం, అపాయంలో ఉన్నవారిని కాపాడడం ఇవన్నీ నేర్పుతారు. ఒక్కొక్క కేంద్రాన్ని కొన్ని మండలాలుగా, ప్రాంతాలుగా విభజిస్తారు. మండలాధికారులు, ప్రాంతాధికారులు తమ తమ స్థలాల్లో జరిగే అగ్ని నిర్వాపకం పనులను సమన్వయం చేస్తారు. పరస్పర విరుద్ధంగా ప్రవర్తించకుండా, ఆయా స్థలాల్లోని నీటి సరఫరా, పరికరాల సరఫరా, అగ్ని నిర్వాపకుల పేర్లు అడపా తడపా ప్రకటిస్తూ ఉంటారు.

నగరాల్లో ఉండే ఫైర్మన్ మాదిరికాక, సైన్యాల్లో, ముఖ్యంగా యుద్ధరంగాల దగ్గర్లో ఉండే ఫైర్మన్కు అట్టే సామగ్రి, సాధన సంపత్తి ఉండవు. ఫైరింజన్లు, ఖరీదైన



రక్షణశాఖ డిప్యూటీమంత్రి శ్రీ రఘురామయ్య ఇటీవల మద్రాసువచ్చినప్పుడు తాంబరంలో జరిగిన సైనికాభివందనం.

నవీన పరికరాలు దొరకవు. రెండు మూడు ఫైర్ పంపులు, కొన్ని అగ్నినిర్వాపక యంత్రాలు, రెండు డబ్బాల ఇసుక, నీళ్లు, పారలు ఇలాటివే ఉంటాయి. ఈ దొరికిన వాటినే చక్కగా ఉపయోగించడం ఫైర్మన్‌కు నేర్పుతారు. అప్పుడప్పుడు అభ్యాసం కోసం అగ్ని నిర్వాపక ప్రదర్శనలు, పరస్పర సహాయ ప్రదర్శనలు చేయిస్తూ ఉంటారు. ఇవి తరుచు జరుగుతూనే ఉంటాయి. నిజంగా మంటలు లేచినప్పు డేంచెయ్యాలో వివరంగా నేర్పుతారు కనుక నిజంగా మంటలు లేచినా ఎవరూ గాబరా పడకుండా, జయప్రదంగా తమ పని తాము నెరవేరుస్తారు. అంబ్యులెన్స్, ప్రథమ చికిత్స మొదలైనవి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి. సైనిక పోలీసులు ట్రాఫిక్‌ను అదుపులో పెడతారు. ప్రమాదస్థలాన్ని చుట్టు ముట్టి ఎవరూ అపాయంలో చిక్కకుండా చూస్తారు. ఇదంతా క్రమబద్ధంగా జరిగిపోతుంది.

* * *

భారత, నేపాల్ దేశాల మధ్య సుహృద్భావ, సహకారాలకు మరొక నిదర్శనంగా ఇటీవల ఒక సంఘటన జరిగింది. నేపాల్ రాజధాని ఖట్మండును, దక్షిణపు మైదానాలతోనే కాక భారతదేశపు సరిహద్దుతో కూడా కలిపే 72 మైళ్ళ పొడుగు రోడ్డును భారతీయ రాయబారి శ్రీ భగవాన్ సహాయ్ నేపాల్ మహారాజు శ్రీ మహేంద్రకు అప్పగించారు. ఈ రోడ్డుకు నేపాల్ ప్రజాస్వామ్యస్థాపకుడైన కీ॥ శే॥ శ్రీ త్రిభువన మహారాజు పేరు మీదుగా, "త్రిభువన రాజపథం" అని పేరు పెట్టారు. సారవంతమైన భూముల గుండా ఈ రోడ్డు పోతుంది. నేపాలీలు, భారతీయ సాంకేతిక నిపుణులు కలిసి ఈ రోడ్డు వేశారు. భారతీయ ఇంజినీర్ల కౌశలానికి ఈ రోడ్డు తార్కాణం. సైన్యానికి సంబంధించిన ఇంజినీర్లు అతి కష్ట సాధ్యమైన ఈపనిని అతి సమర్థతతో నిర్వహించారు.

ఈ రోడ్డుమీద సివిలియన్ రవాణా 1955 మే నుంచీ ప్రారంభమైంది. కొలంబో పథకాన్ని అనుసరించి భారతదేశం నేపాల్‌కు కొన్ని కొన్ని సహాయాలు చేయవలసి ఉంది. సాంఘికంగా, ఆర్థికంగా ముఖ్యమైన ఫలితాలు సాధించగల కొన్ని ప్రాజెక్టులను భారతదేశం ఇప్పటికే పూర్తి చేసింది. వాటిల్లో 3½ కోట్లు ఖర్చుచేసి వేసిన ఈ రోడ్డు ఒకటి. దారి కడ్డంగా ఉన్న మూడు పర్వతశ్రేణులను భేదించడానికి 350 టన్నుల ప్రేలుడు మందు ఉపయోగించాల్సి వచ్చింది. రాళ్ళూ, మట్టి తొలగించడానికి ఇరవై మోటారు యంత్రాలను ఉపయోగించారు. 1953 డిశంబరుకల్లా జీపులు పోదగినంత ఇరుకుదోవ చేశారు. దీనికి ప్రారంభోత్సవం రాజమాత చేశారు. త్రిభువన రాజపథం అని పేరు పెట్టారు బుల్‌డోజర్లు, ట్రాక్టర్లు, రోడ్డు రోలర్లు, శిలాభేదక యంత్రాలు మొదలైన భారీ యంత్రాలను చాలా ప్రయాసపడి అక్కడికి చేర్చారు. ఎందుకంటే అదంతా గతుకలతో కూడిన పర్వత మార్గం.

రోడ్లు కేవలం నగరాలను, పల్లెలను కలిపే సాధనాలే కాదు. ముఖ్యంగా నేపాల్ లాంటి వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలో ఇవి ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి. పచ్చిక మైదానాల్లోంచి, సారవంతమైన నాదిశీ, పాలుంగ్ లోయలలోంచి పోతున్న ఈపథం ఇప్పటివరకూ దుర్గమంగా ఉండిపోయిన రమణీయమైన ప్రదేశాలకు రాకపోకల అవకాశం కలిగిస్తోంది. దేశంలో పారిశ్రామిక వ్యవసాయాభివృద్ధికి దోహదం చేస్తోంది. దేశంలోని ఇతర ప్రాంతాలతో ఈప్రాంతాలకు సంబంధం ఏర్పడి, జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ప్రదేశాల నుంచి ఈప్రాంతాలకు వలస అలవాటును ఎక్కువ చేయగలదు. ఈప్రదేశాలలోని భూసారమూ, శీతోష్ణస్థితీ చూస్తే ఇక్కడ భారీ ఎత్తున కాయగూరలను ఫలాలను ఉత్పత్తిచేయడానికి అనువుగా ఉందని వృక్షశాస్త్ర నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతచేత ఈరోడు ప్రాముఖ్యం ముందు ముందు ఇనుమడించగలదు. ★



విగ్రహావిధ్వంసం


చారిత్రిక గాథ

జమ్మి సుశీలారావు

ఆ సూర్యాస్తమయ వేళ సోమనాథుని రమణీయ దేవాలయం వింతవింత అందాలతో వెలిగిపోయింది. తెల్లని గోడలపైన అస్తమయసూర్యుని అరుణ కిరణాలుపడి బంగారుపూత పూసినట్లు తళతళలాడాయి. పర్వతప్రాంతాలలో చల్లనినీడనిచ్చే పెద్దపెద్ద వృక్షాలూ, నురుగులుకక్కే కెరటాలతో తళతళలాడే సముద్రపు నీలిరంగునీళ్లూ, తెల్లని చలువరాతి మెట్లశ్రేణులూ సోమనాథుని ఆలయ సహజశోభను ద్విగుణీకృతం చేసివేశాయి. ఆ అపూర్వ సౌందర్యాన్ని చూస్తూ ముగ్ధులయిపోయే యాత్రికులుమటుకు ఆ సాయంకాలసమయంలో అక్కడ కనబడలేదు ఆ సమయంలో ఆదేవాలయ ఆవరణలో సమావేశమయిన వారందరి ముఖాలలోనూ దైన్యభావమే వెయ్యివిధాల ప్రస్ఫుటమయింది. అక్కడ చేరిఉన్న వారిలో సగం మంది దేవాలయఅర్చకులూ, అధికారులూను. మిగిలినవారు ఊరిలోప్రజలు. వారంతా కూడా భీతదృక్కులతోనే నలువైపులా చూస్తూ మధ్యమధ్య తలలు వంచుకొని నిటూర్పులు విడుస్తున్నారు వారిలో అతివృద్ధుడైన అర్చకుడు ఒకాయన మటుకు నిబ్బరమైన మనస్సుతో, ధైర్యం పురికొల్పుతూ ప్రసంగించసాగాడు.

"నామటుకు నాకేమీ భయం కలగటంలేదు సుమా! ఆఫ్ఘన్‌స్తాన్‌నుంచి క్రూరహృదయుడైన మహమ్మదు పెద్ద సేనావాహినితో దక్షిణాపథానికి పురోగమిస్తే పురోగమించుగాక అంతపెద్దసైన్యాన్ని సింధు ఎడారిలోనుంచి తీసుకురావటం నిజంగా మూర్ఖకార్యమేనని నా అభిప్రాయం"

ఇల్లా అంటూనే అక్కడ వున్న వారందరికేసీ ఒకసారి చురుకుచూపులతో చూశాడు ఆ వృద్ధుడు. కాని వారెవ్వరికీ ఆ వాక్యాలతో కొంతయినా ధైర్యం కలిగినట్లు స్ఫురించలేదు ఆయనకు. పూర్వంలాగే వారంతా తలలువంచుకొని నేలవంకేచూస్తూ కూర్చున్నారు వారికి ధైర్యం కలిగించేందుకు వృద్ధుడు మరోవాక్యం పలుకబోయాడు. ఆసమయానికి సరిగ్గా ఒక వార్తాహారుడు త్వరత్వరగా అక్కడికి గుఱ్ఱంమీదవచ్చి గుఱ్ఱందిగి దానిని దేవాలయం ఎదుటవున్న వటవృక్షానికి కట్టివేసి వారిదగ్గరకు వచ్చాడు.



★ విగ్రహా విధ్వంసం ★

సభ్యులంతా ఆత్రంగా అతనివైపే ఏమివార్త చెబుతాడోనని చూస్తూ ఉండిపోయారు. వృద్ధ అర్చకుడుకూడా మునివేళ్లతో తెల్లని గడ్డంలోని పండుశిరోజాలను దువ్వుకొని ఆ రౌతుకేసి చూశాడు. రాజధానీ నగరం నుంచి ఎక్కడా ఆగకుండా నిరంతర ప్రయాణంచేసివచ్చిన ఆ రౌతు ఒకక్షణం విశ్రాంతి తీసుకొని అలసట తీరగానే వారందరితో వివరంగా పరిస్థితులన్నీ చెప్పసాగాడు.

"ప్రభుత్వమంతా శత్రువు నెదుర్కొనే సన్నాహాలలో వుంది. మహారాజుకూడా పెద్దసైన్యాన్ని సమకూర్చుకున్నారు. రాజ్యంలోని స్త్రీలంతా తమ నగలూ, బంగారు ఆభరణాలనూ అన్నిటనీ కరిగించివేసి దేశంలోవున్న రాజులకూ సైనికులకూ ధనసహాయం చేస్తున్నారు"

మధ్యలో కొద్దిసేపు అతను ఆగాడు. కొద్దిసేపు నిశ్శబ్దం అక్కడ వ్యాపించింది. అక్కడ చేరినవారి మనస్సులోని భయాతిశయం వలెనే నల్లనల్లని చీకట్లు ఆ ప్రదేశమంతటా చుట్టివేశాయి. ఆ చీకటిలో పర్వత పంక్తులూ, వృక్షసమూహాలూ వికృత రూపాలుధరించిన పిశాచాలలాగ వారి మనస్సుల్లో దిగులుకొలిపాయి. ఆ రౌతు తిరిగి మంద స్వరంతో ప్రసంగించసాగాడు.

"మహమ్మదు శ్రీ సోమనాధ దేవాలయాన్ని దోచుకుతీరతానని గట్టిప్రతిజ్ఞ చేశాడనే నీలివార్త బలంగా సర్వత్రా వ్యాపించి ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియ వచ్చింది ఈ పవిత్ర దేవాలయంలో గొప్ప సంపద దాచిపెట్టబడి వుందని అతను విన్నాడట."

ఇది వింటూనే వృద్ధ అర్చకుడు ఒకమారు కంపించి పోయాడు. కాని మరునిమిషమే తనను తాను సంబాళించుకున్నాడు. ఆ వార్తాహరుని ప్రక్కనే ఆసీనుడయి ఉన్న యాత్రికు డొకడు సంభాషణలోకి వస్తూ "మహమ్మదు మునుపే అపార భాగ్యవంతుడని విన్నాను. అతని వేటకుక్కల మెడలకు సుమారు నాలుగైదు వందల సువర్ణ నాణెకాల విలువచేసే పట్టెడలు, అవి ధరించటానికి ముత్యాలూ, వజ్రాలూ పొదిగిన దుస్తులూ వుంటాయనికూడా చెప్పుకునేవారు అంతా," అన్నాడు.

చుట్టుపక్కలవారిలో ఒకరిద్దరు ఆవార్తకు విస్తుపోయి అతనికేసి చూశారు. "మహమ్మదు ధనవంతుడవనీ, పేదవాడవనీ. శ్రీ సోమనాధుని దోచుకునే విషయంలో మటుకు ఆమ్లేచ్ఛుడు ఎన్నటికీ విజయ్వు పొందలేడు. ఆ పరమేశ్వరుని మహిమ అదింతీయమైనది" అంటూ వృద్ధుడు శ్రీ సోమనాధుని వైపు ఒకసారి తిరిగి నమస్కరించాడు. ఆయన ముఖంలో భక్తిభావం పొంగి పొర్లిపోయింది మరోసారి ఆయన ఆవార్తాహరునివైపు తిరిగి, నమ్మికలేని స్వరంతో" ఆమ్లేచ్ఛరాజు తన అపార సేనావాహిని నంతనూ సింధుఎడారిని దాటించి ఎట్లా సురక్షితంగా తీసుకురాగలడు?" అని ప్రశ్నించాడు.

"ఎలా తీసుకొనివస్తాడో ఎవరెరుగుదురు? దారిలో చాలామంది విపరీతమైన దాహంతో మరణించారనీ, కొందరు ఆ భయంకరమైన ఉష్ణాధిక్యానికి ఉన్మాదులయిపోయారనీ తెలిసింది. కాని అందువలన మహమ్మదు కేమీ లోటుకలగదు. అతనిసేన అపారమైనది." వార్తాహరుని యీ జవాబుతో సభ్యులలో లేశమాత్రంగా నైనా ఉండే ధైర్యం కాస్తా హరించిపోయింది. చిక్కని చీకట్లు వారి మనసుల్నీ, పరిసరాల్నీ ముంచెత్తివేశాయి క్రమక్రమంగా విషణ్ణవదనాలతో అర్చకులంతా సోమనాధుని సంధ్యార్చనకోసం లేచి వెళ్లిపోయారు. ప్రజలుకూడా నెమ్మదినెమ్మదిగా సాగిపోయారు. చివరకు వృద్ధ అర్చకు డొక్కడే ఆ చీకటిలో నిలిచి ఒక వేడి నిట్టూర్పు విడిచివేసి "సోమనాధుడు తన సుందర దేవాలయ వినాశానికి ఓర్చడు" అని తలపోస్తూ త్వరత్వరగా గర్భగుడిలోకి వెళ్లిపోయాడు. ఆ తరువాత గుడిలోనుంచి పవిత్రమంత్రాలు కర్ణపేయంగా వినవచ్చాయి.

2

వృద్ధఅర్చకునివలె ధైర్యంతో ఉండలేని దేవాలయ తదితరాధికారులు, సేవకులు దేవాలయ రక్షణకి తగినయేర్పాట్లు చేసుకోవటంలో నిమగ్నులయిపోయారు. గోడలు, ప్రాకారాలూ అవీ బలిష్ఠమైనవే. అయినప్పటికీ వారిలో భీతిమటుకు పోవటంలేదు. మహమ్మదు తన దండయాత్రలో గ్రామాలనూ, నగరాలనూ, పల్లెలనూ దోచుకుంటూ వేలాది ప్రజలను వధిస్తూ విజయోత్సాహంతో క్రమముగా ముందుకుసాగిపోతున్నాడనే వార్తలు ఎప్పటికప్పుడు వారికి తెలియవస్తూనే ఉన్నాయి. మహమ్మదు తన చేతికందినంత సంపదనూ భాగ్యాన్నీ మోసుకుపోతున్నాడు. అతన్ని ఎదుర్కోవటానికి వచ్చేజనం మరుక్షణమే వెనుదిరిగి ప్రాణాలపైతీపికొద్దీ పిక్కబలంచూపి పారిపోతున్నారు. వృద్ధపూజారి యీదారుణవార్తలనువింటూనే గజగజ వణికిపోయాడు. వెనువెంటనే శ్రీ సోమనాధుని దివ్యమంగళవిగ్రహాన్ని మనస్సులోధ్యానించి మనశ్శాంతిపొందటానికి ప్రయత్నించాడు.

ఆరోజు సోమనాథునికి యథావిధిగా పూజాదికాలు నెరవేరుస్తున్న వృద్ధఅర్చకుని కర్ణాలకు దేవాలయ ఆవరణలో ప్రజల గడబిడ ధ్వనులు వినవచ్చాయి. ఆయనగాత్రం కంపించటంతో ఉద్ధరిణెతో చేతిలోనికి తీసుకున్న అర్ఘ్యజలాలు అల్లాగే నేలమీద ఒలికిపోయాయి. ఈ విపరీతకార్యానికి ఆయన మనస్సు కల్లోలంతో సంక్షుభితమయిపోయింది. మరుక్షణమే ఆయన పూజ నిలిపి సంగతి తెలుసుకోవటానికి గర్భగుడిలోనుంచి బయటకు వచ్చాడు. పర్వతప్రాంతాలలో నివసించే ఆయనమిత్రుడు ఒకాయన రొప్పుకుంటూ సందర్భాలను వివరిస్తున్నాడు.

"సర్వమూ నాశనమయిపోయే సమయం దాపురించింది. రాజధానీనగరాన్ని శత్రువులు ముట్టడించివేశారు. ఇంచుమించు వారు విజయంపొందినట్లే. దేవాలయం దోపిడీకోసం ఆ మ్లేచ్ఛుడు ముందుకుచొచ్చుకుని వచ్చివేస్తున్నాడు."

ఈమాటలను చెబుతూనే ఆయన వణికిపోసాగాడు. అక్కడ మూగిఉన్న జనం కొయ్యబారిపోయారు. వృద్ధఅర్చకుని రెండు నేత్రాలలోనుంచీ బాష్పాలు జలజలా కురిసి తెల్లనిగడ్డంలో చిక్కుపడిపోయాయి. "ప్రభూ! సోమనాథా! దీనబంధూ! సర్వరక్షకుడవు. నిన్ను నీవు రక్షించుకోలేవా తండ్రీ! అన్నిటికీ నీవేఉన్నావు" అంటూనే శ్రీ సోమనాథుని విగ్రహాన్ని తన వేడికన్నీళ్లతో అభిషేకించివేశాడు వృద్ధుడు.

3

కాని ఒకరోజు పూర్తిగా గడవలేదు. శత్రుసైన్యంవచ్చి ఆ పవిత్ర దేవాలయాన్ని చుట్టుముట్టివేసింది. ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలూ, దేవాలయ అర్చకులూ కూడా తమ భగవంతుణ్ణి కాపాడుకోవటానికి ధైర్యసాహసాలతో శత్రువులను ఎదిరించివేశారు.

"స్వామి అపార మహిమోపేతుడు. ఆయన తన దేవాలయాన్ని ముట్టడించబోయే ప్రతివిరోధినీ ఓడించివేస్తాడు. తన భక్తులను తప్పక రక్షిస్తాడు" అంటూ అర్చకులు ఎలుగెత్తి చాటుతూ ప్రజలను ఉత్సాహపూరితుల్ని చేయసాగారు. దేశంలోని రాజులూ, సామంతరాజులూ అంతా తమతమ సైన్యాలతో దేవాలయరక్షణకి వచ్చివేశారు. రెండు అహోరాత్రాలు వారంతా దుర్భేద్యమైన ఆలయ ప్రాకారాల వెనకనుంచి బలంగా పోరాడారు. మూడవరోజు పరిస్థితుల్ని గమనించిన మహమ్మద్ యించుమించు తను ఓడిపోతున్నాననే అనుకోసాగాడు. హిందూ సైనికులు దేవాలయంచుట్టూ నిలిచి తీవ్రంగా శత్రుసైనికులతో పోరసాగారు.

మహమ్మదు సైన్యం వారిని తొలగించుకొని ఆలయప్రవేశం చేయటానికి ఏమాత్రమూ సందులేకుండా కట్టుదిట్టంగా నిలిచిన హిందూసైనికులను చూశాడు మహమ్మదు. అట్లా చూస్తూనే చటుక్కున గుఱ్ఱందిగి నేలమీద మోకాళ్ళమీద నిలచి గొంతెత్తి అల్లాను ప్రార్థించసాగాడు.

ఆయన వింతప్రవర్తనను చూస్తూ మొదట యవన సైనికులు విస్తుపోయారు. మరుక్షణమే వారికి తమరాజువేసిన ఎత్తు తెలియవచ్చింది. దానితో వారుకూడా నేలకుదూకి ఆయనను అనుకరించసాగారు. ఈ విధంగా వారంతా ప్రార్థిస్తున్నట్లుగా నటిస్తూనే మోకాళ్ళమీద పాకి ముందుకు సాగిపోయారు. చివరకు దేవాలయ ద్వారాలవద్దకు చేరుకొని హఠాత్తుగా లేచి నిలువబడి ద్వారాలను రక్షిస్తున్న హిందువులను మెరపులా పడకొట్టివేసి, వారిచేత తిరిగి దెబ్బలు తినకుండానే ఒక పెద్ద ప్రవాహంలాగా ముందుకు ఆలయంలోకి తోసుక పోయారు. "ఖుదాహై! ఖుదాహై! (భగవంతుడున్నాడు') అనే నినాదాలు దేవాలయ ప్రాంగణమంతటా నిండిపోయి హిందూ సైనికుల హృదయాలలో దారుణ శిలాపాతం కలుగచేశాయి.

4

గర్భగుడిలో శ్రీ సోమనాథుని పవిత్రమూర్తికి ఎదురుగా నిలిచి వృద్ధార్చకుడు నిలువెల్లా వణికిపోతూ భగవంతుని అనేక విధాల ప్రార్థించసాగాడు. మిగిలిన అర్చకులంతా ఆయన చుట్టూ మూగి తమ దేవుణ్ణి యీ అంత్యక్షణాలలో రక్షించుకునేందుకు ఉపాయాలు అన్వేషించసాగారు. ఆ క్షణానే మహమ్మదు పెద్దపెద్దఅంగలు వేస్తూ ఠీవిగా వారిముందుకు వచ్చి నిలిచాడు.

వృద్ధార్చకుడు ఆ కఠినహృదయుని వైపు ఒకసారి కన్నీళ్ళు నిండిన కళ్ళతో చూశాడు. ఆ వెంటనే దీన స్వరంతో జాలిగొలిపే వాక్యాలతో "మా భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని మాకువదలివేసినట్లయితే మీకు కావలసినంత ధనం యిస్తాము. ఏమికావాలన్నా కోరుకోండి" అంటూ వేడుకోసాగాడు.

ఈ కరుణాలాపాలను వింటూనే మహమ్మదు హేళనగా పెద్దపెట్టున విరగబడి నవ్వేశాడు. ఆ అపహాస తరంగాలు అర్చకుల హృదయాలను భయాందోళనలతో ఊపివేశాయి. చివరకు నవ్వు నిలిపివేసి కర్కశంగా "వీలులేదు. నేను విగ్రహ విక్రేతను కాను. విగ్రహ విధ్వంసిని" అన్నాడు.

మరుక్షణమే తనచేతిలోఉన్న ఇనుప ఆయుధాన్ని ఎత్తి విగ్రహాన్ని ఒకే ఒక దెబ్బతో రెండుగా పగులకొట్టివేశాడు. ఒక విఘడియకాలం నేలమీద ఎఱ్ఱని చారికలతో రక్తం ప్రవహించినట్లు కనబడింది. పూజారులు గుడ్లు పెద్దవిచేసి నేలవంకకే చూశారు. కాని అది రక్తంకాదనీ, సోమనాథవిగ్రహంలో దాచబడిన అమూల్యమైనరత్నాలూ మాణిక్యాలూననీ గ్రహించటానికి వారికి ఎంతోసేపు పట్టలేదు.

తిరిగీ మహమ్మదు మరోసారిఆయుధాన్ని ఎత్తి ఒకే వేటుతో వృద్ధార్చకుని శిరస్సు ఛిన్నంచేసివేశాడు. ఈ హింసాకాండనంతా చూస్తూనే మిగిలిన అర్చకులంతా ప్రాణభీతితో ఎక్కడివారక్కడ సముద్రతీరానికి పారిపోయి నావలలో ఎక్కి సురక్షిత ప్రదేశాలకు వెళ్ళిపోయారు.

ఏ రాజకోశాగారాలలోనూ లేనంతటి అపార సంపదను తనలో భద్రపరచుకొన్న శ్రీ సోమనాథుడు ఆ మహానిధి నిక్షేపాలన్నిటినీ మ్లేచ్ఛరాజుపరం చేసివేసి, ఆ దేవాలయంలో తన అవతారం చాలించి వృద్ధార్చకుని తనతో తీసుకొని కైలాసశిఖరాలకు నిష్క్రమించాడు.

యవన సైనికుల పాడుగైన ఆయుధాలు తగిలి దేవాలయ ఘంటికలన్నీ ఖంగుమంటూ మ్రోగి వారి దిగ్విజయాన్ని నలువైపులా చాటివేశాయి. ★

అబ్బో, కొసమెరుపు కథ!

ఉపోద్ఘాతం:- కుప్పలు తిప్పలుగా ఆంధ్రదేశంపైకి విరుచుకుపడి. .. ... ప్రజలకు హత్యలపైనా, చౌర్యంపైనా దృష్టిమరలించినడిటెక్టివ్ నవలలసర్వస్వాన్ని చదివిపారేసిన యువకులలో ముఖ్యంగా పేర్కొనాలి ముకుందాన్ని. ముకుందం ఈమధ్య తెలుచు భోజనం మానేస్తున్నాడు అరగంట భోజనాని కాలస్యమైతే అరిచి మూర్ఛపోయే అలవాటుగల ముకుందం ఎలా వుండగలుగుతున్నాడో అతని తల్లికి తెలియ లేదు. ఆమెకి డిటెక్టివ్ నవలల రుచి తెలియాగు మరి! ముకుందానికి ఈ నవలలు తెగ చదవడంతో ఎక్కడైనాపిల్లిఅరిచినా స్త్రీఆర్తనాదంగానూ-జంక్షన్‌లో ఏ వ్యక్తి నిలబడి దీర్ఘాలోచనలో వున్నా అతనొక డిటెక్టివ్ గానూ-సీనారేకు డబ్బాలు పట్టుకెళ్తూంటే అందులో కళేబరాన్ని ఉంచినట్టూ ఊహలు వస్తున్నాయి అతనిగదిలో షెల్ఫులూ బట్టల బీరువాలూ కూడా ఈ హత్యాసాహిత్యంతోటే నిండిపోయాయి. బయటి ప్రపంచానికి భిన్నమైన ఒక డిటెక్టివ్ ప్రపంచమే అతనికి కనుపిస్తోంది. అయితే ఇవి చదవడంవల్ల బుద్ధి వికసిస్తోందనే నమ్మకం కుదిరింది. క్రమంగా ఈనవలల విషయంలో అతనికి విమర్శనాదృష్టి వచ్చింది. "అబ్బే చప్పగావుంది", "ఇంత వల్గర్ గా వుందేం భాష", "భీకరశ్రీ రచనలు బాగుండవు", "అంతా ఇదే టెక్నిక్‌లో రాస్తారేం" మొదలైన అభిప్రాయాలు చాలాసార్లు రావడంతో డిటెక్టివుల్లో సరుకే తక్కువైందో తనలో విమర్శనజ్ఞానం హెచ్చిందో ఊహించలేకపోయాడు. సహజంగా ముకుందం కొంత భయస్తుడైనా చురుకుగా ఏ విషయమైనా పసిగట్టి అనుమానించడం అతని ప్రత్యేకత. నిత్యవ్యవహారంలో ఆఫీసులో ఒకటి రెండు రహస్యాలను అద్భుతంగా భేదించడమే ఇందుకు నిదర్శనం.

రోజుకు రెండో మూడో కొత్తనవలలు దిగేటప్పుడు అవి చదవందే తెల్లవారనిచ్చేవాడుకాదు ముకుందం. రెండురోజులైంది ఏమీ దిగకపోవడం వల్ల బుఱ్ఱ ఖాళీఅయిపోయి బాధపడి పోతున్నాడు.

రెండునెలలై సినీమాకి వెళ్ళలేదని జ్ఞాపకం వచ్చింది. జేబులో రూపాయివుంది భోంచేసి సెకండ్‌షోక థియేటర్‌కి బయలుదేరాడు. అందులో ఆడుతున్న సినిమా "డిటెక్టర్".

ఈ మధ్య చాలా రోజులైంది అనుకుంటున్నాడు - ఒక డిటెక్టివ్ నవల వ్రాసి ఆంధ్ర భాషా యోషకొక భూషగా అర్పిద్దామని. చాలా నవలలు చదివి అన్నిటిలోంచి 'సహృదయంతో కొన్ని భావాలు స్వీకరించి' ఒక కొత్తపంథాలో కథ నడిపించాలని అతని ఊహ. ఈ పిక్చర్‌కి వెళ్ళడమూ అందుకే! చూశాడు. కాని 'కొత్త' యేమీ కనుపించలేదు. తిరిగి వస్తున్నాడు. అతనికి తనే నాయకుడుగా ఒకప్లాటు అనుభవంలోకి రావడం ఆరంభించింది. ఆ ఇతివృత్తం ఇది

పరిచయం:-అంధకారం ఆవరించింది.

నిర్జనంగావున్న ఆ. .. .. యిరుకువీధి మధ్యనుంచి నేల మట్టానికి | రెండడుగుల యెత్తులో ఎఱ్ఱని నిప్పుకణం ఒకటి ముందుకువస్తూంది-వెనక్కూ

కన్నసామి

ముంగుకూ ఊగుతూను రెండునిమిషాల కొకమారు సుమారు $5\frac{1}{2}$ అడుగులకుపైగా లేచి అక్కడ ఎఱ్ఱగా వెలిగి మళ్ళా ఎప్పటి లెవెల్లోకి దిగుతూంది. పాఠకులారా! చూడండి. ఆ నిప్పురవ్వతోనే మనంకూడా యీ సందు మలుపు తిరుగుదాం. ఆ వెలుగురవ్వ ఈసారి పైకివెళ్ళి ఎఱ్ఱగా అయి తన వెనుకవున్న ఆ-ఏమిటది-ఒక, మానవ-అవును-ముకుందమే-అతని ముఖాన్ని కనబరుస్తోంది. సిగరెట్టు పొట్టిదైతే ఓ పక్కకి విసిరేశాడు ముకుందం· రెండడుగులు వేసి స్టన్ ఐపోయాడు ముకుందం.

పరిశోధన:-ముకుందం విసరిన చిన్న సిగరెట్ పీకె పక్క కాలువలోకి...దొర్లిపోయింది. అదిఅతను ఖచ్చితంగాచూశాడు కాని ఇదేమిటి ఇక్కడ మరొక సిగరెట్ పొడుగావున్నది పడివుంది! రెండు పఫ్‌లయాక పడేసినట్టు కనిపిస్తోంది; రోడ్డుకు కొంచెం పక్కగా వెలుగుతూంది. తనముందు ఎవరూ ఆ సందులోనుంచివెడుతున్నట్టుచూడలేదే! ఇదిక్కడికెలా వచ్చింది?—అసలు ముకుందానికి సిగరెట్ పీకలమీద డిటెక్షనంటే-అది పాత టెక్నిక్ అని అభిప్రాయం. కాని ప్రస్తుతం తప్పనిసరిగా అదే చేయాలనిపించింది. ఆ సిగరెట్ ఎత్తి పట్టుకున్నాడు అసహ్యించుకుంటూ జేబులో అగ్గిపెట్టెతీసి వెలిగించి పరీక్షించాడు. అది పూర్తిగా తక్కువరకం సిగరెట్టు. అందుచేత ఈ సగరెట్‌ను కాల్చినవాడు పోగ్గా వుందామనుకునే పేద అని నిర్ణయించవచ్చు. ఇంత తక్కువరకం సిగరెటు పీల్చకుండావున్న అయిదు నిమిషాల్లోనే ఆరిపోతుంది కాబట్టి-ఇంకా వెలుగుతూందంటే ఇప్పుడే ఆ వ్యక్తి వెళ్ళాడన్నమాట! ఇంత పొడవైన సందులో అటేవస్తే తన కెదురుపడాలన్నది నిశ్చయం! కనుక తనకు ముందే వెళ్ళిఉండాలి ఇంత అర్ధరాత్రప్పుడు అందరూ ధనికులే వుండే ఈ సందులోనుంచి ఆ"విలన్"ఎందుకు వెళ్ళాలి! ఏదో దురుద్దేశం ఉందనే నమ్మాడు ముకుందం. ఆ వెళ్ళిన వ్యక్తి ఉద్దేశాన్నిగురించి మరొక ఐడియా వచ్చింది 'ఈ తక్కువరకం మనుష్యులు సిగరెట్టు ముట్టిస్తే సెంటమీటరు పొట్టిదయేవఱకూ వదలగలరా! రెండు పఫ్‌లేనా కాకుండా ఈ విలన్ పారేశాడంటే ఏదో కారణం ఉండాలి అతని దురుద్దేశాన్ని అమలోపెట్టడానికి ఇక్కడే నాంది జరిగివుండాలి. ఏ అమ్మాయో కనిపిస్తే హఠాత్తుగా సిగరెట్ పారేసి వెంబడించవచ్చు. లేదా ఈ ప్రాంతంలో యింట్లోనే దిగివుండాలి. ముకుందం ఆ అభిప్రాయాన్ని బలపర్చుకొని గబగబ ముందుకుసాగాడు. కొంతదూరం వెళ్ళాక ఆ సందు చివరను ఎడమపక్కకు రెండు ఆకారాలు మళ్ళినట్టు అనుమానించాడు ముకుందం

సస్పెన్సు:-అయితే విలన్ లిద్దరన్నమాట! వాళ్ళు మళ్ళడం హీరో (ముకుందాని)కి ఉపయోగించిరది. పిల్లి అడుగులతో చిన్న పరుగు పెట్టాడు ముందుకు. ముకుందం అంతర్యంలో మరొక చిన్న భయం ఉంది. ఆ-సందుమలుపు తిరిగినవెంటనే ఉన్నది-వనిక. యిల్లు! ఆ అమ్మాయీ, తనూ ఒక ఆఫీసులోనే పని చేస్తున్నారు. ఆమెమీద చాలా వాదులు ప్రచారంలో వున్నాయి ఆమె పేరుమీదుగా ఆఫీసులో కొందరికి రెండుమూడు సార్లు వార్నింగ్‌లు వచ్చాయి. అయితేనేం ఆమె చాలా అందంగా వుంటుంది. కాబట్టే

కవిగుమాస్తా ఒకడు వన్నెల విసనకర్ర (వ. వి. క) అన్నాడు. అప్పట్నుంచీ అందరికీ వ. వి. క! ఆమెసంగతి పరువు తెరల వెనుక నుంచి బజార్లో పడిన దగ్గర్నుంచీ వీధుల్లో నే కొందరేదో వాగేవారు ఆమెనిచూసి పక్క నుంచి వెళ్తూ పకిలించేవారు వీళ్ళిద్దరు విలన్ లూ అక్కడికి వెళ్ళి ఏమీ ప్రమాదం తేరుకద! అనుకున్నాడు అయినా అంత సంఘటనే జరిగినప్పుడు — నవలకు ఒక వాస్తవికమైన ప్లాట్ సంపాదించిన ఆ అదృష్టం లో— ఈవిచారం ఏమాత్రం?—సధామానపరచు కొన్నాడు. సందుచివరకొచ్చాడు దురదృష్ట వశాత్తూ ముకుందం ఊహించినట్టే ఆ రెండు మానవాకారాలూ చీకటిలో వ. వి. క. యింటిదగ్గరే గోడదగ్గర నిలబడ్డాయి "అయ్యో" అనుకున్నాడు హీరో ఒక్క అడుగు ముందుకు వేస్తే ఏమౌతుందోనని భయపడ్డాడు ముకుందం. సందుచివరనున్న ఒకయింటి తలుపుకన్నంలోంచి వచ్చిన వెలుగు ఒకగీతలా రోడ్డుమీద పడివుంది దాటితే కనబడిపోతానేమోనని వెనక్కితగ్గి నిల్చున్నాడు. అందులో ఒకడు మెల్లగా ఏదో చెబుతున్నాడు రెండవవాడు ఏదో సాధనంమీద—అది పెద్దమోకుగాని నిచ్చెన గాని అవొచ్చు—ఆడాబామీద ఓపక్క నుంచే గదికిటికీదగ్గరకి ఎక్కుతున్నట్టు అర్థమైంది ముకుందానికి తప్పదు! ఈహత్య తప్పదు!! దీనికిముందు సంఘటనలు కొన్ని కల్పించాల్సివుంటుంది కల్పించి, పాకెట్ సైజు అర్థరూపాయి నవలగా తయారు చేయాలి పేరేంపెడితే బాగుంటుందీ!? విలన్ల పేర్లా? ఊహూఁ తనపేరే! అబ్బేబ్బే-బాగా అమ్ముడవాలంటే ఆడపేరూ, ఆడ బొమ్మా, ఆడహత్యా కలియాలి మరొక విషయం--సాధ్యమైనంత పెద్దపేర్లు పెట్టడమే ఫేషన్ గావుంది

"అర్ధరాత్రి అబలపై అఘాయిత్యం".. ఛ్ఛ! చాలదు కనీసం రెండు లైనులురావాలి రా "నిశివేళ నిద్రలో నీరజాక్షిని నిహతుల్ని చేసిననిర్దయుడు". రైట్ రైట్ తు! అదేఖాయం—మళ్ళా మరొక మాంఛి, పెద్ద గొప్పపేరు దొరికేవరకూను.

"జాగ్రత్తగా పట్టుకోరా" మెల్లగా అన్నాడు పైకెక్కినవాడు ముద్దమాటల్తో

ముకుందానికంతా అగమ్యం అయి పోయింది పైనుంచి అరుపైనా వినబడకుండా నొక్కేశాడా! లేక సొమ్ములు దొంగిలించి దిగిపోయాడా.?

క్లయిమాక్స్:—ఇక నీ విషయానికి బలవత్తరమైన సంఘటనలు తటస్థిస్తాయని ఊహించాడు ముకుందం. అలా ఊహించడానికి కారణం—ఇందులో పాల్గొని అలా తటస్థింపజెయ్యాలని నిశ్చయించుకున్నాడు కనుక. కాని ముందుకు వెళ్ళేసాహసం లేకపోయింది. పైనుంచి మానవాకారం దిగిపోయింది. రెండో వ్యక్తితో కలసి ఆ సందంటే మెయిన్ రోడ్డు వైపు వెళ్ళిపోతున్నాడు విలన్ ముకుందం ఆత్రుతగా ఆయింటిగోడదగ్గరకువెళ్ళి ఏమైనా ఆచూకీ దొరుకుతుందేమోనని అగ్గిపుల్ల వెలిగించాడు భయంకరమైనదృశ్యం కంటబడింది ముకుందానికి. ఆగదిగోడ పైనుంచి కిందవరకూ ఒకేఎఱ్ఱని జీరలవరుస. ఒకజీరతో మరొకజీరకలసి కిందకిచేరుకుంటోంది రక్తం చూసి భరించలేకపోయాడు. తలయెత్తి అటు చూసేసరికి యిద్దరిలోనూ ఒకడుతనకుడిచేత్తో నడుముకొనించుకొని పెద్దఆకారాన్ని పట్టుకొని నడుస్తున్నాడు పాపం! వ. వి. క. శవాన్నికూడా తీసుకుపోతున్నారే!

ముకుందానికి వంట్లో బలంలేకపోయినా శౌర్యం ఉప్పొంగింది వాళ్ళవెంటే మెయిన్ రోడ్ చేరి కేకలేద్దామని నిశ్చయించుకున్నాడు. ఏం సాహసం-వాళ్ళు మెయిన్ రోడ్డు కిల్లీకొట్ల వెలుగుల్లోకి చేరిపోయారు. ముకుందం ఒక్కపరుగులో మెయిన్ రోడ్ చేరుకున్నాడు అప్పటికే వాళ్ళొక గోడ ఒడ్డుకు చేరుకున్నారు. ఒకడు గోడకునిచ్చెన ఆనించాడు రెండోవాడు ఎక్కాడు. కిందవాడు ఒక పెద్దకాగితం అందించాడు. పైవాడు అది గోడ కంటించాడు ఆ వాల్ పోస్టర్ మీదవున్న అక్షరాలు చదివాడు ముకుందం. "డిటెక్షన్." పైన అంటించిన వాడు కిల్లీనములుతూ ఉమ్మివేశాడు పైనించే. గోడంట ఎఱ్ఱనిజీరలు జారిపోతున్నాయి. కిందనున్నవాడు పూర్తి తక్కువరకం సిగరెట్టు ముట్టించాడు. కిందకిదింపిన పెద్ద ఆకారం—వాల్ పోస్టర్లకట్టని కుడిచేత్తో నడుముకానించుకున్నాడు ముకుందం మూర్ఛపోలేదు గాని "క్లయిమాక్స్ రాలేదు అబ్బే! కొసమెలుపుకథ" అనుకున్నాడు ★



డియర్ బుడుగూ,

నేను ఎవరినో తెలుసా, సీగాన పెసునాంబను. మరే, చాల బోల్డురోజులనుంచి నీకు 'చిట్టీ' వ్రాయాలని అనుకున్నాను. నీలాటి, బుడుగు మాకు కూడ వున్నాడు. అస్తమాను, నీ భాషేగా, మేము మాటాడుకుంటాము. మా బుడుగు ఏమంటున్నాడు తెలుసా! నేనట, తనకి, అస్తమాను ప్రేవేటు చెప్పేస్తున్నానని, అంటు వాడు ప్రేవేటు చెప్పేస్తున్నాడు. మా బుడుగు ఇప్పుడు, ఇక్కడ లేడులే, 70 రోలో 10 రోలో అయింది జర్మనీవెళ్ళి అక్కడనుంచి ఒక సీగేన్ పెసునాంబని తీసుకొని వస్తాడట. టా. టా.

నీ గేన పెసునాంబ, (బరంపురం.)

* రానీ. మీ బామ్మకి చెప్పి ప్రైవేటు చెప్పిస్తే సరి.

బుడుగూ, నీవు రాసిన ప్రతీదీ నేను ఎంతో శ్రద్ధతో చదివేస్తుంటాను. ఒక రోజున నీవు అనే మాటలను తలచుకొని నాలో నేనే నవ్వుకుంటున్నాను. అప్పుడు బామ్మ అమాంతంగావచ్చి కొప్పడేసింది. నాకు అనుమానం కలిగి "ఇన్‌కల్ట్" అన్నాను. "ఏమిటే నీముఖం" అని కళ్ళెర్ర చేసి నాకేసి చూసేటప్పటికి ప్రయివేటు చెప్పేస్తుందేమో అని భయపడి నీవుచేసే పనులన్నీ తు. చ. తప్పకుండా ఏకరువుపెట్టాను. అప్పుడే బామ్మ అలా నవ్వేసి "హారీ, భడవా!" అని నిన్ను .అని, నా వీపుమీద ఒక్క చరుపుచరిచింది

టి. డి. మల్లీశ్వరి, (బందరు.)

* అందికేగదా రేపో మ్యూడ్రోలుకో ఘుబుక్కున నా వీపు హోభ్భ ఎంత దెబ్బ అంది. ఏమిటే వీపూ అన్నానుగదా, అప్పుడు మీబామ్మ ఖదచెప్పింది హాఁ అని మా బామ్మకి చెప్పేశానుగదా. అప్పుడేమో మా బామ్మ మీబామ్మకి అని నా వీపుమీద మళ్లీ చిన్న ప్రైవేటు చెప్పేసి భలే భలే అంది గదా. అలాంటే యేమిటో నాకు తెలీదు.

ప్రియమైన బుడుగుకు, నీ చరిత్ర చదివిన ప్రతివారి ఇంటిలో బాలలకు నీవు వినాయకునివలె ఇష్టదేవతవై కూర్చున్నావు అంటే పొగడడం కాదేమో

శ్రీరంగం జయంతరావు,
(రాయరంగపూర్.)

* కాదేమో మరి. నాకు తెలీదులే.

డియర్ బుడుగూ,

నీకు యింతమంది ఉత్తరాలు వ్రాస్తుంటే నాకు బలేహాశ్చర్యంగా ఉంది నువ్వు మా ఊరికి ఎప్పుడువస్తావో ఉత్తరం వ్రాయి. నీకోసం ఎదురు తెన్నులు చూస్తూంటాను

నీ అక్కయ్య ఎల్. వి. సరోజ, చిత్తూరు.

* వాళ్లెవరు?

★



పెట్టెలలో మానవుడు

రైలుబండి అంతా క్రిక్కిరిసి వుంది. బండీ పరుగెడుతూన్నా బండీలో కూర్చున్న రామారావుకు గాలి ఏమాత్రమూ ఆడటంలేదు దీనికితోడు చుట్టూ కూర్చుని వున్న జనము రైలుపెట్టెను ఊమ్ములతోను, వారింజతొక్కలతోను, చుట్టలపొగతోనూ నానాగలీజు చేసివేస్తున్నారు ఇంత గందరగోళంలోనూ, భరింపరాని వేడిలోనూ, చెమటలోనూ, కొందరు జనం స్థలంకోసం దొమ్మీ చేస్తున్నారు, కొందరు గుర్రుపెట్టి ప్రక్కవాళ్ళ భుజాలమీద వాలి నిద్రపోతున్నారు సెనగపప్పు, మామిడిపళ్ళు, తాటిముంజెలు, జీడిపప్పు, పిప్పరమెంట్లు అమ్మకునేవాళ్లు, ప్రయాణికులను తోసుకుంటూ, అరుచుకుంటూ అమ్మకం సాగించుకుపోతూనే వున్నారు.

రైలు కుదుపుకుదిపి కూతకూసి ఏలూరు వైపు బయలుదేరినతర్వాత పెట్టెలోని తన చుట్టూవున్న ప్రయాణికులనందరినీ పరీక్షలనగా చూచి రామారావు నిట్టూర్చేడు తోటిప్రయాణికులమీద చెప్పరానిఅసహ్యం కలిగింది అతనికి ఏమిటిది? వీళ్ళంతా మానవులేనా? ఎందుకు యిట్లా ప్రవర్తిస్తారు వీళ్లు? పశువుల్లా ఏమిటీ హడావడి, గందరగోళం, గలీజు ! వెంటనే రామారావుకు మరో ఆలోచన కలిగింది తనలాగే ఆదుర్దాగా రైలెక్కినవాళ్లే తప్పేమివుంది యిందులో! రైల్లో స్థలంవుంటే, వాళ్లిట్లా ప్రవర్తించకపోదురేమో? వెంటనే చుటూరా నిలబడివున్న ప్రయాణికులపైన చెప్పరాని జాలి కలిగింది అతనికి.

ముస్తాబాదు స్టేషనులో బండి ఆగింది రామారావు ఆలోచనలు ఒక్కక్షణం ఆగిపోయేయి తూలుకుంటూ తమపెట్టెలోకి ఎక్కుతూన్న ఆజానుబాహువుమీద అతని దృష్టి వాలింది మనిషి అంత ఒడ్డూ, పొడుగూ వున్నా ఏదో నిస్సహాయుడులా అవుపించసాగేడతను పెదిమలచివర ఏవో విషాదరేఖలు! ఆ వ్యక్తి తూలుకుంటూ రామారావు కూర్చున్నచోటుకువచ్చి సామానులుపెట్టే బల్లను పట్టుకుని నిలబడ్డాడు. గుప్పుమని ముక్కులు పగిలేట్లు సారావాసన పెట్టెఅంతా వ్యాపించింది రామారావు అతన్ని అసహ్యంతో చూచి, వక్కక్షణం ముఖం ప్రక్కకుత్రిప్పుకున్నాడు—తనీవేళ ఎందుకు బయలుదేరేనా అని తనని తానే తిట్టుకుంటూ.

కాని బయలుదేరక చేసేదేముంది! మరొక్క అయిదు నిమిషాలు ఆలస్యం అయివుంటే మరేమయ్యేదో! ఒంటిగంట అవొస్తోంది. బల్ల సర్దుకుని, కాఫీకి యింటికి వెళ్ళబోతూండగా పోస్టుమేన్ కార్డు ముక్కను ఆఫీసు బల్లపైకి విసిరేడు.

ఉత్తరం తీసుకుని తను మెట్లు దిగి క్రిందికి వచ్చి, సిగరెట్ వెలించుకుని, వుత్తరాన్ని చదివేడు 'బాబకు ఏలూరు హాస్పిటలులో ఆపరేషను చేసేరనీ, పరిస్థితి ఆందోళనకరంగా వుంది గనుక, నువ్వు వెంటనే బయలుదేరి రావాలని' జాబు

క్రింద సంతకమైనా లేదు. వంకరటింకర అక్షరాలు బహుశా తనచెల్లెలేరాసి సంతకం మర్చిపోయి వుండవచ్చును.

• "దీపం"

కార్డును జేబులోపెట్టుకుని ఇంటికి హడావడిగా పరుగెత్తేడు తను బండికి సరిగ్గా ఇంకా గంటమాత్రమే 'టైం'వుంది. భార్యకి వుత్తరం చూపేడు తను ఆమె మరీ బేజారయిపోయింది. గబగబా కాఫీ యిచ్చి, "వెళ్ళి రండి-పాపం, వాళ్ళక్కడ యేం ఖంగారు పడుతున్నారో" అని తననితొందరచేసింది. బియ్యానికని దాచిన 12 రూపాయలు జేబులో వేసుకుని హడావడిగా తనొచ్చి ఈ రైలులో పడ్డాడు. మెయిలులో అయితే ఇంత అవస్థ వుండకపోవచ్చునేమో, కాని 'టైం' ఏదీ? ఆకారు చూసేక మొట్టమొదటి ఈ రైలుకే బయలుదేరక చేసేదేముంది?

పెట్టెలో నిలబడివున్న ఆజానుబాహువు, నవ్వుతూ గొణుగుతూనే ఆకస్మికంగా పక్క మనిషిమీదికి వొరిగి, పెట్టెలో పడిపోయేడు. రామారావు ఆ మనిషి పడటం గమనించినా కదలలేకపోయేడు పట్టుకోడానికి. ఎదురుంగా వున్న గ్యాంగ్ మనిషి ఒకతను పడిపోతున్న మనిషిని మధ్యలోనే పట్టుకుని, తొడమీద కూర్చోపెట్టుకుని 'మంచినీళ్ళ'ని అరిచేడు.

ఎవరివద్దవుంటాయి మంచినీళ్ళు, అనుకున్నాడు, రామారావు కొంచెం చికాకు పడుతూ, ముడుచుకు కూర్చుని. పెట్టెలో వున్న వృద్ధురాలు ఒకామె కోడలితో అంది "మన మరచెంబులో ఏమైనా వున్నాయేమో చూడమ్మా...మనం కావలిస్తే మళ్ళీ తరువాత స్టేషన్లో పట్టుకోవచ్చు"

కోడలు లేచి మరచెంబు మూతతీసి, మరచెంబును 'గ్యాంగ్ మేన్'కు అందిచ్చింది. అతను గ్లాసులో కాసిని నీళ్ళు పోసి, ఆ నీళ్ళు పడిపోయిన వ్యక్తి ముఖంమీద చిలకరించేడు. రెండు నిమిషాలకు ఆవ్యక్తి కదిలి, కళ్ళు తెరచి, కృతజ్ఞతతో 'గేంగ్ మాన్' వైపు తిరిగిచూచేడు. లేచి కూర్చున్నాడు. మాట్లాడకుండానే ఓ గ్లాసుడునీళ్ళు త్రాగి లేచి నిలబడ్డాడు. ఎందుకో రామారావు ఇస్త్రీబట్టలవైపు, షేక్స్ 'షూ' వైపు ఓసారి తీక్ష్ణంగా చూచి ముఖం త్రిప్పుకున్నాడు. ప్రక్కస్టేషన్లో బండి ఆగగానే త్వరితంగా దిగి వెళ్ళిపోయేడు.

బండీ తిరిగి కదిలింది. బండీలోని జనం యథాప్రకారం మాట్లాడుకోవడం, వుమ్మడం, గొణగడం, నిద్రపోవడము సాగించేరు.

రామారావు ఆలోచనలో పడ్డాడు. తనకి చాలా గొప్ప గొప్ప ఆలోచనలున్నాయి. మానవత్వంతో తిరిగి ఈ ప్రపంచాన్ని పునర్నిర్మించవచ్చుని తను గటిగా నమ్మేతాడు. కాని ఈ అజ్ఞానంలోపడిన మానవుల్ని తను ప్రేమించలేకపోయేడు. పడిపోతున్న ఆ త్రాగుబోతును లేచి పట్టుకోలేకపోయేడు. పోనీ పడిపోయేకనైనా - కొద్దిగా కూడా సాయంచెయ్యలేకపోయేడు ఏమీచదుపుకోని పల్లెటూరి వృద్ధరైతు చూపిన మానవత్వాన్ని కూడా తను చూపలేకపోయేడు. ఎందుకు? సిగ్గా? బట్టలు మాసిపోతాయని భయమా? వలుగురూ తనవంకే చూస్తారనా? ఓయి భగవాన్ ఏమిటీ ప్రశ్నలు. తను ప్రజల్ని ప్రేమించగలడు కాని త్రాగుబోతులు, కుష్ఠురోగులు, మురికివాళ్లు — వీళ్ళా ప్రజలంటే? మరెవ్వరు? ఎవర్ని ప్రేమించేది నువ్వు?

రామారావు భరించలేక, ఆలోచనల్ని తోసేసి కిటికీలోనుంచి బయటకు చూడసాగేడు.

ఏలూరులో బండీ ఆగింది. రామారావు లేచి బండీ దిగుతూండగా పెట్టెలోని వాళ్ళంతా నిందాపూర్వకంగా తనవైపే ప్రేలెత్తి చూపి నవ్వుతున్నట్లనిపించింది. తనను చూచే ఏదో గుసగుసలాడుకుంటున్నట్లు అన్పించింది వాళ్ళ చూపులు తన శరీరాన్ని దహించివేస్తున్నట్లు అయిపోగా, త్వరితంగా బయటపడి, రిక్షా ఎక్కి

వెన్నెలలో [illegible]

గోపాలంగారి హాస్పటలుకు వెళ్లేసు రామారావు. దడదడలాడే గుండెలతో హాస్పటలు ఆవరణలో అతను కాలుపెట్టేసరికి అయిదుంబావయ్యింది.

కుడివైపున హాలువరి వుంది. హాలుముందు పదానిమిది కుర్చీలున్నాయి. ఎవరో ఒకరిద్దరు కూర్చునివున్నారు వాటిలో-బహుశా ఘుంఘులక్షోసం ఎదురు చూస్తూ. హాలు ప్రక్కనే 'ఆస్టిన్' కారు ఒకటి నిలబడి వుంది. ఆ కారుముందు వంగి కూర్చుని ఒక వ్యక్తి ఏదో పరిశీలనగా చూస్తూవున్నాడు. రామారావు ఆత్రుతతో కుడివైపున ఎడంగా వున్న గదులవైపు చూచేడు ఎవరో ముగ్గురు స్త్రీలు అటుయిటూ హడావడిగా తిరుగుతూన్నారు. రోగులవార్డు కాబోలును అది. అయితే ఆ చుట్టుప్రక్కల తన చెల్లెలుగాని, తల్లిగాని, తమ్ముడుగాని ఎక్కడా అవుపించ లేమిటి? గదుల్లలోపలకు దృష్టి సారిస్తూ యీమూలనుండి ఆమూలకు నడిచేడు, రామారావు తన బావగాని, ఆఖరికి తనకి పరిచయస్తులుగాని ఎవ్వరూ కన్పించలేదు. బహుశా యీసరికి అంతా అయిపోయి వుంటుందా? తనవాళ్లంతా యింటికిపోయి ఏడుస్తూ కూర్చున్నారా? ఇంత నీచాలోచన వచ్చినందుకు తనను తాను నిందించుకుని, మరోసారి లోపలకు దృష్టిని సారించి వరండాలో పచారు చేసేడు రామారావు. బహుశా తన బావకు స్వస్థత చిక్కడంవలన యింటికి వెళ్లిపోవచ్చునన్నా రేమి? తను తిన్నగా ముందు యింటికి వెళ్లివుండవలసిందేమో!. . కాని వాళ్లు వుత్తరంలో తన నిక్కడకే రమ్మని రాసేరే!

రామారావుకు ఏమిచెయ్యాలో తోచింది కాదు. ఇంకా ఎక్కడైనా గదులున్నాయేమోనని చుట్టూ చూచేడతను. ఎడమవైపున మేడమీద చిన్నహాలువుంది బహుశా అది 'ఆపరేషను థియేటరు' అయివుండాలి. అయినా డాక్టరుగార్ని తను స్వయంగా ఒకసారి కలుసుకుంటే? రామారావు హాలులోనికి వచ్చి ఆ గంతకులలోని వక వృద్ధుని అడిగేడు, "డాక్టరుగారు వున్నారా?"అని.

'ఆస్తమా' రోగిలావున్న ఆ వృద్ధుడు, దగ్గి, "వారే డాక్టరుగారు" అని, యింకా కారును పరిశీలిస్తున్న వ్యక్తిని చూపేడు

రామారావు కారు వద్దకువచ్చి ఆగేడు. డాక్టరులేచి, చేతులు దులుపుకుంటూ "ఇప్పుడే వస్తాను" అంటూ హాలువెనక వున్న గదిలోపలకు వెళ్లి, రెండు క్షణాలలో తడి చేతులు తుడుచుకుంటూ తిరిగివచ్చి, "లోపలకురండి" అన్నాడు డాక్టరు వెనకే రామారావు "కన్సల్టింగ్ రూం"లోకి దారితీసేడు.

ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుని, రామారావు అన్నాడు "క్షమించండి, చిన్న "యిన్ఫర్మేషన్" కావలసి వచ్చేను"

"ఓ, ఏమీ" అన్నాడు, డాకరు.

"మాబావకు ఆపరేషను చేసేరని వుత్తరం వచ్చింది అందులో గోపాలంగారి హాస్పిటలు అనికూడా వ్రాసేరు. కాని వార్డంతా రెండుసార్లు వెతికినా మాబావ జాడ కన్పించలేదు అతను ఎక్కడున్నాడో దయచేసి చెబుతారా"

"ఏం ఆపరేషను అది?"

"తెలియదు, వాళ్లొచ్చిన వుత్తరంలో వివరాలేమీ లేవు."

"ఏసీ ఎప్పుడు జరిగింది ఆపరేషను?"

"మొన్న! ఎనిమిదో తేదీన."

"ఏసీ, ఒక్కనిమిషం వుండండి" డాక్టరులేచి అలమారులోని రిజిస్టరు వకటి తెరచి, "అవును 8 వ తేదీని ఒకే ఒక ఆపరేషను చేశాం. 4 వ నంబరు గదిలో చూడండి." అన్నాడు.

"నేను చూసేను సార్, అక్కడలేడే!"

"ఏమిటి మీ రనేది? అసలు 'పేషంటే' అక్కడ లేడంటూరా?"

"వున్నాడు సార్, కాని మాబావ లేడు"

డాక్టరు వకసారి రామారావును ఎగాదిగా చూచి, మళ్లా రిజిస్టర్ తెరచిచూసి, "మీ బావపేరు ఏమిటన్నారు? వి. రంగారావు. అదేకదూ?"

"కాదండి. నారాయణరావు స్వస్థలం బందరు."

"అయితే యీయన యింకొకరు. వీరిది గుడివాడ."

రిజిస్టరును మూసేసి, కండ్లజోడును తుడుచుకుంటూ బల్లవద్దకు వచ్చి నిలబడ్డాడు డాక్టరు రామారావు లేచి నిలబడి, "అయితే 8 వ తేదీన గాని, ఆ పైనగాని నారాయణరావు అనే వ్యక్తికి మీ హాస్పిటల్లో ఆపరేషను జరగలేదన్న మాట" అన్నాడు.

"లేదు. ఇదే మొదటిసారికూడా నేనా పేరు వినడము."

"క్షమించండి శ్రమ యిచ్చేను."

రామారావు గదిదాటి, మందుసీసాల వాసనలోనుంచి యివతల పడ్డాడు, చల్లటి గాలిలో ఎక్కడికోపోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయ్యింది. వాయు పారవశ్యం తీరకముందే, "మరి యిప్పుడేం చెయ్యాలి" అనే ప్రశ్న వుదయించింది ఏం చెయ్యాలి? ఎవరు మాత్రం యీ పరిస్థితిలో ఏంచేస్తారు? తిన్నగా చిన్న బజారులోని యింటికి వెళ్ళిపోవడమే వుత్తమం అని నిశ్చయించుకున్నాడు రామారావు. .

ఇంటికి బయలుదేరబోతూండగా రామారావుకు మరో ఆలోచన కల్గింది మరోసారి నాలుగవనంబరు గదిని చూచి, అక్కడున్న రోగి తనబావ కాడని నిర్ధారణచేసుకుంటే వచ్చిన నష్టమేమిటి? అవును. అట్లాగే చెయ్యాలి అనుకుంటూ రామారావు, రోగుల వార్డువైపు తిరిగేడు మళ్ళీ.

గుమ్మములో ఎవరో వృద్ధవితంతువు కూర్చునివుండటం గమనించి, రామారావు నాలుగోనంబరు గదిముందే ఆగిపోయేడు. ఎవరీవిడ? తనతల్లి ఎవరినైనా సాయం తెచ్చుకోలేదుగదా? తనుమాత్రం యీవిడను యిదివరకెన్నడూ చూచివుండలేదు. వెనక్కి వెళ్ళడమా ముందుకు నడవడమా అని అతను ఆలోచిస్తూండగా, ఆమె రామారావును చూచి, "ఎవరుకావాలి నాయనా" అని ప్రశ్నించింది, ఎండకు అరచేతిని అడ్డు పెట్టుకుని.

"ఈ గదిలో వుంటేది రంగారావుగారేనా అండి?"

"అవును నాయనా. నీపేరు?" లేచి నిలబడిందామె.

"రామారావండి. మాది బెజవాడ."

"రా బావా. లోపలకు రా.. " హీన స్వరంతో ఎవరో కేకవేసేరు లోపల్నుండి

తనబావేనా? ఈవిడెవరు మరి?

రామారావును తెల్లబోయి చూస్తూ, ఓ ప్రక్కకు తప్పుకున్నది వృద్ధురాలు. రామారావు లోపలకు జొరబడ్డాడు

మంచముమీద పడుకుని వున్నాడు గూడ కట్టుతో—రోగి!

గోడవైపు ముఖంపెట్టుకుని పడుకున్న అతను, అట్లాగేవుండి, చెయ్యి వూపేడు కుర్చీలో కూర్చోమన్నట్లు, సంజ్ఞతో రామారావు స్తబ్ధుడయి నిలబడిపోయేడు అట్లాగే రోగి నీరసంగా మూలుగుతూ, ప్రక్కకు తిరిగి, తలెత్తి రామారావును చూచి, విస్తుపోయి తలదించేసేడు—నిట్టూరుస్తూ

రోగికి అవతలప్రక్క కూర్చుని విసురుతూన్న యువతి, నిల్చుని, చేతిలోని విసనకర్రతో బొమ్మవలె నిలబడిపోయింది.

రోగి కండ్లుమూసుకుని, చెయ్యివూపుతూ "కూర్చోండి" అన్నాడు హీనస్వరంతో,

ఎంత పొరబడ్డాడు తను! తన బావకాడితను

కుర్చీలో కూర్చుని రామారావు గొణిగేడు "ఏదో పొరబాటుజర్గింది . మా బావ అనుకున్నా "

రోగి కండ్లు తెరచి, మలినహాసంలో అడిగేడు, "నీళ్ళేమయినా తాగుతారా?" రామారావు తలవూపేడు వృద్ధురాలు ప్రక్కగదిలోనుండి మంచినీళ్ళు తెచ్చిచ్చి, "వాడి బావకోసం చూస్తున్నాం నాయనా. అలికిడయితేచాలు బావవస్తున్నాడనుకుంటాడు వాడు " అన్నది

రామారావు నవ్వి, ఖాళీగ్లాసును క్రిందపెట్టేసేడు చిన్న మూలుగుతో రోగి మళ్ళీ కళ్ళు తెరచి, "క్షమించండి మా బావ అనుకున్నాను " అన్నాడు

"నేనూ మా బావను వెతుక్కుంటూ తిరుగుతున్నాను గోపాలంగారి హాస్పటలు యిదేనా, మరేదైనా వుందా?" అన్నాడు రామారావు

"యిదే నాయనా ఇదే" అన్నది వృద్ధురాలు. రోగి ఏదో బాధతో, దీనంగా తనవంకే చూస్తున్నాడు అతనిభార్య కౌసల్య-మహా ఓర్పులో విసురుతూనే వుంది

ఒక్క క్షణము నిశ్శబ్దము అలముకున్నది బాధాకరమైన నిశ్శబ్దములో, రోగి వుండుండి పన్నగా మూలగసాగేడు. రామారావు మూలుగును వినజాలనట్లు గట్టిగా అన్నాడు, మళ్ళీ "మా బావకు యీ హాస్పటలులోనే ఆపరేషను జరిగిందట హాస్పటలు అంతా వెదికేను ఎక్కడా కన్పించలేదు ఉత్తరంలో మాత్రము యీ హాస్పటలు అనే వ్రాసేరు " రామారావు చెయ్యి లాగుజేబూలోని ఉత్తరాన్ని స్పృశిస్తూనేవుంది ... ఉత్తరాన్ని చూపాలా వద్దా అని అతను మనస్సు ఆలోచిస్తూండగా

"అయ్యో ..పాపం"అన్నది వృద్ధురాలు.

"మీ బావ పేరు?" అడిగేడు రోగి.

"నారాయణరావు! బందరు" చెప్పేడు రామారావు

"ఆ మొదటిగదిలో ఆయన — ఏమిటే అమ్మా ఆయన పేరు?" అన్నది వృద్ధురాలు . కోడలితో.

"వారా . రాజన్నగారు ... వారిది బందరు ఎందుకయ్యింది. నూజివీడు."

"బావ రాత్రిబండికే వస్తాడు ఉత్తరం చూచుకొని" అన్నాడు రోగి పైకప్పులోకి చూస్తూ

"ఆ...మీ బావ రావల్సిందే...వెర్రి బుద్ధులు-అవి పుడకలతోనేగాని పోవు..." అన్నది వృద్ధురాలు.

"లేదమ్మా ... చూస్తూండు. రాత్రికి వచ్చేస్తాడు" బాధగా అన్నాడు రోగి.

రామారావుకు ఏంచెయ్యాలో తోచక లేద్దామని అనుకుంటూండగా ముసలామె అన్నది..."నీ పేరేమిటున్నావు బాబూ."

"రామారావండి."

రోగి నెమ్మదిగా చెప్పేడు. "మా బావ పేరూ రామారావే! సుందరరామారావు! అందుకే మిమ్మల్ని లోపలికి రమ్మన్నా నిందాక."

రామారావు మనస్సు రెపరెపలాడింది. ఆత్రుతను అగుపించనీయకుండా అడిగేడు.



★ వెన్నెలలో మానవుడు ★

"ఏంపని చేస్తాడు మీ బావ?"

"డి ఇ ఓ-ఆఫీసులో గుమాస్తా"

"ఏవూరు?" తను రోగిని బాధపెడుతున్నాడు కాని తప్పదు

"బెజవాడ" నిదానంగా తనవైపే చూస్తూ మూలిగేడు రోగి బాధగా

రామారావుకు సగం భారం తగ్గినట్లయ్యింది. ఎంత పొరబాటు చేసేడు పోస్టు ప్యూన్! చిన్న నిట్టూర్పుతో తన జేబులోని కార్డును బయటకు లాగి, "యీ వుత్తరం మీరు వ్రాసినదే కదూ?" అడిగేడు

రంగారావు వుత్తరం వంక చూచి మూలిగేడు.

"మా ఆవిడ రాసింది అనుకున్నంతా అయ్యిందన్నమాట" అన్నాడు

"ఏం ఏమయ్యింది?" అన్నది వృద్ధురాలు జరిగినదేమిటో అర్ధంకాక

"అంత అక్షణంగా రాసింది, అది ఎడ్రెస్సు! పొడి అక్షరాలు రాసింది" అన్నాడు రంగారావు.

"అంతేకాదు. డి ఇ ఆఫీసు అన్నది డి ఇ. ఓ ఆఫీసు అనేసిందలు!"

"నేను డిస్ట్రిక్ట్ ఇంజనీర్సు ఆఫీసులో పనిచేస్తున్నాను"

రంగారావు వుత్తరాన్ని వెనకా ముందూ చూచి, నిట్టూర్చి, భార్యవైపు వడవేసి "క్రింద సంతకం అయినా చేసుకోరూ?" అన్నాడు

"మనసు బాగుండక మరచిపోయి నట్టున్నా" అన్నది ఆమె ముఖం చిన్నబుచ్చుకొని.

వృద్ధురాలు విషయమంతా యిప్పుడు గ్రహించినట్లు, "అయితే నువ్వు నిన్న రాసిన జాబు మీ అన్నకు చేరలేదన్నమాట"

"ఎట్లా అందుతుంది? పాపం మధ్య యీయన హడిలిపోయి పరుగెత్తుకొచ్చేరు" అన్నాడు రోగి విచారంగా.

"అయ్యొ నాయనా ఎంత ఖంగారు పడ్డారో ఏమిటో...అతడుఅన్నాక ఎవరైనా వకటేకదా" అన్నది నిట్టూర్చి

"బావ రాడన్నమాట" గొణుగుతున్నాడు రోగి రామారావుకు రోగిమీద జాలివేసింది. మగదిక్కులేకుండా, ఒక్కడూ యీ ఆడవాళ్లతో ఎంత అవస్థ పడుతున్నాడు!

వృద్ధురాలు క్షణం క్రింద అన్నమాటలు మళ్ళీ గుర్తుకొచ్చినాయి అతనికి, "ఆపద అన్నాక ఎవరికైనా వకటేగదా" రామారావు చేతి గడియారం చూచుకొని "ఆరుంబావు అవుతోంది" అన్నాడు, టపా వుంటుందో వుండదో అనే వుద్దేశంతో.

రోగి నొచ్చుకుంటూ "మిమ్మల్ని శ్రమపెట్టే " అన్నాడు

"అబ్బే. మరేం ఫర్వా లేదు... యిక్కడకు రావడంవలన మా బావ కులాసాగా వుండటం కూడా నిశ్చయంగా తెల్సింది, చూడండి" అన్నాడు.

"మళ్ళీ శ్రమ ఇస్తున్నాను అనుకోకుండా వుంటే మీరట్లా స్టేషనుకు వెళ్లేప్పుడు . మా బావకో వుత్తరం రాసి పడెయ్యండి."

"ఈ త్తరమూ, మానవమాను! వాళ్ళెందుకు వస్తార్రా వూరికే డబ్బుదండగ" తల్లి అన్నది రుసరుస లాడుతూ.

రోగి భార్యముఖం చిన్నబుచ్చుకోడం గమనించే డతను

"నాకు రేపల్లా నెలవుతుంది మీ కొంచెం నయంగా వున్నాకే వడతా వుత్తరమో, టెలిగ్రామో కాస్తే వుండి పంపిస్తానండి!" రోగి నుదురును స్పృశిస్తూ నుదురు కాలుతున్నట్లు వేడిగావుంది

"నాకు సంపాదిగానే వుంది మీరు నాకోసం శ్రమ—"

"అబ్బె మరేంలేదు నేను పోస్టాఫీసుకు వెళ్ళొస్తా"

రామారావు రిక్షా ఎక్కి తిన్నగా పోస్టు ఆఫీసు కెళ్ళేడు. అనుకున్నట్టే పోస్టాఫీసు కట్టేసివుంది సుందర రామారావుకి 'బ్రదర్-ఇన్-లా-సిక్-స్టార్ట్' అని టెలిగ్రాం కొట్టి మళ్ళీ రిక్షా ఎక్కేడు దారిలో భోజనం చేసి నాలుగు బత్తాయిపళ్లు కొనుక్కొని అతను తిరిగి హాస్పటలు చేరేసరికి ఎనిమిదయ్యింది.

గుమ్మంలో కూర్చుని విసురుకుంటూన్న వృద్ధురాలు రామారావును, చేతిలోని బత్తాయిలను చూచి "యిదంతా ఏమిటి నాయనా" అంది నొచ్చుకుంటూ.

"ఫర్వాలే. ఉంచండి" అని గుమ్మంలో వుంచేడు వృద్ధురాలు అతనుబయట వేసిన మంచంమీద రామారావు కూర్చొని "ఎట్లా వుందాతనికి" అన్నాడు

వృద్ధురాలు అప్రక్కనే చాపొకటి వేసుకొని కూర్చొని "ఇప్పుడే నిద్రపట్టింది నాయనా. ఒళ్లుమాత్రం అలాగే వేడిగా

వుంది. నిన్న మధ్యాహ్నం చేసిన గాథరాత్రి యివ్వేళ కనక నీ ధైర్యం లేకపోతే ఏమయిపోయేవాళ్ళమో! నువ్వు వెళ్ళేక డాక్టరొచ్చి చూసేడు ఇవ్వేళ గడిస్తే మరేం భయం లేదన్నాడు నువ్విక్కడ వుండటం మాకు కొండంత ఆసరాగా వుంది!"

"మరేం ఫర్వాలేదు అదే తగ్గిపోతుంది వాడేముంది కొంత మాటసాయం అంతే" అన్నాడు.

అట్లా అనకు బాబూ! ఇంతమంది బంధువులుండి ఏం ప్రయోజనం సమయానికి ఆదుకోలేకపోయేక వాళ్ళబావ వున్నాడే— వాడంతా అదోరకం మనిషిలే! ఉత్తరం అందినాగాని అతను వస్తాడని నాకుమాత్రం నమ్మకం లేదుస్మీ మనస్సులో వుండాలి గాని పైనుంచి యెక్కడనుంచి వస్తుంది నాయనా ఆప్యాయతా, ప్రేమా!"

రామారావు తలవూపి వూరుకున్నాడు.

"పెళ్ళికట్నంతోలూకు నో వెయ్యి యివ్వాల్సి వున్నారు వాళ్ళింకా పెళ్ళినాడే గోళ్ళూడగొట్టి పుచ్చుకోలేకపోయేం వెర్రిబాగులవాళ్ళం కనక! ఆపరేషనుకు అవసరంకదా అని నో రెండు వందలయినా పంపమని ఆ మధ్య రాయించేను అదీ కోపం వాళ్ళకి!"

రామారావుకు ఏమనాలో తోచక "వూహూ!" అన్నాడు

"ఒక్కటిచెపుతాను విను నాయనా! మనుషుల్లో స్వార్థం హెచ్చిపోయింది ఇరుగు పొరుగు, మంచీచెడ్డా, న్యాయాన్యాయాలు నశించిపోయేయి అందుకే యీ యుద్ధాలు, కరువులూ, కొటకొలూను దాన్ని తగలెయ్యా డబ్బు పంపించకపోతే పోనీ కొంత వచ్చి చూసిపోకూడదూ? ఆపరేషను చేయించుకుంటాడని తెలిసికూడా"

"అయితే ఆపరేషనుకు ముందుగా రాసేరన్నమాట!"

"రాసేడు. వాడేరాసేడు గుడివాడనుంచి ఇప్పుడు నువ్వు మాకు ఏమంత బంధువని యిట్లా గిలగిలలాడిపోతున్నావు మనుషులమైపుట్టేక అంతా వకటే! నాకొచ్చిన కష్టమే, నీకొచ్చిన కష్టంలాంటిది కొన్నేళ్ళు అట్లా నడుంవాల్చు నాయనా వంటిల్లు చూచుకు వస్తా అదొక్కత్తే వుంది పాపం"

రామారావుకు ఎప్పుడు పట్టిందో నిద్ర పట్టింది. ఆకస్మికంగా ఏవో కేకలు విని వులిక్కిపడి లేచేడతను కిటికీలోనుండి లైటు పెద్దదిగా వెలుగుతూండటం గమనించేడు రామారావు రోగికొబోలు అరుస్తున్నాడు బిగ్గరగా! "ఒస్తాడమ్మా వస్తాడంటూంటే! నాకేం ఫర్వాలేదు"

రామారావు లేచి లోపలకు వెళ్ళేడు మునలామె మంచంమీద కూర్చుని వణకిపోతూన్న రోగిని గట్టిగా పట్టుకునివుంది. కోడలు లాంతరును ఎత్తిపట్టుకుని దీనంగా భర్తను చూస్తూ నిలబడివుంది. రామారావును చూచి వృద్ధురాలు అన్నది, "బాగా జ్వరంతగిలింది వణకిపోతున్నాడు. ముందు గదిలో వుందేమో, నర్సుని ఓసారి పిలుస్తారా?"

రోగి ఏదో వినపడీ వినపడకుండా మాట్లాడేస్తున్నాడు అట్లాగే రామారావుకు వెంటనే అనుమానం వేసింది—'డెలీరియం' ఏమోనని నర్సు ఏం చేస్తుంది?

"డాక్టరు ఎక్కడమ్మా వుంటేది!" గడియారం చూచుకుంటూ అడిగేడు రామారావు. 1-10 నిమిషాలు.

"చీకట్లో వెళ్ళగలవా నాయనా? ఆ ఎదురుగా అవుపించే మేడ ప్రక్కనువున్న పచ్చ డాబా".

"ఇప్పుడే వెళ్ళి వస్తాను" రామారావు డాక్టర్ యింటికి పరుగెత్తేడు

అర్ధరాత్రి అనుకోకుండా డాక్టరు వచ్చి చూశాడు. ఇంజక్షను యిచ్చి, 'మరేం ఫర్వాలేదు ఉదయానికి పూర్తిగా తగ్గిపోతుంది' అని ధైర్యం చెప్పి వెళ్ళిపోయేడు రోగికి మరో అరగంటకల్లా వళ్లు తెలియని నిద్ర పట్టేసింది

ఉదయాన్నే రోగి రామారావును నవ్వుతూ పలకరించేడు కాఫీ త్రాగేరా అని అడిగేడు. తను చేసే వుద్యోగం గురించి చెప్పేడు. ఆప్తబంధువులా సాయంత్రం వరకు కష్టసుఖాలు అనేకం చెప్పుకున్నారిద్దరూ!

సాయంత్రం డాక్టరువచ్చి రోగినిచూచి, చిర్నవ్వు వదలి వెళ్ళిపోయేడు. నర్సువచ్చి మందిచ్చిపోయింది రోగి బావమాత్రం రాలేదు

ఆరవుతూండగా రామారావు స్టేషనుకు వెళ్ళడానికి లేచేడు.

రోగి అన్నాడు, "వెళ్ళిపోతున్నారా? మీ మేలు"

"అవును. రేపు ఆఫీసు వకటి వుందిగా."

"మీకు మేమెంతో శ్రమయిచ్చేం" వృద్ధురాలు అన్నది

"ఫర్వాలేదు దానికేం"

"గుడివాడవస్తే మాయింట్లో దిగాలి" రోగి భార్య అన్నది.

"అట్లాగే నమ్మా! మరి వస్తా వంట్లో కులాసాచిక్కేక ఓ వుత్తరం వ్రాయించండి ఎడ్రెసు తెలుసుగా—"

అంతా నవ్వేరు ఒక్కసారి! నవ్వుల వెన్నెలమధ్య రామారావు స్టేషనుకు నడిచేడు

* * *

రైలంతా జనంతో కిటకిటలాడిపోతోంది. కిటికీవద్ద కుంచునివున్న రామారావు కిటికీలోనుంచి బయటకు చూసేడు. ఎటు చూచినా పండువెన్నెల! పెట్టెలోని జనంవైపు చూచేడు. స్థలంకోసం తగువులాడుకుంటూన్నారు నడుస్తూన్న రైల్లోని జనం. బయటకు చూచేడు మళ్ళా! ఆహ్లాదకరమైన వెన్నెల. విచారాలను మరపింపజేసే వెన్నెల! బండీలో తనచుట్టూ చూచేడు మళ్ళీ. పసిపిల్లలకన్నా హీనంగా ప్రవర్తిస్తూన్న ప్రజలు!

విశాల ప్రపంచాన్ని ఆవరిస్తున్న వెన్నెలవంకే చూస్తూన్న అతని మనస్సు ఎంతో ప్రేమతోను, ఆనందంతోనూ నిండిపోయింది. ఎన్నడూ ఎరుగని తృప్తి అతని హృదయాన్ని ఆవరించుకుంది. ఇంతకుముందు యీ ప్రజల్ని చూచి అసహ్యించుకున్నది తనేనా అని ఆశ్చర్యపడసాగేడు రామారావు. ★

నన్ను మార్చిన పెళ్ళి

ఘల్లుఘల్లుమనే చిరుమువ్వల సవ్వడితో మైసూరుగిత్తల తవారీబండి పచ్చని పొలాల్ని చీల్చుకుంటూ హుషారుగా పోతూంది రోడ్డునిండా గోతులమూలాన్ని తవారీబండి ఉయ్యాలలా ఊగుతోంది అందంగా కదంగుత్తులా సాగిపోతున్న ఆ మిసమిసలాడే మైసూరుగిత్తల్ని ఎంత చూసినా ఇంకా చూడాలనిపిస్తూంది తెల్లవారి అప్పుడే గంటఅయినా హేమంత తుషారం కొద్ది కొద్దిగా ఇంకా రాలుతూనే వుంది. రోడ్డుప్రక్కని డొంకల్లో పూసిన అడవిమల్లెపూలు కమ్మటి వాసనలనీను తున్నాయి ఆ ప్రకృతిసౌందర్యశోభ నన్ను ఉత్తేజపరుస్తోంది హుషారుగా సిగరెట్టు ఒక్క దమ్ములాగి "పోనియ్యవోయ్ లేటవుతూంది!" అన్నాను బండితోలే వెంకన్నని అతనికీ హుషారెక్కి ఒక్కసారి గట్టిగా అదిలించాడు దానితో 'చూసుకోమాసత్తి' అన్నట్లుగా మైసూరుగిత్తలు వాలుగుకొమ్ము ఎత్తి గాలిలోతేలి పోతూన్నట్లు గెలప్ అందుకున్నాయి

బండి ఒక్క ఊపులో రామమూర్తిగారింటిముందు ఆగింది—

"శతంజీవ్ శూ శరా తో ఓ ఓ" అంటూ పురోహితుల కంఠాల్నుంచి ఆశీర్వచనం ఘనన ఆరోహణ అవరోహణ పద్ధతుల్లో రాగబద్ధంగా గంభీరంగా వెలువడుతూంది.

వీధి పందిరినిండుగా బంధువులు, మిత్రులు, చాకళ్లు, ఉన్నారు. చెవులు చిల్లులుపడేట్లుగా రామఢోలు వాయిద్యం. పందిట్లో ఒకవంక తోడిరాగాన్ని సాధపడుతూన్న సన్నాయి వాయిద్యగాళ్లు

నేను బండిలోంచి దిగబోయేటప్పటికి రామమూర్తిగారి పెద్దకొడుకు (with the best compliments of తాలూకు) ఊః అతివినయం ప్రదర్శిస్తూ నా బండిదగ్గరకి ఎదురువచ్చి 'రండి రండి' అంటూ 'రిసీవ్' చేసుకున్నాడు. నన్ను లోపలకి తీసికెళ్లి ఒకగదిలో నాసామాను సర్దించికాఫీ ఉపాహారాలందించాడు వాటిని ఆరగించగా రామమూర్తిగారి పెద్దకొడుకు సుందరం నన్ను తీసికెళ్లి పెళ్ళిపందిట్లో పెద్దలమధ్యగా

మధుశ్రీ

కూర్చొబెట్టాడు పెళ్ళికొడుకు శేఖరం చిరునవ్వుతోటే పలకరించి సంతోషాన్ని వెలిబుచ్చాడు నా ఆగమనానికి .

తలలు నెరిసిన పెద్దవాళ్లు ఎక్కడెక్కడి సంబంధాలు కుదురుద్దామా అనే చర్చలో వీగారు కుర్రకారు పిల్లలు పెళ్ళికాని ఆడపిల్లలవంక కన్నార్పకుండా చూస్తూ చిరునవ్వులు చిలకరిస్తున్నారు. పెళ్లిపెద్దలు కొందరు తమే మహా—ఈబాధ్యతను నెత్తిమీద మోస్తున్నట్లుగా వారిలో కాళ్లు కడుపడుతున్న కుర్రాళ్లని గట్టిగా కేకలువేస్తూను, కనబడ్డవాళ్లమీద చిరాకు ప్రకటిస్తూనూ, మాటిమాటికీ భుజంమీద తువ్వాలు తీసి దులిపి నడుంకి బిగించుకుంటూనూ అటూ ఇటూ తిరుగుతున్నారు. బామ్మలూ, అమ్మమ్మలూ ఆకలికి తాళలేక నీరసంగా చెంగువాల్చుకుని విసురుకుంటూ పడుక్కున్నారు ఓమాత్రం వడివయస్సులో ఉన్న ముత్తయిదువులు పిల్లల్ని తీసుకుని ఎదరికి వచ్చి వంగి వంగి పెళ్ళికొడుకు ముఖంలోకి విడ్డూరంగా చూసి 'ఎంచక్కా వున్నాడమ్మా' అంటూ బుగ్గలు నొక్కుకుంటున్నారు. పెళ్ళికాని పడుచుపిల్లలు కొన్ని టిప్‌టాప్‌గా బూట్లు వేసుకుతిరిగే యువకుల ఎదుటే తచ్చాడుతూ ముసి, ముసి నవ్వులు కురిపిస్తూ ఓరచూపులు చూస్తున్నారు.

పెళ్లికొడుకు మహారాజా దర్జాకి కొత్త ఎక్కువ స్థాయిలో దర్జా ప్రకటిస్తూ ఠీవిగా పెళ్ళిపీటలమీద కులుకుతూ కూర్చున్నాడు. పెళ్ళికూతురు బుర్ర భూమిలోకంటూవొంచి కూర్చుని ఉన్నప్పటికీ మధ్య మధ్య కనుకొలకుల్లోంచి పెళ్ళికొడుకు ముఖాన్ని పరీక్షగా చూస్తూ 'వీడే నారాజు' అనుకుంటున్నట్లు నవ్వుకుంటూంది!

బెస్టు కాంప్లిమెంట్సు లిస్టులోవున్న కొందరు పన్నీరు వర్షంలాగా జల్లుతున్నారు. మరి కొందరు సెంట్లు చొక్కాలకి డాగులు పడేవరకూ పామేస్తున్నారు మరికొందరు వెండి పళ్లేలు చేతపట్టుకుని తాంబూలా లందిస్తున్నారు

సుముహూర్తం వేళయింది

"ఆఁ! బాజాభజంత్రీలు గట్టిగా వాయించండయ్యా!" అంటు పురోహితులు, వచ్చీరాని, మంత్రాలు ఉచ్చరించడం ప్రారంభించారు పురోహితుల గొంతుకలు మంగళవాయిద్యాల ధ్వనులలో లీనంఅయిపోయాయి అసలు వారి నోటివెంట మంత్రాలే వస్తున్నాయో మరోటోవస్తున్నాయో తెలియకుండా మంగళవాయిద్యాలు!

"పెళ్లికి వీళ్లందర్నీ ఎందుకు పిల్చారో తెలుసునా నువ్వు ఈ పిల్లని పెళ్లాడావన డానికి సాక్ష్యం నువ్వు నీ భార్యతో కష్టసుఖాలను సమంగా పంచుకుంటూ సంసారయాత్ర సాగించాలన్నమాట!" అంటూ పురోహితులలో పెద్ద తాను చదివిన మంత్రానికి అర్థం చెప్పి సభలోకి చూశాను

వానలాగా కురిశాయి అక్షతలు .

పురోహితుడు మళ్ళీ ప్రారంభించాడు -

"అహ్వాయ్ నాతిచరామి! అను "

"నాతిచరామి "

అందరూ వినేట్లుగా అన్నాడు.

అగ్నిదేవుడు ఆనందంతో ప్రజ్వరిల్లుతున్నాడు

"నువ్వు అగ్నిసాక్షిగా పెళ్లాడావన్నమాట!" పెళ్ళికొడుకు నవ్వేను

మంగళసూత్రాలు తీసుకువచ్చేరు ఆ మంగళసూత్రాల్ని పెళ్ళయిన పెద్దలు ఒక

సారి తొక్కుతున్నారు. తమలాగే జీవితాన్ని సుఖంగా గడపమని దాని అర్థం.

పెళ్ళికొడుకు తల్లి వచ్చి పెళ్ళికూతురి మొగలిరేకులజడ ఎత్తి పట్టుకుంది. పురోహితులు నాగలికొడి పట్టుకుని దానిమీంచి పెళ్ళికూతురి మెడలో సూత్రం కట్టమన్నారు రెండుఎద్దులు నాగలిని ఎలాక్కుపోతాయో అలాగే దంపతులుభయులూ సంసారం అనే నాగలిని సమంగావహించిలాక్కువెళ్ళాలని అర్థం.

తలంబ్రాలవేళయింది...

ముందర పెళ్లికొడుకుచేతిలో బియ్యం పోసి మంత్రం చదివి పెళ్లికూతురి నెత్తిమీద పొయ్యమన్నారు అలాగే పెళ్లికూతురిచేత పెళ్లికొడుకునెత్తిమీద పొయ్యమన్నారు ఇలా మూడుసార్లు అయ్యేక పెళ్లికూతురూ పెళ్ళికొడుకూ గబగబా పోసుకోవడం ప్రారంభించారు ఇది పనిగాదని చెప్పి పెళ్లికూతురు పళ్లెంతో సహితం అన్ని బియ్యం ఎత్తేసి పెళ్లికొడుకునెత్తిమీద వొంచేసి విజయగర్వాన్ని ప్రకటిస్తూ నవ్వింది .

సభలో హర్షధ్వానాలు 'సెబాస్' అన్న ప్రశంసలూ బయలుదేరాయి ముత్తైదువలు—"పంతంనెగ్గించుకున్నావేపిల్లా!" అంటూ గొప్పగా పొజుపెట్టారు పైటనడుంకి బిగించి పెళ్లికాని పెళ్లికూతుళ్లు తమపెళ్లికూడా ఇలాగే చెయ్యాలనుకుంటు ఆరోజుని తల్చుకుంటూ ఊహతన్మయతలో మునిగిపోతున్నారు

పెళ్లికొడుకు తను ఓడిపోవడం బాగుండదనుకున్నాడు. !

ఏదో నాకుతెలియని ఆనందం నాలో పొంగి పొరలుతూంది!

"నాతిచరామి. నాతిచరామి!" అన్న పురోహితుని ముక్కలు మాటిమాటికి నా చెవుల్లో గింగురుమంటున్నాయి—పెళ్లికొడుకు నలుగుర్లోనూ 'శపథం' చేస్తున్నాడన్నమాట పరస్త్రీని కన్నెత్తి చూడనని...

పెళ్లితంతులన్నీ పూర్తికాగా భోజనాలకి లేవమన్నారు ఒక్కొక్కళ్లే కదలసాగారు. పెళ్లికొడుక్కి అసలుఆకలే లేనట్లుగావుంది! పట్టుతాపితాలు పైటెలఅడుగున వున్నవి (కలరావుండల వాసన వేస్తున్నాయి!) తీసి కట్టుకుని వెండి మరచెంబులతో భోజనానికి అందరూ ఒక్కసారి పందిట్లోకి చేరారు. వడ్డనలు గబగబా జరుగుతున్నాయి!

భోజనప్రియులు పొట్టరాసుకుంటూ అప్పటికే వడ్డించబడిన పులిహోరనీ బూరెలనీ చూసి లొట్టలు వేస్తున్నారు వడ్డనలు పూర్తికాగానే అందరూ వచ్చేరో లేదో చూసు కొ 'గోవిందా' అంటూ పరిషేచనం

తంటకొల్ని రుచులు చూస్తూ "ఒహో! ఒహ్హొహ్హో! ఏమి వంటండి!! అమృతప్రాయం.. నలభీమపాకం'!!" అని పైకే పొగడ్తలు ప్రారంభించారు పెద్దలు కొందరు.

పెళ్లికూతురుకీ పెళ్లికొడుక్కి మధ్యగా వేశారు. ఒకే కంచం పెట్టారు.

"మీ ఆయనకి కలిపిపెట్టవే పాపం!" అంటూ పకపకా నవ్వుతున్నారు ముత్తయిదువులు.

వాళ్ళొక్కళ్ళా సిగ్గుపడుతున్నారు.

"ఎందుకల్లపదూ?" అన్నట్టుగా ఇప్పటినుండీ అధికారం ప్రకటిస్తున్నాడు పెళ్ళికొడుకు

నాకు నవ్వాగలేదు .

"వాళ్లిద్దరి మధ్యా ఎంగిలి అనేభావం ఉండకూడదని దాని అర్థం!" అంటూ ఒకాయన వ్యాఖ్యానించాడు శ్రేష్ మని శ్రేమస్తూ.

ఇప్పటికి నాకు పూర్తిగా అర్థం అయింది పెళ్ళంటే ఏమిటో

రెండు అమాయికహృదయాలను కలిపి ఒకటిగా చేసేది పెళ్ళి. ! ముక్కుముఖమూ తెలియని రెండు మానవజీవితాలను కలిపి ఒకపంథాలో నడిపిస్తూ ఆనందాన్నిచ్చేది పెళ్లి. ! జీవితంలో రెండో పాదంలో ప్రవేశపెట్టేది పెళ్లి.. ! పెళ్లిని గురించి తల్చుకుంటుంటే నాకు ఏదోలా అనిపించింది ఇక ఒక్క నిముషం అక్కడ ఉండలేకపోయేను. భోజనా లయ్యాక నేను పట్టుకువచ్చిన కప్పు ప్లేటూ మా శేఖరానికి ప్రెజంటుచేసి 'వెడతాన్రా' అన్నాను.

వన్ను కనిపెట్టినట్లుగా నవ్వేడు. పెడ్డింట చుట్టపెట్టి తిరుగు ప్రయాణం చేశాను.

* * *

వచ్చుటి పైరుచేలల్లోంచి ఘల్లు ఘల్లుమని చప్పుడుచేసుకుంటూ మైనాలు గిత్తలు పరుగులు పెడుతున్నాయి!

"ఎంత తప్పుచేశాను—నాన్న ఎంత చెప్పినావినకుండా పెళ్లి వసేమిరా వద్దన్నాను. నాన్న విసిగిపోయాడు. అపరాధం మన్నిస్తాడా నాన్న! పెళ్లేమిటని పెత్తే వేదాంతాలలో పడి నాన్నమనసుని కష్టపెట్టాను. నాన్న ఇష్ట ప్రకారం చేస్తాను పెళ్ళాడుతానని నాన్నతో చెబుతాను...

నాన్న క్షమిస్తాడు ..

నా కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి .పశ్చాత్తాపం కన్నీరుగా ప్రవహించింది.

నా మనస్సు తేలికపడింది! ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...ఐదవ భాగము




...గేయరచన...
నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు
వరమేదైనా ఇచ్చెద నడుగుము నరకుట నాపుము దీని!
"గడువిచ్చెద బో. ఆలోచించుకు నడిగెద" నన్నాడతడు
దారిలో నతని సోతికి మిత్రుడు, ఊరి మంగలి ఎదురాయె. మంగలితో వనమందలి యక్షిణి సంగతి చెప్పెను సోతి
సరి సరి అయితే, రాజ్యంబిమ్మని వరమడుగుటయె మేలు నీవిక రాజవు, నేనిక మంత్రిని భూవలయం బిక మనది!
భార్యారత్నం బేమనునో ఒక పర్యాయం బడిగెదను
వలదో సోతీ! భార్యను మాత్రం సలహా అడుగకు మెప్పుడు
మగువలు స్వార్థము కోసం బెంతటి తెగువనైన చేయుదురు ఇంతుల నడుగుట యనగా స్వయముగ గొంతు కోసుకొనుటోయి!
మంగలి మాటలు పెడచెవినిడి రెండంగలలో నిలుసేరి, అపరకాళి యగు ఆలిని సలహా చెప్పుమా' యనెనా సోతి
24

అతిరథులు-మహారథులు

రథులు, అర్ధరథులు, అతిరథులు, మహారథులు, అందరు అత్యవసరంగా సమికూడారు మహారథి 'మూర్తి' శిబిర మనబడే హాస్టలు రూములో. అతిరథులు, మహారథులు ఆసనాల నలంకరించి, సిజర్సు సిగరెట్లు కాల్చటం మొదలెట్టేపాటికి, రథులు, అర్ధరథులు చాపల మీద చతికిలపడి, తాజమహాల్సు తగలెయ్యటం మొదలెట్టారు కాని అందరి ముఖపద్మాలలో విచారరేఖలు వున్నాయి కాస్తోకూస్తో ప్రతివారూ తరుణోపాయానికై తహతహలాడుతున్నారు.

అందరికి మధ్యగా 'కథానాయకుడు' మూర్తి విచారసాగర డోలికల్లో తూగిసలాడుతూ, ఖిన్నుడై, మధ్య మధ్య తనలో తానే కుంగిపోతూ కూర్చున్నాడు.

మూర్తిఅంటే సామాన్యుడా నిక్షేపంగా, ఒకటి, రెండు పంచవర్ష ప్రణాళికల్లో, ఆ ఇంటర్ మిడియెట్‌ను కాస్త పీల్చి పిప్పిచేసి "మహారథి" అనే బిరుదుపొంది, అంతటితో తృప్తిజెందక, రేపో మాపో ఈ బి. ఎస్‌సి ని కాస్తా మారి అనిపించగల తాహతుతో తుల తూగుతున్నాడు. ఏదో యింటిదగ్గరనుండి, నెలనెలకు చచ్చినట్లు వచ్చే నూరు రూపాయిలకు, మరో అర్ధనూరు అప్పు జతజేసి వేన్నీళ్ళకు చన్నీళ్ళన్నట్లు సర్దుకపోతూవున్న ఆదర్శవిద్యార్థి కొద్దో గొప్పో సిగ్గు, లజ్జ, జ్ఞానం, తగిన మోతాదుల్లో గలవాడు కాబట్టే, కాదనకుండా రోజుకు, అరగా, అరగాను 5, 6 సార్లన్నా స్నో పూస్తూ, అడపా తడపా సినీనటు లుపయోగించే పౌడరునే వుపయోగిస్తూ కాలాన్నీడ్చుకొస్తున్నాడు

అలా పై సదరువిధంగా కళకళలాడుతూ కాలాన్ని వెళ్లబుచ్చే కథానాయకుడు "మూర్తి" ఓనాటి సాయంకాలం హఠాత్తుగా బోలెడు భగ్నహృదయంతోపాటు, చటుక్కున మాసినగడ్డం, సంస్కారరహితమైన తలతో హాస్టల్లో ప్రత్యక్షమయ్యేపాటికి, మిత్రులు, "ఏమిటీ విచిత్రం" అన్నట్లు ఆశ్చర్యపడి "రథికమండలికి ఎట్టి వుపద్రవం" రానున్నదో అని విచారపడ్డారు.

అప్పటికప్పుడే గుప్పుమంది. ఏముంది రోజూలాగే, ఈ రోజూ మూర్తి వుమన్సు కాలేజి అమ్మాయిలను ఉదయం 10 గంటలకు కాలేజికి తీసుకొచ్చి, మళ్ళీ సాయంత్రం 5 గంటలకు వారి వారి యిళ్లకు పంపించే కార్యక్రమంలో నిమగ్నుడై "కారుమీద కాలేజీకి" వచ్చే వకీలు కామేశ్వరరావుగారి అమ్మాయిని, అప్పటికీ కాస్త తటపటాయించి ఏదో అనేపాటికి ఆ అమ్మాయి కాస్తా కళ్ళెర్రజేసి, "కబడ్దార్" అంటూ కాలికున్న స్లిప్పర్సును వుపయోగించిందట.

అంతే, అతిప్రకాశవంతంగా వెలిగిపోయిన మహారథి మూర్తి మానమర్యాదలు మంటగలిసిపోయాయి ఆ సంఘటన ప్రభావమే ఈనాడిలా నీళ్ళూ, నిద్ర, కనీసం రెండోఆట సినిమా అన్నా లేకుండా, రాత్రి పదిగంటలకు రథికమండలిని సమావేశపరచింది మూర్తి శిబిరంలో.

కొద్దిగా క్రుంగిపోయిన మనసుతో అందుకొన్నాడు అతిరథుడుగా చెలామణి అవుతూన్న అనంతం, "ఇదిగో, మూర్తీ! గడచిన

గంధం యాజ్ఞవల్క్యశర్మ

దానికి నీలాంటి ధీరుడిలా విచారించటమనేది మన పూర్వ ప్రస్తుత రథికమండలికేగాక, భవిష్యత్తులో యేర్పడబోయె రథికమండలికీ, తీరని అవమానము నీ ఖ్యాతి, కీర్తి తెలియని ఓ అల్పురాలు, చేయిచేసుకున్నంత మాత్రాన మనం చేతులు ముడుచుకు విచారపడటం" నీళ్ళు నమిలినట్లు చప్పరించేసాడు

"అంతే మూర్తీ! జీవితంలో యిలాంటి సంఘటనలు లక్షలకు లక్షలు జరిగినవారంతా మరుక్షణంలో వాటిని మరచిపోయి మంచిగా మసలినట్లు ప్రపంచచరిత్ర ఎలుగెత్తి చాటుతోంది" అంటూ తన చరిత్ర జ్ఞానాన్ని వెళ్లగక్కాడు మరో మహారథి మాణిక్యారావు

ఏమీ మాట్లాడకుండా వుండటం బాగా లేదన్నట్లు "అవునవునన్నాడు" అర్ధరథి విఠల్ రావు.

మరికొందరు 'నిజమన్నారు'. యింకా మరికొందరు "నిజం, నిజం" అన్నారు.

శర్మ "అంతేరా, మూర్తీ! నిదురపోముందర, ఆ నిదురలో గతాన్ని మరిచిపో!" అన్నాడు చనువుకొద్దీ

"అలాగే చేస్తాడులే" అన్నాడు సత్యం భరవసాకోసం.

కాని కథానాయకునిస్థితి కడుఘోరంగా తయారయింది. గద్గదస్వరంతో '"ఒరేయ్ లాభం లేదురా; చేతులు జారిపోయింది. ఆ అమ్మాయిమీద అంతులేని ప్రేమ పుట్టింది. ఆ ప్రేమకు .." అంటుండగనే మూర్తి గొంతు పూడుకుపోయింది మనిషి నిలువునా నీరసపడిపోయి తల దించేసాడు.

మూర్తి మాటలు వినేపాటికి మిత్రబృంద మొక్కసారిగా వచ్చిన కష్టానికి హాహాకారాలు చేసారు.

మహాజ్ఞాని, మహారథి మహామహా మంచివాడైన మూర్తి ఈనాటికిలా "ప్రేమపిచ్చి"లో పడిపోవటంతో రథికమండలి విభ్రాంతి చెందింది.

తక్షణం "ఇది తగదు" అనే నిర్ణయాని కొచ్చేసింది. ఆ నిర్ణయానికి రావటమేమిటి, మరు నిమిషంలో నిర్భయంగా, నిర్ణయాన్ని ప్రకటించింది

ఏమైనా మూర్తి "మహారథి" ఆ నిర్ణయాన్ని శిరసావహించటానికి సాహసించ వస్నాడు. "కావలిస్తే మిత్రుల్ని, తల్లిదండ్రుల్ని, చివరకు సినిమాలనుకూడా త్యజించి భగ్నహృదయంతో బాధనైనా సహిస్తా కాని "కామేశ్వరరావుగారమ్మాయి, కమలాన్ని కాదనటం కలలోని కబురు" అంటూ అవిరళంగా పొర్లుకవస్తున్న దుఃఖాన్ని ఆపుకొంటూ చెప్పేశాడు.

కథ అడ్డంతిరగటంతో, మాణిక్యారావు మాటలుడిగి, మౌనం వహించాడు

అనంతం ఆలోచించటం మొదలెట్టాడు. సత్యం, శర్మ చెరోప్రక్క మూర్ఛజెందే ప్రయత్నంలో పడ్డారు.

* * *

రాత్రి తెల్లవార్లూ తర్జనభర్జనలుజరిగాయి తలో వుపాయాన్ని సూచించారు.

కొన్నాళ్ళపాటు మౌనం వహించటం మంచిదన్నాడు మాణిక్యారావు

"కాదు, వేడిలో వేడి. ఏదో నిర్ణయం ఇప్పుడే జరగా"లన్నాడు సత్యం.

చివరకంతా ఓ నిర్ణయానికి రాబోయి, రెండు మూడు నిర్ణయాల కొచ్చేసారు—

మొదటిది "మూర్తి" పేపరుబాయ్‌గా చేరి ఆరూపేణా "కమలం" ప్రేమకు పాత్రుడవ్వటం; రెండు "రిక్షావాలా"గా మారి అదే ఆదర్శాన్ని సాధించటం. ఇక చివరిసారిగా "కామేశ్వరరావుగారి కాళ్లావేళ్లా పడి, ఆయనదగ్గరే గుమస్తాగిరి సంపాదించటం.

అంత ఆదర్శసాధనలో, ఈ మాత్రపు హైన్యానికి పాల్పడటం ఏమంత గణనీయం కాదని, 'అపత్సమయం, ఆపద్ధర్మంలాంటి పదాలు తోడునీడగావుండగా పైనిర్ణయాలు, పనికిమాలినవి కావని నిర్ణయించారు.

అందరూ "భలే" అన్నారు.

మూర్తి "సరే" అన్నాడు.

* * *

కష్టాలన్నీ కట్టకట్టుకొస్తాయి ఈదుర్దినాల లోనే మరికొన్ని దుర్వార్తలు, 'రధికమండలిని' రంపపుకోత కోసాయి

మూర్తి చేసిన ప్రయత్నాలన్నీ మొహమాటం లేకుండా విఫలమయ్యాయి కామేశ్వరరావు కాదన్నాడు పేపరు ఏజంటు వీల్లేదన్నాడు. రిక్షావాలాపని, బహువాటంగావున్నా కమలానికి కొరు వుందనే విషయం జ్ఞాపకాని కొచ్చేపాటికి నీరు కారిపోయాడు-మూర్తి

ఇపుడు మూర్తిమూర్తే మారిపోయింది, గడ్డం రెట్టంపైయింది విచారం రెండింతలయింది, దుఃఖం వుప్పెనలా పొంగుకొస్తోంది

మూర్తి రూపే కాదు, రూము స్థితిగతులూ మారిపోయాయి, సర్వ కాల సర్వావస్థలయందు విడనాడకుండా టేబుల్ ను అలంకరించివుంటే సినీనటీమణుల చిత్రాల స్థలాల్లో, ప్రపంచ ఖ్యాతికొంచిన భగ్నహృదయులు, ప్రేమపిపాసులైన దేవదాసు, ఖయస్, సలీమ్‌ల చిత్రాలు వచ్చాయి పొరపాటున కూడ "ఆలోచించటమనే" చిక్కులోపడని, మూర్తి యిప్పుడు సర్వకాలసర్వావస్థలయందు ఆలోచనాపరంపరలలో మునిగి తేలుతున్నాడు.

నిమిషానికో ఆలోచన — క్షణానికో నిర్ణయం—"ఆకాశంలో శూన్యం వుందనే" విషయం నిమిష నిమిషానికి అవగాహ నవుతోంది.

* * *

టౌనులో తెల్లవారిన రెండు మూడు గంటలకే హాస్టల్లో భళ్లున తెలతెలవారింది అంత తొందర్లో తెల్లవారినందుకే ఆశ్చర్యపడుతూ వుంటే, "మహారధి మూర్తి" రూములో లేడురో, అనే వార్తలాంటి కేక, అందర్నీ ఆశ్చర్య స్థితినుండి, చటుక్కున స్తంభించే స్థితికి లాక్కెళ్ళింది

పట్టుమని 8 గంటలన్నా కాకముందే మూర్తి నిద్రలేవటం, పైగా, రూమునుండి అదృశ్యుడవటం! ఎక్కడివారక్కడే త్వర త్వరగా తయారయి టౌనులోకి పరుగెత్తారు "మహారధి" ఏ యుద్ధభూమి కెళ్లాడో చూడటానికి.

అర్ధ గంటలో అంతా తెలిసిపోయింది మూర్తి 'కమలం కారుక్రింద పడ్డాట్ట'

"ఆ!" అంటూ పరుగెత్తారంతా, కొత్తగా తెరువబడ్డ డా॥ రఘునాధ్ హాస్పిటల్ కేసి.

★ అతిరధులు - మహారధులు ★

చావుబ్రతుకులమధ్యకన్పించాల్సినమూర్తి "చిరునవ్వు - పాడినవ్వు" మధ్య హాయిగా మల్లెపూవులాంటి పరుపుమంచంమీద కన్పించాడు నెత్తురుముద్దలో కన్పించాల్సిన మూర్తి శరీరం సర్వశోభితంగా వుంది. ఎటొచ్చీ ఒకకాలిదగ్గర, ఒకచేతిదగ్గర, రెండేరెండు కట్లులాంటివి కట్టబడివున్నాయి అంతకన్నా ఆశ్చర్యకరమైంది, మహాశ్చర్యప్రదమైనది "కమలం" కమలం అందించేపోజులో మూర్తిప్రక్కనే మూర్తీభవించిన కావ్యసుందరిలా కన్పించటం—

రధికమండలి, ఆదృశ్యం చూడటంతోనే అవసరంగా నివ్వెరపడి, తటాలున తిరోగమించింది హాస్పిటల్ నుండి హాస్టలుకు.

* * *

ఆ సాయంత్రమే వివరాలు సేకరించుకొచ్చాడు మాణిక్యారావు

ఇదంతా మూర్తి తెలివితేటలకు సూచన అట. తెల్లవార్లూ ఆలోచించిన మూర్తి, యుక్తిగా కమలం కారుక్రింద పడటానికి నిశ్చయించుకొనే ఆ పని చేసాట్ట "అసలు, అంతో యింతో, హాస్పిటల్ లో అమ్మాయిలకు లక్షణంగా ప్రేమకలుగుతుంది" అనే నమ్మకంకలవాడు కొబట్టే, ఈ పనికి సాహసించాట్ట—అంతే పాచిక పారింది. కమలం తనంతట తను కారుమీద హాస్పిటల్ కు తీసికొనిపోవటమేకాక స్వయంగా శుశ్రూష చేసుకొని, ఆప్యాయంగా తనకు పరిచర్య చేయటానికి నిశ్చయించుకొందిట.

అంతా చెప్పి మూర్తి అదృష్టాన్ని వేనోళ్ల కొనియాడాడు మాణిక్యారావు

"వాడంతటివాడే" ఆనందంతో అంతా తీర్మానించారు

ఆనాటినుండి అడపాతడపా వార్తలు వస్తూనేవున్నాయి మూర్తినుండి

గాయాలతోపాటు, మూర్తి ప్రేమకథా మెరుగవుతోందట నానాటికీ!

ఓనాటి సాయంకాలం సత్యం, అందుకొచ్చాడు వార్త. "కమలం ఈమధ్య కొలా



అక్కా తమ్ముడు

ఫొటో: వి. లీతు—కర్నూలు.

న్నంతా మూర్తిగాడిదగ్గరే గడిపేస్తున్నదట. డా॥ రఘునాథ్ కు మరీ మరీ చెప్పి మందు లిప్పించేస్తున్నదట."

మర్నాటి ప్రొద్దున్నే వార్తను లాక్కొచ్చాడు, శర్మ "మూర్తి కోసం ప్రత్యేకంగా మందులు కొనుక్కు రావటం కోసం అర్ధరాత్రికి అర్ధరాత్రి డాక్టరును సైతం బలవంతపెట్టి కారులో పెద్ద బజారు కెళ్ళి మందులు పట్టుకొచ్చిందట.

తరువాతరోజే 'ఎక్స్ ప్రెస్' లాంటి వార్త పట్టుకొచ్చాడు, విఠల్ రావు "కమలం బజార్లో ఫులెన్ ప్యాంట్లు, సిల్కు షాక్కాలు" కొంటోందట

తదుపరి క్షణంలో టెలిగ్రాములా దూకేశాడు, అనంతం "కమలం మూర్తికి ప్రేమ పుత్తరాన్ని ఓదానిని సమర్పించటం జరిగిందట ఆ జరగటాన్ని సాక్షాత్తు కళ్ళారా చూచాడట తను—

"ఎలాగైనా అబలకదూ, నోటితో చెప్ప లేకపోయింది" అంటూ ముగించాడు అనంతం.

మూర్తిగాడి పెళ్ళికి కావలసిన ఏర్పాట్ల విషయం ఆలోచించటం మొదలెట్టాడు అర్ధరథి విఠల్ రావు.

"ప్రేమ తపస్సులో సఫలీకృత మనోరథుడై "ఆంధ్ర దేశంలోని అర్ధ, అతి, మహారథులారా మీరు సాధించాల్సిన విజయాలు పనికిమాలిన పరీక్షల మీద కాదురా" అన్నట్లు కొరడాచరిచినట్లు చెప్పగల్గిన తమ అనుచరుడు, సహాదరుడు, సహ మహారథుణ్ని తలుచుకొని మురిసిపోయి గర్వపడ్డారంతా!

ఈ మాత్రపు చిన్న గర్వంతో తృప్తి పడితే లాభం లేదన్నట్లు ఒక్కుమ్మడిగా "మూర్తి నభినందించటానికి" ద్విచక్ర వాహనాల నెక్కారంతా.

అంతలోనే అశనిపాతంలా వూడిపడ్డాడు ఓ దారినపోయే దానయ్య—చేతిలో ఓ కాగితంతో వస్తూనే, అందరికి సమస్కరించాడు. నమస్కరిస్తూనే సమర్పించాడా కాగితాన్ని. సమర్పిస్తూనే, దారినబడ్డాడు, తన కింకేం పని లేదన్నట్లు.

సత్యం, సగర్వంగా అందుకోబోయాడాజాబును. అంతలోనే, అనంతం అందుకొన్నాడు. విఠల్ రావు విప్పాడు శర్మ చదవటం మొదలెట్టాడు,

"మిత్రులకు—

మళ్ళీ విచారంలో మ్రగ్గిపోతూవున్న మహారథి మూర్తి—

అంతా దగా! మోసం!

కమలం యిన్నాళ్ళనుండి సన్నాదరించి నట్లు నటించినా ఆమె ప్రియుడు డా॥ రఘునాథ్. వాడికోసమే యిన్నాళ్ళనుండి రాత్రింబవళ్ళు కొలుకాలిన పిల్లిలా కాచి, వేచివుంది; చివరకీనాడు, "ఓ బాబులో," తను రఘునాథ్ ను పెళ్ళాడబోతున్నానని, తనపై నాకు ఆశలుగలవనే విషయం చూచాయగా గ్రహించానని, అలాంటి పిచ్చి పిచ్చివేషాలు వేస్తే... తగినశాస్తి... సగౌరవంగా జరుపుతానని వ్రాసింది.

అంతేగాదు రఘునాథ్ తో తన వివాహం నిజమనే ధృవపత్రం (శుభలేఖ) కూడ పైజాబుకు జతచేసింది.

ఏం చెయ్యను పుట్టెడుదుఃఖం ముంచుకొచ్చేస్తున్నది. తక్షణం హాస్టలుకేసి వద్దామనుకొంటే రఘునాథ్ బిల్లు చెల్లించి కదమని కళ్ళెర్రజేస్తున్నాడు. రేపో మాపో హాస్టలు చేరతాను అల్పరథిగా.

ఇట్లు

మూర్తి—"

రథులు, అతిరథులు, మహారథులు అంతా నిశ్శబ్దంగా, రథాలను వెనక్కి తిప్పి తిరోగమించారు తిన్నగా "హాస్టల్ కేసి" అల్పరథులమైనామన్నట్లు ★



పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
Rexona
BLENDED WITH CADYL
రెక్సోనా సబ్బులో, కేడిల్ ... చర్మమును పోషించునట్టువంటియు మీ సహజ సౌందర్యమును బయల్పరచుటకు సహకరించునట్టువంటియు ఒక ప్రత్యేక నూనెల మిశ్రమము గలదు.
ఇది ఒక్కటే కేడిల్‌తోగూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరి లిమిటెడ్ తరపున భారతదేశంలో తయారుచేయబడినది
RP. 148 X52 TL

వనితా లోకం

అప్పులూ: వాటిలో తప్పులూ ఒప్పులూ

సాధారణముగా కొంతమంది స్త్రీలకు అన్నీ అప్పులుచేసే చెడ్డ అలవాటు చాలావుంటుంది తగినంత అవసరము వచ్చినపుడు అప్పుచేయనిదే ఎవ్వరికీ గడవదు, కాని, కొంతమంది స్త్రీలు చీటికీ మాటికీ అప్పులుచేస్తూవుంటారు. నెలజీతము రాగానే ఇంట్లోకి కావలసినసరుకులన్నీ, ఒక కాగితము మీద వ్రాసుకుని, అన్నీ ఒక్క సారిగా తెప్పించుకుంటే, అప్పుచేయవలసిన అవసరమేరాదు.

ఎప్పటికప్పుడు

అల్లాకాకుండా కొంతమంది అన్నీ అప్పటికప్పుడు తెప్పిస్తూవుంటారు. దానివల్ల ఖర్చు తగ్గేదేమీ లేకపోగా, అణా, బేడా, నష్టము. ఒకసరుకు తెచ్చుకునేసరికి ఇంకొకసరుకు అయిపోతూవుంటుంది. అయే ఖర్చు ఎల్లాగూ అవుతూనేవుంటుంది కొంతమంది ఇంట్లో ఏమి సరుకులు వున్నాయో, ఏమి లేవోకూడా చూసుకోరు. అయిపోయే సరుకు రెండురోజులుముందుగా చూసుకొని తెప్పించుకోవడం అవసరంఅనికూడా ఆలోచించరు. అన్నీ అప్పటికప్పుడు చూసుకోవడం, కావలసినసరుకు లేకపోతే, అప్పుకు బయలుదేరడం, కొంతమంది మొగవాళ్లు చూస్తే కోప్పడుతారని చాటుగాకూడా అప్పులుచేస్తూవుంటారు. తీసుకున్న వాళ్ళు తొందరగా ఇస్తారేమో అంటే అదిలేదు. మళ్లీ మనము అడిగేదాకా ఇవ్వరు,—

అప్పుతీసుకు తప్పులు ఒప్పగించడం

ఇదివరకు ఒకావిడ మా ఇంట్లో 5 చెంచాలు కాఫీపొడి బదులుతీసుకువెళ్లింది. ఎన్నాళ్లకూ ఇవ్వకపోగా తిరిగి మేము జ్ఞాపకముచేసి అడుగుతే, 5 చెంచాల కాఫీ పొడికి 4 చెంచాలే బదులుతీరుస్తూ, మాది బజారులోకొన్న కాఫీపొడి, దాంట్లో చింతగింజలపొడివగైరాలు అన్నీ కలుస్తాయి. మాది ఇంట్లోగింజలువేయించి కొట్టినపొడి కనుక 4 చెంచాలు ఇస్తున్నానని నిర్మొహమాటంగా ఆవిడ చెపుతూవుంటే, మాకు చాలా ఆశ్చర్యం వేసింది,—

తప్పనిసరి అని...

కొంతమందికి, కొత్త సినీమా రావడం తడవు ఆ సినీమా చూసేవరకూ వారికి నిద్దరపట్టదు ఇంట్లోఖర్చులకు తరువాత డబ్బు చాలకపోయినాసరే, ముందు సినిమాచూసి తీరవలసిందే, అంతగా తరువాత ఖర్చులకు డబ్బుచాలకపోతే అప్పయినాచేస్తారు కాని, ముందు సినీమాలు చూడడముమాత్రం తగ్గించరు. చేతిలోడబ్బువున్నప్పుడు ఎన్ని సినిమాలైనా చూడవచ్చును కాని, అవసరమైనఖర్చులకు అప్పులుచేసుకుని అన్ని సినీమాలు విడిచిపెట్టకుండా చూచేస్త్రీలు ఈరోజులలో చాలామంది వుంటున్నారు అప్పుడప్పుడు మంచిసినిమాలేవైనా చూడవచ్చును కాని, అదేపనిగా చూస్తూవుంటే ఒక అలవాటుగా మారుతుంది, చూసినకొద్దీ చూడాలని అనిపిస్తుంది,—

తప్పక దొరుకుతుందని....

మా ఇంటి ఎదురుగుండా ఇంట్లో, ఇద్దరు తోడికోడళ్లు వుండేవారు. వారు మాతో స్నేహంగా మాట్లాడుతూ వుండేవారు కాని అస్తమాను అప్పులకు వస్తూవుండేవారు. ఒక్క సరుకు ఎప్పుడూ అడిగేవారుకాదు. జంటగా అడిగేవారు (అనగా) "కందిపప్పుకాని - పెసరపప్పు కాని", "నెయ్యికాని - నూనెకాని", "కాఫీ పొడికాని-టీ పొడికాని" "పంచదారకాని-బెల్లంకాని" ఇట్లా అడుగుతూ వుండేవారు. రెండూ లేవనరు ఏదో ఒకటైనా ఇస్తారని వారి అభిప్రాయము. ఏదోఒకటి ఇవ్వకపోతే వారికి కోపం వచ్చేది ఇస్తే, మనం అడిగేవరకూ ఆ సరుకు ఇచ్చేవారుకాదు. ఈ విధంగా అప్పులుచేస్తూ వారు, నెలకు మూడు సినీమాలు చూసేవారు,.

అప్పు తప్పుకాదు కాని....

ఏ సరుకైనా అవసరం వచ్చినపుడు అప్పు తీసుకోవడం తప్పనికాదు. కాని, అప్పు తీసుకున్నవారు కొంతమంది, కొన్ని రకాలుగా ప్రవర్తిస్తారు, కొంతమంది రెండు రోజులలో ఇస్తామని తీసుకున్న సరుకు, రెండునెలలైనా ఇవ్వరు రెండు నెలలుకాదు సరికదా? అసలు మనం అడిగేవరకూ కూడా ఇవ్వరు కొంతమంది, తీసుకున్నంత ఇవ్వకుండా తగ్గించి ఇస్తూవుంటారు కొంతమంది కొంతమంది మీరిచ్చినసరుకు మంచిరకంకాదు. మేము అట్లాంటి సరుకులు తెచ్చుకోము అని పేర్లు పెడతారు. ఖర్మంచాలక వారు అడిగిన సరుకు మనింట్లో లేకపోతే, నిజంగా వుండీకూడా లేదన్నారంటూ, అందరిదగ్గర ప్రచారం చేసే వాళ్ళు కొంతమంది - ఇట్లా ఎన్నోరకాలవారుంటారు, సాధ్యమైనంతవరకూ ఆడవాళ్లు అప్పులు తీసుకునే అలవాటు తగ్గించుకోవడం మంచిది. ★

వారణాసి సుబ్బలక్ష్మి

ఇరుగు పొ

ఇరుగు పొ

ఇరుగూ, పొరుగూ అంటే మనపటి లోకాలో అర్థం: ఎంతో సహకారం, కలుపుగోలు తనం, సహనముతో కూడిఉంటే సంబంధబాంధవ్యాలు అని. అసలు ఇరుగు పొరుగు అన్న పదాల్లోనే ఏదో బాంధవ్యము, ఆత్మీయత, ధ్వనిస్తాయి. ఆనాడు ఆడపిల్లను అత్తవారింటికి పంపడం మొదలుకొని, ఆపదలలో ఆదు

....చెవులకు గోడలుంటాయి.



"పిన్నిగారూ పదిరోజులనాడు పట్టుచీర పట్టికెళ్ళారు పేరంటానికి పనిఅయితే ఇచ్చేస్తారా?"

"బియ్యంధరలు పెరుగుతాయట తెలుసా అమ్మడూ."

కోవడంవరకూ, ఉత్తరం రాసి పెట్టటం మొదలుకొని ఊరగాయలు పెట్టటందాకా, ఇరుగు పొరుగులమీదనే ఆధారపడి ఉండేవి. అప్పడాలు, వడియాలు, పెండ్లిపనులు, పిండివంటలు చేయడం మొదలయిన పెద్దపనులన్నీ పక్కవారి సహకారంతోనే జరగాలి మరి. చటుక్కుని ఇంటికి బంధువులు వస్తారనుకోండి. అన్నంగాని కాఫీగాని సిద్ధంగా ఉండకపోవచ్చు. అటువంటప్పుడు ప్రక్క ఇంట్లోంచి తెచ్చి పెట్టనూవచ్చు. మళ్ళీ వాళ్ళబ్బాయి స్కూలునుండి మధ్యాహ్నం వచ్చే వేళకు వండి ఇవ్వనూవచ్చు. ఇది ఎంత హాయిగా ఉంటుంది. ఉదాహరణకు చెప్పానుకోండి పైసంగతి.


మా అత్తగారి కాలంలో ఒక ఇల్లాలు, 'ఈ ఎండలో నువ్వు కాలవదాకా ఏంవెళ్ళగలవులే' అంటూ రెండుబిందెల మంచినీళ్లు మాఇంట్లో పోసి మరో రెండుబిందెలు తనఇంటికి పట్టుకు వెళ్ళేదని చెపుతూంటారు. చామంతిపువ్వులు ముచికలు దగ్గరనుంచీ (పొరుగువారివి) ఇంట్లో పోసుకొనే మనుష్యులు నాడు, నేడు కూడ ఉండవచ్చు కాని అది వేరేవిషయం. పోనీ ఉపకారం లేకపోతేమానె అపకారమయినా చేయకుండాఉంటే వాళ్లు బుద్ధిమంతులే అంటాను.

ఊసురుపెట్టే విసురు

ఇరుగుపొరుగుల ఈతిబాధనుగూర్చి చెప్ప వలసివస్తే ఎంతయినాఉంది. శ్రీ పానుగంటి వారు చెప్పినట్లు (ముల్లు నూడదీయుటకు పుప్పము పనికివచ్చునా) అసభ్యతను విమర్శించేటప్పుడు కొంత కఠినంగా చెప్పక తప్పదు. ఒకప్పుడు మా పొరుగున ఉన్న యోగ్యులను గురించి చెపుతాను వినండి. ఒకాయన ఉన్నాడు. ఆయనపని ఏమిటంటే

★ అల్లమరాజు

ఊరంతా సంచారంచేస్తూ (మధ్య మధ్య మా దొడ్లో కొబ్బరిమట్టలూ, పక్కవాళ్ళ వాకిలోని నిమ్మపిందెలు వగైరా ఇంట్లో భద్రపరుస్తూనే అనుకోండి) ఎవరింట్లో వానకురుస్తోందో ఏఇంట్లో భార్యాభర్తలు పోట్లాడుకొన్నారో ఒకటేమిటి? భోజనాలవేళదాకా



స్వపరభేదాలు లేవు!

రుగులా?

రుగులా?

పర్యటించి అన్నీ తెలుసుకుని మరీవస్తాడు. అక్కడనుంచి ఎత్తులు, ప్రణాళికలు తయారు చేస్తాడు. అంటే ఏగొడవాలేని దంపతు లున్నారనుకోండి. ఈ ప్రబుద్ధుడు వారం రోజులపాటు వాళ్లి ఇంటిచుట్టూ తిరగడం. వాళ్ళ గుమ్మానికెదురుగా రోడ్డుపై నుంచుని లోపలికి చూడ్డం ప్రారంభిస్తాడు. పిమ్మట (ఆయింటి ఆయనకు కొంత అనుమానం ఏర్ప

సర్వమంగళ ★

డ్డాక) ఎవరో తనను పిలుస్తూంటె ఎందుకు న్నట్లు చూసేచూపులాచూస్తాడు. దాంతో ఇంట్లోవాళ్ళకీ, వీధిలోవాళ్ళకీ, లేని పోని అనుమానాలు ఏర్పడతాయి. వీధిలో వాళ్ళ యితే అపవాదుతో సరిపెడ్తారు, కాని ఇంట్లో వాళ్ళవల్ల స్త్రీ పడేహింస ఇంతా

అంతా కాదు. ఆడవాళ్ళ ఉసురు ఏమీ ప్రకృతం ఆయోగ్యుడికి తగలడంలేదు కాని అలాటి వారి విసురులో ఎన్ని కుటుంబాలో నాశనమవుతున్నాయన్నది పరమసత్యం.

ఇదో వరస

మానాన్న గారు ఊళ్ళో లేనప్పుడూ, మేడ మీద పడుకున్నప్పుడూ నేనూ మా ఫ్రెండ్లూ హాల్లో కూర్చుని గవ్వలాడుతూనో, ఏ పుస్తక మయినా చదువుతూనో కాలక్షేపం చెయ్యడం పరిపాటి. అలాంటప్పుడు (ఇంట్లో చాలా చోటున్నా ఎదరెండతో బాధపడుతున్నా సరే) వాళ్ళ అరుగుమీద కూర్చున్న ఎదరిం టాయన అదేపనిగా చూస్తూవుంటే ఎలా ఉంటుంది! దురుద్దేశం కావచ్చు. సదుద్దేశం కావచ్చు. అసలు ఏఉద్దేశం లేకపోనూవచ్చు, కాని ఇంటిమగవాళ్ళు లేనప్పుడు కూడా సరదాగా కాలక్షేపం చేయడానికి ఈగ్రహ బాధ తప్పదు. మేమయితే విశాలమయిన


ఇల్లుకనుక తిట్టుకుంటూ కూర్చోటని పోతాం. కాని పక్కఇంటి ఇల్లాలు ఉంది. ఆవిడకు ఒక్కర్తే కూతురు. వాళ్ళు అద్దె కున్న వాటాలో పొడుగ్గా ఒక్కటేగది. పైన బల్లకూర్పేమో, మామిడిపళ్ళకొవుకు బాగా పనికివస్తుందనిపిస్తుంది.

గోడకు చెవులుంటాయి....



"విన్నారాః... పొలంతా కట్టుపెట్టు కుంటున్నారుట. కొంచెం ఇసింటారండి బాగా వినొచ్చు.


గాలిదూరని ఆ అరలో ఇంటాయన ఆఫీసుకు పోగానే ఆ తల్లీ కూతుళ్లు త్వరగా పనులు ముగించి ఏ స్నేహితురాలి ఇంటికో వెళ్ళి గాలి పీల్చుకొనేవారు. ఈ సుబుద్ధి వెళ్ళి వాళ్ళ అరుగుమీద కూర్చో వడంతో ముక్కు మూసినట్లయి ఎంతోబాధ పడేవారు. వెనకొక్కల దొడ్డిలేదు. పెరటి గుమ్మంలేదు. కూర కొనుక్కోవలసి వచ్చినా బావికి వెళ్ళినా గుమ్మంలో శిలలాగా స్థిరంగా ఉంటాడాయె. వీళ్ళేమో సామాన్యులు అతనేమో లక్షాధికారి అవడం చేత లెమ్మని చెప్పలేక బాధ పడలేక అలమ టించేవారు పాపం ఇదీ వరస.



కిష్టానంద స్వామి

ఇరుగుపొరుగుల చెదపురుగులు

పక్కవాళ్ళ, బాత్‌రూమ్ కిటికీలోంచి విన కేకలాదగ్గడం, ఘోరమయిన తన కంఠంతో గానంచేయడం, పాటరాకపోతే కక్కడం సాగిస్తున్నా డొక పెద్దమనిషి. మళ్లీ పక్కవాళ్ళ పిల్లలు తన ఇంట్లో కాగితంముక్క చింపిపోసినా ఏడుస్తాడు. వాళ్లీ పీడ వదిలించుకోడానికి మరో గదిని బాత్‌రూమ్‌గా వాడుకొంటున్నారు పక్క వాటావాళ్లు. కొనుక్కున్న బెండకాయలు సయితం, ఉయ్యాల తొట్టిలోని గిలక దగ్గరనుంచీ మాయంచేసే గౌరవనీయుణ్ణి నే నెరుగుదును. ఈయన ఒకసారి మాకు పెద్ద టోపీవేశాడు. ఆవేళ అమెరికానుంచి మా బావ వచ్చాడు. స్నానానికి వస్తూ సావిట్లో బీరువామీద వాచీ పెట్టి లోనికి వచ్చాడు. అంతే! వాచీ లేదు. పైనచెప్పిన పెద్దమనిషి వచ్చివెళ్లాడు. అలా వెనకపాటుగా వచ్చి ఇంట్లో వాళ్ళేం చేస్తున్నారో చూసి వాళ్లు తనను గమనించకపోతే వాళ్ళను పలకరించకుండానే వెళ్లిపోయే ఈ సి. ఐ. డి కి నా చిన్నతనంలో అనేకసార్లు కాళ్లక్రింద పల్లేరుకాయలు పోసేదాన్ని. ఆ నాడు ఇంట్లో నౌకర్లమీద పనిమనిషిమీద మా నాన్న అనుమానించి హింసించడం నన్నింకా కలవరపెడుతూనే ఉంటుంది. పసితనంలోనే స్వచ్ఛమయిన మనస్సుపై కఠినముద్రపడి నాటికీ నేటికీ వికలంగానే ఆ దృశ్యం కానవస్తుంది. అంతక్రితం పెద్ద చదువుకున్నవాడు తెలివయినవాడు మంచివాడు అనుకుంటున్న బావ నా దృష్టిలో పరమ కఠినుడుగా మాత్రం నిలచిపోయాడు. ఇది జరగడంతో ఆ వాచీ దొరకనూ లేదు, బావ మళ్లీ రానూలేదు. కాని ఆ మర్యాదస్తుడు ఇటీవల (పది సంవత్సరములు గడిచాక) ఒకరికి అమ్మినట్లు తెలుసుకొని ఔరా! ఈయనా! అని ఆవలించాం, మేం పేరంటానికి వెళ్లొచ్చేలోగా మా పెరట్లోని చెంబులు, బట్టలు మాయమవుతుంటాయి. ఏ పనిమనిషిమీదకో పోతుంది. ఓ సారి మా ఇంటికి చుట్టాలు వచ్చారు. కనుచీకటి వేళ కారులోంచి దిగారు. తెల్లవారుజామున డీజెలులో వెళ్లిపోయారు. ఈయనకూతురు నన్ను అడిగింది ఆ అమ్మాయి అంతలావుగా ఉందేమిటే! అని. వీళ్ళు మా యింటికి



“శాస్త్ర అసింటాపోద్దూ
కావలిస్తే వాళ్లే అఘోరిస్తారు.”


రాలేదు, అయినా లావో, సన్నమో వీళ్లకు ఎట్లా తెలిసిందంటే ఆరుబయట రాత్రి అందరం కుర్చీలో కూర్చున్నప్పుడు వీళ్ళ గోడకేసి చూసి మా కుక్క తెగ మొరిగింది. గోడకి నిచ్చెన వేసుకు చూశారు. గ్రహించలేకపోయాము బాగుందా!

అప్పుల కుప్పలు

చీటికీ మాటకీ, ఓ రూపాయి ఉంటే ఇద్దురూ అనో, లేకపోతే మా అమ్మ ఒక కుంచెడు బియ్యం ఇయ్యమందనో, అడిగే వారూ అడిగితే లేదనలేక ఇస్తే (తీర్చక) బాధించేవారుకొందరు. చాలామంది ఆర్థికంగా లేక కొంతా, కేవలం బద్ధకంవల్ల కొంత, సరుకు సకాలానికి అందక కొంతా పిసినారితనంవల్లా, చేస్తూంటారు. వీళ్ళు లేదు పొమ్మంటే నిష్ఠూరంచెయ్యడం తప్ప ఏం చెయ్యలేరు, అనుకోండి.

కోర్టు వ్యవహారాల్లో తలలుమార్చే ఘటికుడు ఒకాయన ఉన్నాడు. ఎవరికేం ముప్పు తెస్తాడో అని ఇరుగుపొరుగువారంతా దడుస్తూ ఉంటారు. వాళ్ళబ్బాయి మన యింటికివచ్చి కమలమ్మత్తా! మా నాన్న ఓ కుంచెడుబియ్యం ఇమ్మన్నాడు అంటే బదులా? బిక్షా? చెప్పండి. గోడమీద పిల్లి వాటంగా అడుగుతాడు, దీన్నే వీరముష్టి అంటూ ఉంటారు. ఏమోయ్ ఓ సిగరట్టు ఇలా పారెయ్యి ఓ కిళ్ళీ యిచ్చుకో యిత్యాదులు. యివ్వకపోతే యేమిటి భయం అని నేనంటే అపకారం చేయకుండా ఉండడమే మనకుఉపకారం అంటుంది మాఅమ్మ. ‘మా నాన్న ఇమ్మన్నాడు’ (అధికారయుక్తంగా) అన్నాడు గనుక ఆయనగారి శ్రీమతి ఏ పేరంటంలోనో గోచరించినా, అడగడానికి మాకు దమ్ములుచాలవు. ఆవిడ దర్జా చూస్తే అజంతాచీర అంచుల్లోనే మిన్నంటుతూ ఉంటుంది.

పనిమనిషికి చీకటితోనే తలుపు తీసేటప్పటికి ఒకాయన సిద్ధం. కాఫీకుంపటికి ఆరు గజాల దూరంలో కూర్చుని వెయిట్ చేస్తూ ఉంటాడు. కమ్మని ఫిల్టరుకాఫీ (ఒక్క సేరు మాత్రం) యివ్వగలస్తోమతు అందరికీ ఉంటుందా చెప్పండి? ఒక్కోసారి ఈనోరు గల మానవుడికి ముందు కాఫీఇచ్చి, రెండో సారి కాఫీ మా నాన్నగారికి యివ్వడం జరుగుతూ వుంటుంది. పల్చగాయిస్తే మాయింట్లో కాఫీలా లేదమ్మాయి లాభం లేదు అని చప్పరించి, లంకాకుచుట్టా, ఒక తాంబూలం సేకరించి, ‘పొలంలోంచిగడ్డిబళ్ళు వచ్చాయా! అరిటికాయలు ఏమన్నా తెప్పించావా!’ అంటూ కుశలప్రశ్నలువేసి, గునపం దగ్గిరనుంచి ఎడ్లజతవరకూ, (ఎరువివ్వడం అనేది) విధించి చక్కాపోతాడు. మా యింటి కెదురుగాఉన్న యిల్లాలు నిత్యమూ ఒకటే ఆలాపన వెంకమ్మక్కయ్యా ఓ వెంకమక్కయ్యా అని, గోడవద్దకొచ్చి పిలిచేది. అవతలవాళ్ళు సాటివాళ్లుకదా ఇవ్వకపోతే బాగుండదనో, లోపలున్న ఉపకారబుద్ధి సలుపుతూ వుండడంవల్లనో మా అమ్మ తింటూన్న అన్నంకూడా, వదలిపెట్టి వెళ్ళేది. ఆవిడ పిలిచేవేళ, యీవిడ విస్తట్లో వడ్డించుకొనేవేళ ఒకటి. నేను మా అమ్మమీద చిరాకుపడితే మర్యాదకో పరోపకారానికో అంటగట్టి ఉపన్యాసం ఇస్తూ వుండేది అమ్మ. ఇంతకూ గోడదగ్గిర మహద్విషయం ఏమిటంటారేమో! చూడు వెంకమ్మప్పా మా అల్లుడు వచ్చాడు. కొన్న నెయ్యి వేసుకోడు. మీ యింట్లో నెయ్యి గుమగుమలాడుతో దివ్యంగా ఉంటుందని ప్రారంభిస్తే గొప్పకోసం ఈ వెంకమ్మప్పబీరువాలోది నేతిసీసాతీసిఇస్తుంది. మళ్ళీ ఆ నేతితోచేసిన మైసూరుపాకు ఒక్కటయినా మాకు రాలేదుకాని ఎంత చేసినా కుంకలు మాటదక్కనివ్వ లక్కయ్యా! అన్న ముక్క మా అమ్మచెవికి



(గోడమీంచి పేరుగా) ఎక్కిందిః అదే మాకు పక్కిందీను.

చూడు వెంకమ్మక్కయ్యా! లక్ష్మీ పరకుకి బద్ధకంగా వుంది (వాళ్ళమ్మాయి) అని కేకేస్తే యీ విడ ఆపత్కాలంలో మంత్రసానితనం, రోగసమయాల్లో లేడీడాక్టరు, క్లిష్ట సమయాల్లో పెద్ద దిక్కు అయి అన్నీ ముగిశాక ఇంటికి వచ్చి (అర్ధరాత్రివేళ) చన్నీటిస్నానం చేసి డాక్టరు అవసరం కల్గిస్తుంది అటువంటప్పుడు ఇరుగూ పొరుగూ అన్నాక, తోడ్పడకపోతే యిక మానవత్వమేమిటి? అని మీ రనవచ్చు. డబ్బివ్వలేని వాళ్లు, సహాయం చేయలేనివాళ్లూ ఉండచ్చు కాని విశ్వాసహీనులకి ఉపకారంచేస్తే ఇహమూ పరమూ రెండు పూర్ణానుస్వారమే. బాలింతరాలికి నీ చేత్తో పత్యం పెటాలక్కయ్యా నీ చేతిచలవ మంచిది! నీ చేతి ఊరగాయ తింటే చచ్చినవాళ్లు లేచి వస్తారు వెంకమ్మప్పా! నీకు ప్రత్యుపకారము ఏం చెయ్యగలము! పెట్టలేని వాళ్ళకు ప్రేమ యొక్కవ నోటితో అంటే నమ్ముతావా! నిజంగా పరోపకారంచేయడంలో నువ్వు పడే శ్రమ చూస్తూంటే నాకు నిద్దర పట్టదంటే నమ్ము. ఇత్యాది తేనెపలుకులు పలికిన కవికి, అక్కయ్యా అన్న నోటితోనే, ఒకనాడు, 'నీ వొక్క కొడుకూచావాలి' అనే వరకు అనర్గళంగా, అనరాని మాటలన్నీ అంటూ ఘోరాతిఘోరంగా తిడుతూఉంటే వినలేక మేడమీదకుపోయి పేపరు చదవడానికి ప్రయత్నించాను. తిడితే తిట్టిందికాని పీడ వదిలింది. అంతటితో వెంకమ్మప్పకు వెర్రి కుదిరింది. యింతకీ తిట్టిన కారణ మేమిటంటే అవిడ పెద్దకొడుకు కాలేజీనుంచి తొలగించబడిన కారణాలూ చిన్నకొడుకు చేసిన దొంగతనాలూ మేము చెప్పామన్న అపోహ.

సంచార సమాచార కేంద్రం

మా యింటి పరిసరాల్లో ఒక సుబుద్ధి ఉన్నాడు. ఈయన పని ఏమిటంటే ఊళ్ళో అందరి ఇళ్ళకూ డైరక్టుగా వెళ్లి వాళ్ళబ్బాయి చదివిన చదువు మొదలుకొని కొనుక్కొన్న కాకరకాయి కూర వండడందాకా తెలుసుకొంటాడు. అటుపిమ్మట చదువులోనూ బుద్ధిలోనూ, మంచి పేరు తెచ్చుకొంటున్న పిల్లల్ని బుర్రలో పెట్టుకొని (మా వూరి పొరుగున హై స్కూలు ఉన్న వూరికి) సైకిలుమీద బయలుదేరి వెడతాడు. అక్కడ ధృవుడు బారసాలనాటినుంచి ఉన్నదని తన వంశపు టౌన్నత్యాన్ని చెప్పుకొన్నాక అక్కడి మేష్టర్లతోను అధికారులతోనూ, 'అబ్బే! వాడెక్కడ? శుద్ధ మొద్దు. ఆ పిల్లాడికి పేదీ? కానివన్నీ స్వంతపూహాలు కావు. వాళ్ళనాన్నకి స్వారీసఖ్యంవుందికనుక రికామలంటే ఏమిటో చెప్పింది కాని వతిలిలక పలుకులు. ఆ రెండు జవలస్తూయి మా పొరుగునేలెండి. కేరక్టరు మంచిదికాదు. అబ్బ ఆ పొట్టి కుర్రాడు మాయింటి వాళ్లబ్బాయే! మహా పెంకి వెధవ లెండి. వాడికి గారం కూడాను. మా పిల్లల్ని పట్టుకొని చిత్రవధ చేసేస్తాడు. మా అరుగుమీద అద్దకున్న ఆచార్లు కన్ను పొడించింది వీడే. వీడ్ని ఓ కంట చూడకపోతే స్కూల్లో అందర్నీ బ్రతక నివ్వడు. ఇట్లా వెయ్యగలిగినన్ని అభాండాలువేసి మావాడ్ని కాస్త చూడండి అని ఓ వెలగపండూ, కొత్తిమీరికట్టా, మేష్టారికిచ్చి, హిహిహి అని సైకిలు ఎక్కుతాడు'

వెనక మా చంటిపాప గొలుసు పోతే కేసుపెటాము ఇనస్పెక్టరు, కానిస్టేబుల్సూ వచ్చి దార్యాప్తుచేసి వెళ్ళినతరువాత వాళ్ళు మళ్ళీ మాయింటికి రాలేదు. కారణం ఈ ప్రబుద్ధుడు కచేరి సావిట్లోకి వెళ్లి చూశారూ! ఆ వేళ మీరు వాళ్ళయింట్లో కుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతున్నపుడు వాళ్లి డ్రైవరు మీకు విసినికర్రతో విసురుతూంటే ఆ పిల్లవాడి తల్లి అబ్బా నీకెంత భోగంరా బాబూ! అంది ఆ గొలుసు అదే ఎక్కడో పారేసి వుంటుంది చాలా గర్విష్టి లెండి మిమ్మల్ని తిడూతూంటే నేను స్వయంగా విన్నాను మా పొరుగు నేకదూ అన్నాడట. దాంతో కేవలం అహంభావమే కాని కార్యదక్షత లేని ఆఇనస్పెక్టరు వివరం ఆలోచించక ఏదో వంకతో కేసు కొట్టిపారేశాడు.

ఈయనకు రకంవారీగా పెళ్ళిలేని ఆడపిల్లలు పదిమంది దాకా వున్నారు. వీళ్ళలో మా చంటిపాప మొదలుకొని మా అమ్మ ఈడుదాకా ఉన్నారు. కాని వూళ్ళో ఈయన నోట్లో మంచిది అనిపించుకొన్న ఆడపిల్ల లేదు. ఇంక ఆ యింట్లో పిల్లసంగతి వినండి. మీరు మీ వూళ్ళో ఎక్కడ పసుకొంటూరు. ఈ వూళ్ళో వెధవలంతా మా పాతచీర విలువ చెయ్యరు. మొన్న మా పనిమనిషికి కొల్లేఘాల్ పట్టుచీర ఇచ్చాను. మీ అయన ఎప్పుడూ రాలేం. మీ మెళ్ళో గొలుసు ఎంచక్కా వుంది పొట్టిగా. (అంటే అశ్వత్థామహతః కుంజరః అన్నట్లు) ఎంచక్కా వుంది పొట్టిగా అన్నమాట; వెధవది కుంకెనుపిండి చేగోడీలుచేస్తే ఒక్క పూటకిచాలవు. ఇదీవరస.

మా యింటి వెనక వీధిలో వున్న వెంకటసుందరమ్మగారిక్కి మేమంటే ఎంత ప్రేమో చెప్పలేము. ఎందుకంటే (మా నాన్న డాక్టరులెండి) పొలుకు సరిపడిన మందులన్నీ మా యింట్లోంచే, చూడన్నయ్యా! కామాక్షికి కాస్త చెయ్యి చూడు, కూరిపండుకు కూర్చొవత్తి, తమ్ముడు రాజుకి తటాకమృత్తికీరసం, బంగారానికి బధిరసుందరరసము, జ్ఞాపకముంచుకో, నీలవేణితలకి భృంగామలకము, కౌలాక్షికి కంటిమందు, నాకు రెండుజ్వరంమాత్రలు, సుందరానికి సుగంధి లేహ్యము, బాలాజీకి బంధుమర్దనవటి ఇస్తావన్నావు. మర్చిపోయావా అన్నీ తలోమాటు అడుగుతూంటే నీకు తీరికెక్కడ అన్నయ్యా. ఆ స్తమాను పేషెంట్సులోనే సరిపోతుంది. చంటిదానికి కస్తూరిమాత్రలు అందాకా ఒక్కసీసాఇస్తే చాలులే. తేనెసీసా ఒకటిఉంటేఇద్దూ! లేకపోతే మాదీఫలరసాయనమయినా ఫరవాలేదు. ఇలా ఒక్కవరసని గుక్కతిప్పుకోకుండా నిరేసిఅడుగుతూంటే అవిడ అడిగిన దాంట్లో సగమయినా ఇవ్వకతప్పదు, లేవంటే బీరువాలన్నీ చెక్ చేస్తుంది గదా.

పోనీ వాళ్ళకు మాకు మొహమాటమేమో అంటే చిలకొట్టిన జామికాయ దగ్గర నుంచి వాళ్ళది మాదొడ్లోపడితే వచ్చితీసుకుపోతుందికాని వదిలిపెట్టదు. చేమంతంటూ అడిగితే నాచిన్నప్పటినుంచి ఇస్తానని జరుపుతోంది ఈవిడ మొగుడు కొంటున్న ప్లైనటించి మారువాడీదగ్గర కాసులపేరు జేబులో పెట్టుకు చక్కావచ్చి మా కు అమ్మ జూపాడు. ఇంకానయం! నేరం రుదరలేదు, కాని వస్తువుకలవాళ్ళు వెతుక్కుంటూ వచ్చి ఈయన్ని నడిరోడ్డుమీద పాదరక్షప్రయోగంచేసి దొంగసొమ్ము అని చాటింపువేయించారుగనుక తెలిసిందిగాని లేకపోతే ఈ సజ్జనుడిధర్మమా అని కేసులో ఉండేవాళ్లం. ఇంటికి ఎవరేనా చుట్టాలుగాని అధికార్లుగాని వచ్చినపుడు వాళ్లతో ఏమి మాటాడానికి వీలేకుండా సిద్ధమయ్యేవాడు. ఓ సారి రేషన్ రోజుల్లో, మా కొట్లో ఎక్కువధాన్యం వున్నాయని అధికారులతో చెప్పి సీళ్లు వేయించాడు. తనికీఅధికారులువచ్చి తాళాలు తియ్యమన్నారు.

"రేషను శాఖ వారిపని చేసుకువెళ్లి ఇంకి మీపనిమీరు కానివ్వండ"ని మా నాన్న అన్నారు. సీలుతీసేమూస్తే ఏముంది! అన్నీ ఆసవారిష్టాల కుండలే.

రెండువందల బస్తాలధాన్యం గాదిలో వున్నట్లు ఈమహానుభావుడిచ్చిన రిపోర్టుకొరితం మాకళ్లతో మేముచూశాం. అధికారులచేత చివాట్లుతిన్నాడనుకోండి. నిజంగా ఈ ఇరుగు పొరుగుల ఈతిబాధలు పడలేక పోయిగా ఏపాలంలోనో యిల్లుకట్టుకోవాలని అనిపిస్తుంది మాకు. మీ రేమంటారు? ★

ఇరుగూ-పొరుగూ

ఎక్కడో కాని తరచూ యిరుగు పొరుగు అన్నాక తగవులు సంభవిస్తూంటాయి. అందులో యిద్దరికీ కలిపి ఒకేనుయ్యి-యిలా యేదైనా ఉమ్మడివసతిఉంటే మరీను. సాధారణంగా ఈవివాదాలు, తగవులు స్త్రీలమధ్యే కలుగుతుంటాయి. ఎక్కడో ఆడరచ్చప్ప లాంటి మగాళ్లుఉంటే తప్ప మగాళ్లలో భేదాభిప్రాయాలు కలగడం అరుదు ఒకవేళ కలిగినా ఆడవాళ్లు ఒకటికి రెండు కల్పించి చెప్పడంవల్లే. మాటల్లో మనసువిరచే నేర్పు ఆడవారికే ఉందని అంటే అబద్ధం యేమాత్రం కాదు. ఇటు మగాళ్లూ మగాళ్లూ పోటీలేని స్నేహభావంతో మెలగుతూన్నా అటు ఆడవాళ్లు మాత్రం జుత్తులు పట్టుకోవడమే తరవాయిగా ఉంటారు. ఇదంతా యెందుకంటారు? ఈర్ష్యాభావంవల్లే ... పురుషులకంటె స్త్రీలకే తోటి ఆడవారిని చూస్తే ఈర్ష్య. ఇలా వ్రాస్తున్నానని సాటి మహిళలు నన్ను అవహేళన చెయ్యవచ్చు. కాని ఉన్నది ఉన్నట్లు చెప్పడమే నా మతం. వనితాలోకంలో ఇలాంటి శీర్షికలకు తావిచ్చినందుకు నాకు చాల సంతోషంగా ఉంది. చాలామంది ఇలాంటి వ్యాసాలు చదివి మనసులు మార్చుకోకపోయినా, బహు కొద్దిమందేనా పరివర్తన చెందుతారేమో అని నా ఆశ. నా మటుకు నేను ఇలా నా లోపాలగురించి తెలుసుకోగలిగాను. ఇరుగు పొరుగు అన్నాక ఎంత సౌమ్యంగా మెలగుతే అంత సౌఖ్యం, సంతోషం; మనస్పర్థలు ఏర్పడితే అంత దుఃఖం, అశాంతి మరుండవు.



ఇరుగు-పొరుగు కలహాలు ఈనాటివి కావు. ఇంకా జరిగినకాలంలోనే యెక్కువని నా అభిప్రాయం. ఇరుగువాళ్లింట్లో మనస్పర్థలు యేర్పడి దెబ్బలాడుకుంటున్నట్లు యేమాత్రం వీళ్ల కర్ణపథం చేరిందా వెంటనే యే మూలో పడిఉన్న నిచ్చెన తీసుకొచ్చి మధ్యగా ఉన్న గోడకు చేరవేసి మరీ వింటారు. వాళ్ల సంసారగొడవలు వీళ్ళకెందుకు? పోనీ విని ఊరుకుంటారా? వెంటనే (ఎక్కడి పన్లు అక్కడ విడచి) వీధిలో నాలుగిళ్లకు పోయి పొరుగింట్లో జరిగిన కలహాన్ని చిలవలు పలవలుగా వర్ణించి చెబుతారు. ఇలా నిచ్చెనలు వేసుకొని వినడం పాతకాలం పద్ధతి. అసలు నవీన విద్యావతికి నిచ్చెన యెక్కడము రాదులెండి.

‘నా ఐవి’

క్రిందటి వేసవిలో నేను మా మేనత్తగారింటి కెళ్ళాను. అబ్బబ్బ! ఆ పొరుగువాళ్ళ పోరుతో నాకే విసుగేసి వచ్చేశానంటే మీరు నమ్మరు.


వాళ్ళు ఏమంత కలవాళ్లు కారు. మా మామ లక్షాధికారి కాకపోయినా మంచి ఉద్యోగంలో ఉన్నాడు. అది వాళ్లకు కిట్టలేదు. "ఆ పాటి డబ్బున్నాదని" వీళ్లేమైనా విఱ్ఱవీగారా! అలాటి గర్వాలు ఇంటావంటా లేవు ఇంకా పొరుగువాళ్లకేదేనా సమయానికిచ్చి ఆదుకుంటారు. మరెందుకో కోపం? . "ఓడలు బండ్లు, బండ్లు ఓడలు" అవుతాయన్న సామెతను వీళ్ళు వింటున్నట్లు పదిసార్లు వర్ణించడం; ఇంకా మా మేనత్తకు నలుగురు ఆడపిల్లలు యెదిగిన వాళ్లు ఉన్నారు. నలుగురు పెద్ద చదువులే చదువుతున్నారు. దానికి ఈర్ష్య. పాపం మా వదినెలు పక్కింటిపిల్లకు చదువు నేర్పుదామని తాపత్రయపడతారు. కాని ఆ అమ్మాయి నేర్చుకుంటేనా?... పొరబాటున వాళ్ల మాటల్లో ఇంగ్లీషుపదం దొర్లుతే పొరుగువాళ్లు ఉంచరుట. "గొప్ప దొరసానులు దిగిపోయారు" అని అనడం. పొడుగ్గా జాకెట్లు తొడుక్కుంటున్నారని "ఓ గొప్ప సినిమాస్టార్స్ దిగిపోయారు. పొడుగ్గా గల్లాలాగ ఆ చేతులేమిటని" సాధించడం (ఇప్పుడు వాళ్ళుకూడ పొడుగ్గానే తొడుక్కుంటున్నారులెండి) ఈలాటి సూటిపోటి మాటల్ని భరించడం కష్టం.

మరోరకంవారున్నారు. మాట్లాడుతున్నరోజుల్లో అలుగుడ్డ దగ్గరనుండి పట్టుకుపోవడమేను. పోనీ అప్పులుతీరుస్తారా అంటే అది లేదు. ఏదో లేనిపోని కలహం కోరి తెచ్చుకొని వాళ్లే మరుక్షణం తీర్చవలసిన ఉప్పు, పప్పు వగైరా దినుసులు (సగం సగం) కొల్చేసి పోవడం. అలాటపుడు మనం నోరు తెరిచి చూడ్డమే తప్ప మరేం చెయ్యలేం. మళ్లా వాళ్ళకేదేనా అవసరం కలిగిందీ అనగానే మరి మొహమాటం లేకుండా పూసుకు తిరగడం. ఇలాటివాళ్ళతో వేగలేం. ఇలాటి రకం శాశ్వతంగా మాట్లాడకపోతే బావున్నట్లనిపిస్తుంది.

మరొక్కరకం. పైకి మెరమెచ్చులు ప్రకటిస్తూనే అన్నికూపీలు లాగి ఆఖరుకు దెప్పడం. ఈతరహాని అసలుభరించలేం. నోరు మూసుకొని ఊరుకోవలసిందే. అవసరమయితే అన్నిరకాల నిందలు మోపుతారు. వాళ్లు ఒక మూల అన్నిమాటలు అంటూనే ఎవరైనా పైవాళ్లువస్తే "అబ్బ! మా పొరుగువాళ్లతో భరించలేం. ఏ మాటన్నా వాళ్లమీద పెట్టేసుకుంటారు (అంటే పెట్టుకోరూ!)" అని పాటడం. ఇలా యిరుగు పొరుగు చాలా రకాలున్నారు.

అయితే ఇరుగు, పొరుగుల్లో సామరస్యం ఉండదని అనడానికి వీల్లేదు మంచివాళ్లూ ఉన్నారు. మా పొరుగువాళ్లు చాలా మంచివాళ్ళు. మేమూ వాళ్ళూ ఒకే కుటుంబములోవాళ్లలా మెలగుతాం. అవసరానికి ఆదుకుంటాం. ఏపనిచేసినా కలిసే చేస్తాం. మాకొచ్చిన విద్యవాళ్ళకి నేర్పుతే, వాళ్ళకొచ్చినవిద్య మాకు నేర్పుతారు. ఒకవేళ చిన్నపిల్లలం మాటా మాటా అనుకున్నా పెద్దవాళ్లు నాలుగు చీవాట్లు పెట్టి మామధ్య పొత్తు చేకూరుస్తూంటారు. ఇలా అంతమందీ కలసి మెలసీ ఉంటే యిరుగు పొరుగు కలహాలు సంభవించవు! ఒకవేళ పక్కవాళ్లలో తప్పున్నా కాస్త సర్దుకుపోవాలి. ★

గృహవైద్యం



అసలు వైద్యాలవరకు వెళ్ళకుండా విరుగుడు చిట్కా అలాంటివి చాలా ఉన్నాయి. ఈ చిల్లర వ్యాధులు కూడా ఆహారం మార్పుచేయుటవలన సరిపోతాయి.

పనసపండు కోసినట్లయితే పిల్లలు ఒకటి రెండు తిని ఒదలరు. బస్తీలలో అయితే పళ్లు కొని పెట్టడం కనక తొనలు పరిమితించకుండానే పెడతాం. పల్లెటూళ్లలో తోటల్లోని పళ్లు 4, 5 కోసి తొనలు బుట్టలతో వాళ్ళ యెదురుగుండా పెడితే మితిగా పెట్టడం మనతరంగాదు. వాళ్లు తినడం మానరు. అతిగా తింటే వాళ్లకి కడుపునెప్పి రాక మానదు. అలా కడుపు నెప్పి రాకుండా చేయడానికి వాళ్లని తిన్నన్ని తిననిచ్చి ఆఖరున ఒక తొనలో నూనెపోసి పెడితే కడుపునెప్పి ఆమడదూరం పోతుంది.

[పనస తొనకి నూనె విరుగుడు]

ఊరగాయి పెట్టేటప్పుడు పిల్లలు నోరు వూరుతున్నా మనం తిట్టినా ఆ మామిడికాయ ముక్కలు తినక మానరు. వాళ్లు మామిడి కాయలు యెన్ని తిన్నా మనం మాత్రం ఒక్క గ్లాసుడు మజ్జిగ వాళ్లచే తాగిస్తే వాళ్ళకు యేమీ రాదు.

[మామిడికాయకు మజ్జిగ విరుగుడు]

ఇహ వేసవికాలంలో ముంజెలు చవగ్గా వస్తాయి. పైగా చాలా రుచిగా వుంటాయి. అందుకని చాలా తినకమానం. అవి తిన్నాక ఒక్క గ్లాసుడు మంచినీళ్లు తాగిస్తే యేవీ రాకుండా ఉంటాయి. సీతాఫలం పళ్లకు కూడా అంతే.

[ముంజెలకు, సీతాఫలం పళ్లకు మంచి నీళ్లు విరుగుడు]

మామిడిపండ్లు ఊరికే తినేకంటే రాత్రి నీళ్ళల్లో నానేసి ఆపళ్లు మధ్యాహ్నం అన్నంలో వేసుకొని మధ్యాహ్నం నానేసినపళ్ళు రాత్రివేసుకొంటే సెగ్గడ్డలు, పుళ్ళువిరోచనాలు వెళ్ళకుండా ఉంటాయి. మామిడిపండు ఊరికే తినేకంటే మజ్జిగ అన్నంలో చేర్చి పెడితే మంచిది. పచ్చి కొబ్బరి ముక్కలు పిల్లలు యెక్కువ తిన్నట్లు తోస్తే కొంచెం బెల్లం తినిపిస్తే నోరు పుయ్యదు

[కొబ్బరికి బెల్లం విరుగుడు]

దద్దుర్లకు

పైత్యం ఎక్కువైతే వళ్ళంతా దద్దుర్లు యెత్తుగా వస్తాయి. దీనికి కొంచెం చింతపండు గుజ్జుగా పులుసుతీసి నాలుగు రాగికాసులు నానేసి ఆ ముద్దను యెక్కడ దద్దురు లేచిందో అక్కడ పట్టించి 5 నిమిషాలుంచుకొని కడిగేసుకుంటే దద్దుర్లువున్న ఆనవాలుకూడా వుండదు. అలా రెండు మూడు రోజులు వాడండి.

ముల్లు గుచ్చుకుంటే

ముందు ముల్లుగుచ్చుకొన్న కాలుబాగుగా కడిగి ఆ ముల్లును తీసివేయవలెను. కాలు

డి. భాస్కరమ్మ

నెప్పి చెయ్యకుండా నల్ల జీడిగింజ తెచ్చి ఓ మేకు చివరో అట్లకాడ చివరో గుచ్చి నిప్పుమీద వెచ్చచేసి ముల్లుగుచ్చుకొన్న దగ్గర కాస్తే నెప్పి తగ్గగలదు.

కంట్లో నలకపడితే

కంట్లో నలకపడితే విపరీతంగా దురద పెడుతుంది. అప్పుడు కొద్దిగా పేరిన నెయ్యి కంట్లోపెడితే నలక కంటకొలుకు దగ్గరకు జేరుతుంది. అప్పుడు పలచని బట్టతో తుడిస్తే నలక సుళువుగా బయటకు వచ్చేస్తుంది.

శోభి మచ్చలకు:

నాగమల్లిఆకు తీసుకువచ్చి దానిని బాగుగా నలిపి ఆ పసురును తామర, శోభి యెక్కడఉంటే అక్కడ పట్టిస్తే తగ్గిపోతుంది 16, 17 యేండ్ల మగపిల్లలకు ఆడపిల్లలకు బుగ్గలమీద పొక్కులు లేస్తాయి. అవి తగ్గడానికి జాజికాయ బాగుగా అరగదీసి ఆ గంధం ఆ పొక్కులకు పట్టిస్తే తగ్గుతుంది.

తేలుకాటుకు

ఒక టీస్పూన్ వుప్పు ఒక టేబుల్ స్పూన్ నీళ్ళలో కలపవలెను. వీటని ఒక పలుచని గుడ్డలో వడగట్టవలెను. తేలు యే భాగంలో కరిస్తే దానికి రెండవవైపు కంట్లో అనగా ఎడమవైపు కరిస్తే కుడివైపు కంట్లోను కుడివైపు కరిస్తే యెడమ వైపు కంట్లోను రెండు చుక్కలు వెయ్యవలెను. కుట్టిన దగ్గరకూడా రెండుచుక్కలు వేసి నొక్కి మర్దనాచెయ్యవలెను. ఒక పది నిముషాలు పోయాక మళ్లా కంట్లో వెయ్యాలి ఇది వేసుకుంటే అమోఘంగా పనిచేస్తుంది నాకు ఎవరో వాడేరు. తగ్గిపోయింది. నేను తెలుసుకొన్నది మొదలు వాడుతూనే వున్నాను.

ఒక్కొక్కప్పుడు కాల మణవలోపల విపరీతమైన దురదపెడుతుంది. ఓ ఇటుకరాయి బాగా నిప్పులలో కాల్చి దానిమీద నీరు పోస్తే గుప్పున ఆవిరి వస్తుంది. పట్టగలిగిన వేడిలో వుండగా మణవకాలు పెడితే ఆ దురద తగ్గుతుంది. అలాగే కాలి బొటనవ్రేళ్ల మొదట్లో వంద్రు పోస్తుంది అలా వంద్రు పోసినప్పుడు ఒక దీపం వెలిగించి ఆ వేడి చమురు వత్తి చమురు దానిమీద ఆ రా రా వేస్తే నెప్పులాగుతుంది.

మాడుపోటు

అలాగే తాడవ (అనగా మాడుపోటుతో బాధపడేవారు, గోదావరి గాని కాలువగాని వున్న వూరైతే, ఆ వంద్రుమన్ను తెచ్చి మాడుమీద వేసుకోవాలి. అలా వేసుకొని 5 లేక 10 నిముషాలు మాత్రం వుంచి తీసేయాలి. అలా వేస్తే మాడు పోటు తగ్గగలదు. ఆకలిలేక అజీర్ణంగావుంటే ఆవకాయ అన్నం తినిపించేది మామ్మ. ఆమె దృష్టిలో అజీర్ణ ఆవకాయతో హరిస్తుందని అంతకన్న మందు అనవసరమనేది. ఇలా చాలావరకు 'నైవేద్యాల' మార్పులతోనే వైద్యాలు అవసరంలేకుండా చాలా చేసే వాళ్ళు. పూర్వం పిల్లలు ఎవరైనా విరోచనం కాలేదంటే రెండు ఎండు ఖర్జూరపు కాయలు రాత్రి తినిపించి ఓ అరగ్లాసు వేడినీరు త్రాగించేది. ఖర్జూరపుకాయలు విరోచనానికి మందవేసి ★

★ ఉత్తరాలు ★

8-7-57, ఆంధ్ర వారపత్రికలో పి. జి. సరోజినిగారు "ఆడపిల్లల పెళ్ళిళ్ళు—తల్లిదండ్రుల అవస్థలు" అనే వ్యాసాన్ని చాలా చక్కగా వ్రాసేరు. నేటికాలపు సమాజంలో వివాహంకాని కన్యలు, వాళ్ళ పెళ్ళి గురించి కృంగి, కృశించిపోయే తల్లిదండ్రులు కళ్ళకుకట్టినట్లు అగుపించేరు తండ్రి తన కుమార్తెను విజ్ఞాన సముపార్జనకొఱకు చదివించేరోజులుపోయాయి ఎందుచేతనంటే కూతుర్ని బి ఏ దాకా చదివిస్తే ఎం ఎ. చదివిన అల్లుడిని తీసుకు రావాలి అది ఈ కాలంలో అసాధ్యమయిన విషయం. ఇంక కట్నాల విషయం చూస్తే యెన్ని చట్టాలుచేసినా కట్నం డైరక్టుగా పుచ్చుకోకపోయినా యేదోరూపేణా లాగుతునే వుంటారు

ఈమధ్య మా ఫ్రెండు అక్కయ్య ఒకావిడ మాయింటికి వచ్చింది "ఏమండీ! మీ చెల్లెలు యీమధ్య యేదో పెళ్ళిసంబంధమొచ్చిందని వ్రాసిందే, అదేమిటయింది?" అని అడిగేను ఆవిడ చెప్పినమాటలు వింటే నాకు చాలా ఆశ్చర్యమేసింది మా ఫ్రెండు బి. ఎ పాసయింది ఆ అబ్బాయేమో ఎం. ఎ; ఎల్ ఎల్ బి చదివేడుట దమ్మిడీ కట్నం పుచ్చుకోడుట కాని కొన్ని చిన్న షరతులు పెట్టారు అవి. (1) పెళ్ళి 5 రోజులు వైభవంగా జరపాలి (2) ఆడపడుచు లిద్దరికీ చెరో 516 ముట్టచెప్పాలి (3) అత్తగారి కట్నం మరో 516 ఇవ్వాలి (4) మగపెళ్ళివారితరఫున వచ్చేవారందరికీ — ఒక్కరినీ విడిచిపెట్టకుండా ఆడవాళ్ళయితే అరవైయేసి రూపాయలకి తక్కువచెయ్యని చీరలు పెట్టాలి. మగవారయితే వాళ్ళకితగిన బట్టలు పెట్టాలి.

ఇవన్నీ చెప్తూవుంటే నాకు చాల ఆశ్చర్యమేసింది మళ్ళీ వాళ్ళు బంగారందేమీ పెట్టారు. ఈ పైలాంఛనాలన్నీ కలుపుతే ఆ పెళ్ళయిసరికల్లా ఏ పదివేలోఅయి, పెండ్లికూతురు తండ్రి అప్పులపాలయిపోతాడు వీటన్నిటికి బదులు ఏ ఐదు వేలో కట్నం పుచ్చుకుంటే సరిపోయేదనిపిస్తుంది మళ్ళీ కట్నం పుచ్చుకుంటే నలుగురు స్నేహితులలోనూ ఆ అబ్బాయికి చిన్నతనమట అంత ఆదర్శవంతుడయితే మరి యీ పై లాంఛనాలుమాత్రం యెందుకో? ఇచ్చే వాళ్ళకి స్థోమతుఉంటే ఎలాగా ఇస్తారు. మరత్తులైతే ఎలా? దీనితో వాళ్ళు యీ సంబంధానికి దండం పెట్టి వూరుకొన్నారుట. మా ఫ్రెండుమాత్రం యింక తనని లోకం వెలివేసినా, తల్లితండ్రులు త్యజించినా పెళ్ళి చేసుకోనని, వుద్యోగంచేసి బ్రతుకుతానని భీష్మించుకొని కూర్చుంది.

వంకాయల సత్యవతీదేవి,
(విజయనగరం.)

* * *

పోయినవారం (3-7 57)సంచికలో, వనితాలోకం శీర్షికలో "ఆడపిల్లల పెళ్ళిళ్ళు, తలిదండ్రుల అగచాట్లు" వ్యాసం పి జి సరోజినిగారు చక్కగా వ్రాసారు. వారి ఉద్దేశాలతో పూర్తిగా నేను ఏకీభవిస్తాను వారికి నా కృతజ్ఞతాభివందనములు

ఎల్.వి. సరోజానాయుడు(చిత్తూరు.)

* * *

26-6-57 వ తేదీ ఎస్. సూర్యాభాయిగారు వ్రాసిన వ్యాసము చదివితిని కాని వారిని నేనువ్యతిరేకించుచున్నాను. లోపము ఇంటిలో అద్దెకు వుండేవాళ్లలోకూడ వుందని చెప్పవచ్చును. ఇంట్లో అద్దెకువున్నవాళ్లు ఇల్లు పరిశుభ్రముగా వుంచకపోయిన ఇల్లు అందముగా వుండదు. ఎవరైన ఇంటికి వచ్చిన అది అద్దెకు ఇచ్చినవాళ్ళలోనె లోపము వున్నదంటారు కాబట్టి అద్దెకు వుండేవాళ్లు ఇల్లు పరిశుభ్రముగావుంచిన అద్దెకిచ్చిన వారుకూడ వారిని ఏమీ అనరు.

ఎమ్. కనకరత్నం, (పామర్రు.)

* * *

మంచిపద్ధతి

పట్టుదులుపుకు - కర్రలు సాధారణంగా ఆరణాలు, అర్ధరూపాయలకు మనం కొంటూండడం, అవి నెలరోజులైనా పని చేయకపోవడం జరుగుతుంది అల్లా కాకుండా నే చెప్పినట్లుచేస్తే ఖర్చు తక్కువ, మన్నిక ఎక్కువ

ఒక పౌను డాల్డాడబ్బాగాని, బార్లీగింజల డబ్బాలుగాని రెండుకావాలి అందులో ఒకటి కత్తిరించి, గడకర్ర (వెదురుబొంగు) లావు గొట్టంలాచేసి ఇంకొకడబ్బాకు అడుగు భాగంలో అతికించినట్లైతే బేడ లేక మూడు అణాలు తీసుకుంటాడు ఆ గొట్టంలో వెదురు పెటవచ్చు, పైన వున్నడబ్బాలో చీపురు పెట్టి బూజులు దులుపుకుంటె బాగావస్తాయి. చీపురుపుల్లలు రాలిపోవు. చాల సులువుగా వుంటుంది మీరు కూడ తయారు చేసుకుని చూడండి

కొల్లూరి సుబ్బలక్ష్మి (ఏలూరు)

* * *

వక్కపొడి అలవాటు మానుకోవాలంటే

మే 8 వ తేదీ ఆంధ్ర వారపత్రికలో వక్కపొడి తయారీనిగురించి వ్రాశారు. దానిని చదివాను. దానిమాస్తరుగానే మేము వాడుకునే ధనియాల పొడినికూడా తయారు చేయవచ్చును. ఇది కూడా వక్కపొడికి మల్లే సువాసనగా ఉంటుంది వక్కపొడి ఎక్కువగా తింటే పంటికి మంచిదికాదనుకునేవారు దీన్ని వాడి చూడవచ్చు ఎక్కువగా దీన్ని వాడకూడదనుకోండి

కావలసిన సామాను -ధనియాలు శేరు, లవంగాలు ఎనిమిది తులాలు, యాలక్కాయలు నాలుగు తులాలు, జాపత్రి నాలుగుతులాలు, జాజికాయ, పచ్చకర్పూరం, నెయ్యి ఐదు టీస్పూనులు ఎండుకొబ్బరి వెయ్యకూడదు


చేయు విధానము -ధనియాలను వేయించి రోటిలో వేసి దంచి ఒక పెద్ద పళ్ళెములో పోసి వుంచాలి లవంగాలు, యాలక్కాయలు కలిపి నూరాలి జాపత్రిని చేతితో చిన్న ముక్కలుగా తుంచుకోవాలి లవంగాల, యాలక్కాయల పొడి, జాజికాయపొడి, జాపత్రి, అన్నీ కలిపి, దీనిని ధనియాలు వున్న పళ్ళెములో వేసి, మూడు టీస్పూనుల నెయ్యి పోసి కలుపుకోవాలి అపుడు పచ్చకర్పూరమును చేతితో నలిపి వేయాలి కుంకుమపువ్వు వేసినా వెయ్యకపోయినా పచ్చకర్పూరము మాత్రం వేయాలి మిగిలిన రెండు టీస్పూనుల నెయ్యి చివర కలపాలి.

ఇటూ తయారుచేసిన ధనియాలపొడి వక్కపొడికి మల్లేనే ఉంటుంది. మంచి పరిమళం ఉంటుంది రుచిసంగతి వేరే చెప్పనక్కరలేదు


—ఎస్. అహల్య, (తెనాలి.)

★ చీరె అంచులకు... ★

1




2



డి. జయలక్ష్మి

ఈ మూడు డిజైనులు చీరల మీద, లంగామీద వేసుకుని ఎంబ్రాయిడరీ చెయ్యాలి ఒకటవ డిజైను కొంచెం, కొంచెం ఖాళీ వదిలి, చీరఅంతటా వేసుకోవాలి. డిజైనులో మధ్య పువ్వుకి రెండు లైన్ల మధ్య, జరీతో కాజాకుట్టు కుడితే బాగుంటుంది మధ్యనున్న పువ్వుకి ముదురు నీలం రంగు ప్రక్కల ఉన్న పువ్వులలో ఒక వైపు పువ్వులకు కనకాంబరం రెండవవైపు పువ్వులకు గోల్డ్ కలర్ దారాలు వాడాలి. చీర అంతటా వేసుకోవడం కష్టమనుకుంటే పైట చెంగుకు ఒకమూల వేసుకోవచ్చు డిజైనుఅంతా ముద్దకుట్టు కుట్టాలి

రెండవ డిజైను చీరలకుక్రింద, గొలుసుకుట్టుతో వంకీ కుట్టి దాని పైన డిజైను వేసుకోవాలి గజానికి ఒకటిచొప్పున వేసుకోవాలి. పువ్వులకు గులాబి, ఆకులకు ఆకుపచ్చ డబుల్ కలర్ దారాలు వాడి డిజైన్ అంతా ముద్దకుట్టుకుట్టాలి. ఈ డిజైన్ పరికిణీలమీదకూడ వేసుకోవచ్చు పరికిణీలమీద ఈ డిజైన్‌వాడితే క్రిందగొలుసు కుట్టుతో కుట్టిన వంకీ పెద్దదిగా ఉంటే బాగుంటుంది



మూడవ డిజైను కూడా చీరలకు లంగాలకు అంచులా వేసుకోవాలి మధ్యనున్న పువ్వుకి, మొగ్గకి లేత నీలంరంగు, ప్రక్కల ఉన్న రెండు పువ్వులకు ఎరుపు, ఆకులకు కాడకు ముదురు ఆకుపచ్చ, రిబ్బనుకి కాఫీ కలర్ దారాలు వాడాలి. తెలుపుచీరల మీద పైన ఇచ్చిన రంగుదారాలతో ఎంబ్రాయిడరీ చేస్తే బాగుంటుంది. పువ్వులు ఆకులు రిబ్బన్ ముద్దకుట్టు, కాడలు కాడకుట్టు, కుట్టాలి.

* * *

సంధ్యా సమస్యలు

ప్రొద్దుపోయిందన్న మాటేగానీ మందు టెండలకు దగ్గరిచుట్టాలైన పడమటి వడగాడ్పుల విసురుల్లో లోకం వెచ్చివెచ్చగా ఉడికిపోతోంది. అలవాటు ప్రకారం వాహ్యాళికి వెళ్ళి తిరిగివచ్చిన రిటయిర్డు డిప్యూటీ కలెక్టరు రాఘవేంద్రరావుగారు అంగవస్త్రంతో ముఖంమీది చిరుచెమటను తుడుచుకుంటూ చేతికర్రను టేబిలు కానించి వాలుకుర్చీలో కూలబడిపోయారు. మాటిమాటికీ కుడిచేతి చూపుడు వ్రేలితో గాలిలో వలయాలు గీస్తుండడంవల్లనైతేనేమి, క్రింది పెదవిని పైపళ్ళతో నొక్కి అరమోడ్పు కళ్ళతో కూర్చుని వుండడంవల్లనైతే నేమి, ఆ స్థితిలో పరిచితులెవరైనా చూడడం గనుక తటస్థించి వుంటే, ఆయన మనసులో ఏదో ఆందోళన రగులుకుంటోందని యిట్టే గ్రహించివుండేవారు.

ఇంత చిరాకుకలిగించే విషయమొకటి తన చుట్టుప్రక్కల్లోనే యింతై, అంతై కడకు విశ్వరూపం ధరిస్తోందన్న సంగతి ఆయనకారోజు ఉదయం ఆరుగంటలవరకూ తెలియదు.

నిద్రాభంగం కావడంతో ఆయన ఆరోజు ఉదయం ఉలికిపడి కళ్లు తెరిచారు. ద్వారంలోనుంచీ వంటమనిషి, అంజయ్య, ముఖాన్నిమాత్రం లోపలికి చూపిస్తూ "మీకోసం ఎవరో వచ్చారు బాబూ!" అంటున్నాడు.

వంటమనిషి అంజయ్యముఖంపట్ల రాఘవేంద్రరావుగారి కెన్నడూ సదభిప్రాయం లేదు. ఉదయం లేవగానే అతడిముఖం తన కళ్ళబడినరోజున ఏదో అవాంతరం తప్పకుండా జరిగితీరుతుందని సకారణంగానో, అకారణంగానో ఒక నమ్మకం యేర్పడి, అది ఆయన అంతరంగంలో అలాగే సుస్థిరంగా వుండిపోయింది.

ఇంటిలో రాఘవేంద్రరావుగారికన్నా ముందుగా నిద్రలేచేవాడెవడైనా వుంటే వాడొక్క వంటమనిషి అంజయ్య మాత్రమే కావడంవల్ల ఆయనకు ప్రతిరోజూ యేవో అవాంతరాలు సంభవిస్తున్నట్టే తోచేది.

ఐతే యిక్కడ అవాంతరాలన్న పదానికి నిఘంటువులిచ్చే అర్థాన్నిమాత్రం అన్వయించుకో గూడదు.

రాఘవేంద్ర రావుగారి దృష్టిలో టూత్ బ్రష్ కనిపించకపోవడమూ, గేటు దగ్గర పందిరి కాళ్లు వుంటున్న పువ్వులతీగను మేకలు మేసిపోవడం లాంటివన్నీ అవాంతరాల క్రిందే జమవుతాయి.

విసుక్కుంటూనే పడకమీదనుంచీ లేచి కతిపయద్వారాలు గడచి రాఘవేంద్ర రావుగారు హాల్లోకి వచ్చేసరికి అక్కడ ఆయనకోసం చిరుగులుపడిన పాతకోటు జేబులనిండా కాగితాల పొత్తర్లతోనూ, కమ్మవిరిగి నూలుపోగుతో మిగిలిన సులోచనాలకోనూ, ముక్కుపుటాలపైన నశ్యంమరకలతోనూ, కొండకోనల్లో ఎక్కుడు మార్గంపైన రెండుఫర్లాంగుల పొడవున్న గూడ్సు వాగన్లను లాగలేక, లాగలేక లాక్కుపోతున్న ధూమశకటంలాంటి వ్యక్తి ఒకడు, కుర్చీలో చతికిలపడివున్నాడు.

మధురాంతకం రాజారాం

అతణ్ణి చూడగానే రాఘవేంద్రరావుగారి ముఖంలో ఒక ఆశ్చర్యరేఖ మెరిసిందంటే, అందుకు ప్రబలమైన కారణం వుంది. మాటికి పేదయినా నీలకంఠం కులానికి పేద కాదు. ఆర్థికంగా కుటుంబాల అంతస్థుల్లో విభేదాలున్నప్పటికీ, సంఘంలో బంధులోకానికంతటికీ సమాన గౌరవప్రతిపత్తులు లభ్యంకావాలని గట్టిగా పట్టుబట్టే మనిషి నీలకంఠం! అతడు రాఘవేంద్రరావుగారికి స్వయానా పెదతండ్రికొడుకే నన్న విషయం ఊళ్ళో చాలామందికి తెలియదు. ఆ విషయాన్ని నలుగురికీ ప్రకటించవలసిన అవసరం రాఘవేంద్రరావుగారికైతే లేకపోవచ్చుగానీ, ఆమాత్రం విజ్ఞత నీలకంఠానికెందుకు లేకపోవాలని అతనికీ రాఘవేంద్రరావుగారికీ వున్న రక్తసంబంధాన్ని గురించి తెలిసిన ఏ కొద్దిమందో ఆలోచించక పోలేదు.

ఆ విషయాన్ని అలా బాహాటంగా చెప్పుకోకపోవడానికి వెనుక ఈ ఎనిమిదిబిడ్డల తండ్రి, జరాభారంతోబాటు కుటుంబ భారాన్ని మోయలేక సతమతమైపోతున్న ఈ బక్కపలుచటి మనిషి, ఈవకీలుగుమాస్తా, నీలకంఠం ఎంత ఆత్మాభిమానాన్ని పాతర పోసివున్నాడో వాళ్ళకు తెలియదు.

కానీ ఈ అవకాశాన్ని పురస్కరించుకుని రాఘవేంద్రరావుగారు తిన్నచేతితో కాకివదలించని కఠినమనస్కుడని అంచనా వేయడంమాత్రం పెద్ద పొఱబాటే ఔతుంది. ఉద్యోగంచేసిన రోజుల్లో డబ్బు వెనకేసుకుని బ్యాంకులో దాచుకున్నాడుగదా అని అతివినయాన్ని నటిస్తూ తన పజ్జచేరిన బంధువులకు ఒక్కకానీఅయినా విదల్చనిమాట నిజమే అయినా నీలకంఠం విషయంలో మాత్రం ఆయన అభిప్రాయం వేరు నీలకంఠానికి సాటిమానవునిముందు నిలబడి చేతివ్రేళ్ళు నులుముకుంటూ దైన్యం ప్రదర్శించడం చేతకాదు. ఎప్పటికప్పుడు రాఘవేంద్రరావుగారు ఈసారి నీలకంఠం తన సహాయాన్ని అర్థించకతప్పదు అని అనుకుంటూనే వున్నారు, మరొకవైపున నీలకంఠం దిక్కులుతెలియని సంసారసాగరంలో తుపానుల్ని సరకుచేయకుండా నిస్సహాయంగా ఈదుకుంటూనే వస్తున్నాడు. అలాంటి నీలకంఠం తెల్లవారకముందే యిలా ప్రత్యక్షమయ్యేసరికి రాఘవేంద్రరావుగారు కొంత తబ్బిబ్బుపడక తప్పిందిగాదు.

"నువు మరికొంతసేపు నిద్రపోయేవాడివేమో! నా మూలంగా నీ నిద్ర పాడైవుంటుంది" అన్నాడు నీలకంఠం.

అతడి మాటల్లో క్షమాపణ ధ్వనిస్తున్నందుకు కించపడుతూ "ఆబ్బే! పరవాలేదులే నీలకంఠం! నా నిద్రమాటకేంగానీ, ఎన్నడూ లేంది అత్తిపూచినట్టు ఈ రోజు నువ్వు యిల్లుద్రొక్కి రావడమే గొప్ప! ఏమిటి విశేషాలు?" అన్నారు.

పైకప్పుకేసి చూస్తూ నీలకంఠం ఉపోద్ఘాతం అవసరమా, అనవసరమా అని కాసేపు ఆలోచించిన తర్వాత, అదంతా ఎందుకనుకున్నట్టు సరాసరి అసలు విషయాన్నే ప్రస్తావించేశాడు.

"అదికాదు రాఘవేంద్రం! నువ్వుఉద్యోగంనుంచీ రిటయిరైనమాట నిజమే! కాదనను

కానీ ప్రాపంచిక వ్యవహారాలేవీ పట్టించుకోకుండా తామరాకుమీద నీటిబొట్టులా కూచోడానికి ముందు నువ్వు స్వార్థంగానూ, పరార్థంగానూ చేయవలసిన పనులు కొన్ని వున్నాయి. నామటుకు నా విషయాన్ని చూడు! ఈడొచ్చిన అమ్మాయిలిద్దరు యింట్లోవున్నారు. తీరా మారా వీళ్ళకు సంబంధాలు కుదిరి పెళ్ళి జరిగేలోపల కడగొట్టుపిల్లకు కూడా వయసొచ్చేస్తుంది. పరిస్థితి యిలా వుంటా! పిల్లకావాలంటూ కడప తొక్కివచ్చి అడిగేనాథుడుమాత్రం కనిపించడంలేదు. ఆడబిడ్డల్ని కన్న నేరానికి యిక మాయింట్లో అమ్మాయిలున్నారండోయ్ అని టాకా వూదుతూ తిరగాలంటే అది నాబోటివాడికి సాధ్యమయ్యేపని గాదు. ఏం చేయమంటావు? రాత్రంతా నిద్రపట్టకపోతే తెల్లవారకముందే లేచి నిన్ను సలహా అడుగుదామని యిలా పరుగెత్తివచ్చేశాను."

రాఘవేంద్రరావుగారు ఒకటి రెండు క్షణాలపాటు ఆలోచించి "దానికేముంది నీలకంఠం! నువ్వు నాతో చెప్పావుగదా! ఇకమీదట యిది నీపనిగాదు. నాపని అనుకో! నేను శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను" అంటూ హామీ యిచ్చారు.

"రక్షించావు బాబూ!" నీలకంఠం తేలిగ్గా పైకిలేస్తూ అన్నాడు: "ఇక నేను విశ్రాంతిగా వుండవచ్చునన్నమాట! వెళ్ళొస్తాను మరి!"

"ఉండుండు, కాఫీ తీసుకుని వెళ్దువుగానీ" అని రాఘవేంద్రరావుగారు అడ్డు తగులుతుండగానే "కాఫీకేం లే, రాఘవేంద్రం! అవతల బోలెడన్ని పనులున్నాయి. మళ్ళీవస్తానులే" అంటూ నీలకంఠం చరచరా వెళ్ళిపోయాడు.

కాఫీ అయినతర్వాత నీరెండలో రాఘవేంద్రరావుగారు చెక్కు మార్చుకోడానికోసం ట్రెజరీదాకా వెళ్ళిరావలసిన పనిబడింది.

డబ్బు జేబులోవుంచుకుని కచేరీ మెట్లు దిగుతుండగా వెనకనుంచీ ఎవరో "వెళ్లిపోతున్నారా బాబాయ్! నేనూ వస్తున్నా" అన్నారు.

రాఘవేంద్రరావుగారు వెనుదిరిగి చూచారు. ఆగంతకుడి పేరు సీతారామయ్య. మనిషి మంచి లౌక్యుడు. పెద్దచదువులు చదవకపోయినా, పితృపారంపర్యంగా సంక్రమించిన కరణీకం వల్ల గ్రామం తన చెప్పుచేతుల్లో వుండగా బ్రతుకు నొకవిధంగా వెళ్ళదీసుక పోతున్నాడు. రాఘవేంద్రరావుగారికి తాశీల్దారుగా ప్రమోషను వచ్చిన క్రొత్తలో అప్పుడే కరణీకం ఛార్జీపుచ్చుకున్న పంతొమ్మిదేళ్ళ కుర్రాడు సీతారామయ్య నేరుగా తాలూకాఫీసులో ప్రవేశించి తాశీల్దారుగారిని "బాబాయ్" అని సంబోధించాడు. రాఘవేంద్రరావుగారు విస్మయపోయి ఆ చుట్టరికపు లోతుపాతుల్ని ఆరాతీయగా కడకు ఆ కుర్రాడేమంత దూరపు బంధువు కాడనీ, తనతల్లి పినతండ్రికి తోడల్లుడి పౌత్రుడేననీ వాస్తవం పైకి తేలింది.

అదంతా మనకిప్పుడు అప్రస్తుతం!

"సరిగ్గా సమయానికి కనిపించావోయ్" అంటూ రావుగారు పరుగుపరుగునా మెట్లు దిగివచ్చిన సీతారామయ్యకు తన గొడుగు నీడక్రింద కాస్త చోటిచ్చి "ఈ మధ్య ఎక్కడా కనిపించడంలేదే! నీతో ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను" అన్నారు.

"అరే, చిత్రంగావుందే బాబాయ్! నేనూ ఒక విషయం చెప్పాలనే యిలా పరుగులుబారి వస్తున్నాను. పోనీ, మీ విషయమేదో మొదట చెప్పేయండి" అన్నాడు సీతారామయ్య.

"ఏంలేదు. నీ ఎరుకలో మంచి కుర్రాడెవడైనా వుంటే తీసుకొస్తావా?" రావుగారు సూటిగా ప్రశ్నించారు.

"ఉద్యోగమేదయినా ఖాళీగా వుందా బాబాయ్?"

"ఉద్యోగం కాదు. సాలంకృత కన్యాదానం"

"అదే, అదే! నే నడుగదలచుకున్నదీ అదే బాబాయ్! పెళ్ళీడొచ్చిన పిల్లను యింట్లో వుంచుకుని నాలుగేళ్ళుగా చెప్పులరిగేటట్టు దేశం చుట్టేశాను. మరి నేనేమో మహా తెలివైనవాడి ననుకుంటుంది లోకం! నా తెలివి తెల్లవారినట్టే వుంది, ఈ విషయంలో మీరు నాకేదయినా దోవ చూపించక తప్పదు బాబాయ్!"



నర్తనబాల
ఫొటో: శ్రీమతి ఎం. ప్రమీలాదేవి,
(కోయంబత్తూరు.)

రావుగారు తెల్లబోయినప్పటికీ తమాయించుకుని "త్రోవ చూపించగలవని నేను పూచీపడలేను సీతారామయ్యా! కానీ ఈ విషయాన్ని జ్ఞప్తిలో వుంచుకుంటాను" అన్నారు.

"మంచిది. ఆ మాటే చాలు. వెళ్ళొస్తాను బాబాయ్" అని, అంతటితో తనపని తీరిపోయినట్టు సీతారామయ్య వెనుదిరిగి కచేరీ వైపు వెళ్ళిపోయాడు.

తనొక సమస్యను పరిష్కరించాలనుకోడమేమిటి? అది చాలక దానికి మరొకటి

★ సంధ్యా సమస్యలు ★

లేదుగానడమేమిటి? రావుగారికి అకస్మాత్తుగా గలిగిన చిరాకు సాయంత్రం లోపుగా యింకా యిద్దరు ముగ్గురు ఆడపిల్లల పెళ్ళి సంబంధాలు కుదిర్చిపెట్టమని తనను అభ్యర్థించడంతో మరీ మోతాదు మీరిపోయింది

ఆ యిద్దరు ముగ్గురిలో ఒకరికేమో బడి పంతులు. రావుగారు ఎంతటి దుర్భర వేదనా భరిత దుఃఖజీవిత గాధలనయినా ఓర్చుకోగలరు గానీ ఈ బడిపంతులనే పేరిట చలామణీ అయ్యే దీనమానవుడి గోడును, అతడి దుఃఖగాథ మాత్రం వినలేరు, వింటే ఆ రోజుకిక ఆయనకు అన్నం సహించదు. నిద్ర పట్టదు.

పైగా ఆ రోజు రావుగారికి తారసిల్లిన బడిపంతులు మాటలసందర్భంలో తనకు ముగ్గురు కూతుళ్ళున్నట్టు చెప్పుకున్నాడు విశేషమేమిటంటే ఆ ముగ్గురికీ వయసులో తారతమ్యం వున్నా దూరంనుంచీ చూస్తే మాత్రం అందరూ కవల పిల్లల్లా కన్పిస్తారట!

"ఈసంవత్సరం ఒకరికో యిద్దరికో పెళ్ళి గాకపోతే ఆతర్వాత నిభాయించుకోడం కష్టం" అని కళ్ళనీళ్లు పెట్టుకుంటే రావుగారు అతడిముఖాన్ని చూడలేకపోయారు.

ఊళ్ళోవుంటే యిక ఈగోలవినకతప్పదని ఆయన షికారుకని ఊరిబయటకువెళ్ళగా, అక్కడా యిలాంటికేసే ఒకటి ఎదురుగావడంతో, కేజారెత్తిపోయి యింటికి తిరిగి వచ్చేశారు.

రావుగారికాయం వాలుకుర్చీలో వాలిపోయివున్నా, ఆయనమనసుమాత్రం మనసులో లేదు. అది పెళ్ళిళ్ల సమస్యచుట్టూ ప్రదక్షిణం తిరుగుతోంది.

ఆయన చిరాకుతో పైకి లేచి అంగవస్త్రాన్ని, చొక్కా తీసికుర్చీపైకిగిరవాటు వేసి గదిలో అటూ, యిటూ పచారుచేస్తూ ఉన్నట్టుండి తలపైకెత్తి "ఒరే సూర్యం, సుధాకరం" అని ఎలుగెత్తి కేకవేశారు.

అంతకుముందే ఆఫీసునుంచీవచ్చి కాఫీ కోసం లోపలికి వెళ్ళిన సూర్యనారాయణ, డాబాపైన నిలబడి సంధ్యాసౌందర్యాన్ని అవలోకిస్తున్న సుధాకరం రావుగారిపిలుపు చెవులబడగానే గదిలోకివచ్చేశారు.

"మీరు నాకోపని చేసిపెట్టాలి రేపటి దినం సెలవురోజేమీ కాదుగదూ!" అంటూ ప్రారంభించారు రావుగారు. "ఇదిగో సూర్యం! నువ్వు ఆఫీసుకు వెళ్ళగానే ఓ కాగితం తీసుకుని అక్కడపనిచేస్తున్న పెళ్ళికాని అబ్బాయిలపేర్లన్నీ చిరునామాతోసహా వ్రాసేయాలి సాయంకాలంలోపల తీరికైనప్పుడు అలాగే డి.ఇ.ఓ ఆఫీసు, ఆర్.టి.ఓ. ఆఫీసు, డిస్ట్రిక్టుబోర్డు ఆఫీసుకూ వెళ్లి జాబితా పూర్తిచేసేయాలి నువ్వు సుధాకరం! డిస్ట్రిక్టుకోర్టు, మునిసిపల్ ఆఫీసూ, మిగిలిన కార్యాలయాలన్నీ నీవి! రేపీపాటికి జాబితాలు నాచేతిలోవుండాలి."

"ఎందుకు నాన్నా!" అంటుతూ మెల్లగా ప్రశ్నించాడు సూర్యనారాయణ.

"ఎందుకేమిటి! ప్రొద్దుపుట్టకముందే లేచి పెట్టి, నున్నగా ముఖంగీచుకుని, చెరగని యిస్త్రీమడతలతో సిగరెట్టు కాల్చుకుంటూ వీధులవెంబడీ బయలుదేరితే సరిపోదురా బాబూ! ఈ వంశోద్ధారకులు చేయవలసిన పనులు చాలావున్నాయి జాబితా చేతికి రానీ, వీళ్ళపని చెబుతాను."

* * *

మరునాటి సాయంకాలం అన్నదమ్ములిద్దరూ మార్గమధ్యంలోనే కలసి యింటికి వచ్చేసరికి రావుగారు తమ గదిలో కూచుని ఏదో వ్రాతపనిలో నిమగ్నులైవున్నారు.

"ఏమిటి నాన్నా అది?" అన్నాడు సుధాకరం, హనుమంతుడి తోకలాంటి జాబితాను బయటికితీస్తూ.

"వచ్చేశారా! కాసేపు నెమ్మదిగా కూచుని ఈఫారాన్నొకసారి క్రిందికీ మీదికీ చూచేయండి సలహా లేవైనావుంటే నిస్సందేహంగా యిప్పుడే బయటపెట్టవచ్చు" అన్నారు రావుగారు.

అన్నదమ్ములు టేబిలుపైకివంగి దీక్షగా ఫారాన్ని పరిశీలింపసాగారు

పేరు అవివాహితుడి సంజాయిషీపత్రం.

(ఎ) అవివాహితుడి పేరు.

(బి) తండ్రిపేరు:

(సి) చిరునామా:

(డి) పెళ్ళిచేసుకునే ఉద్దేశం వున్నదా? లేదా?

(ఉన్నట్టయితే 'ఉంది' అని, లేనట్టయితే 'లేదు' అని వ్రాయవలెను 'లేదు' అని నమోదుచేసినవారు ఇంతటితో ఫారాన్ని మడిచిపెట్టి త్రిప్పిపంపవలెను.)

(ఇ) ఇప్పుడు నువ్వు పెళ్ళిచేసుకోడానికున్న అభ్యంతరాలేమిటి?

(వివరంగా వ్రాయవలెను. అందుకే కాగితం చాలకపోతే ఒక తెల్లకాగితం జతపరచుకోవచ్చును)

(యఫ్) అవివాహితుడి సంతకం.

ఫారం చదివి ముగించి సూర్యనారాయణ సుధాకరంముఖంలోకి చూశాడు. సుధాకరం సూర్యనారాయణముఖంలోకి చూశాడు. అకస్మాత్తుగా ఒకరిముఖంలో మరొకరికి కనిపించింది, ఆశ్చర్యార్థకపు గుర్తో, ప్రశ్నార్థకపు గుర్తో వాళ్ళకు తెలియదు.

వాళ్ళింకా విస్మయావస్థలోనుంచీ తేరుకోకముందే రావుగారు "కాగితాలు తెప్పించివుంచాను కార్బను పేపరుపెట్టి కావలసినన్ని కాపీలు తీసేయండి. రేపే పోస్టు చేసేయాలి" అన్నారు

"ఎందుకు నాన్నా! ఏదో కోర్టువ్యవహారం లాగా ఈ పెళ్ళిళ్ళ విషయాన్ని కూడా వ్రాతకోతలతో ముడిపెట్టడం ఏం బాగుంటుంది? అంతగా అవసరమైతే ఒక్కొక్కరినీ వారగాపిలిచి అంతర్యమేమిటో అడిగి తెలుసుకుంటే పోదూ!" అన్నాడు సూర్యనారాయణ

"అదే అంతర్యాన్ని కాగితం పైకెక్కించడం పెద్దనామోషీ పని కాబోలు! మీ సంస్కారాలు నా కర్థమై ఏడువ్వరా బాబూ! ఇది నాపద్ధతి అంతే! మీరో అరగంటసేపు నాపని కోసం 'డివోట్' చేయండి మిగిలిన పని నేను చూచుకుంటాను"

గొప్ప సమస్య ఒకటి పరిష్కారం కాబోతున్నదన్న సంతృప్తితో రావుగారు తోపాడుగాటి పొగచుట్ట వెలిగించారు

* * *

వారంరోజుల తర్వాత రాఘవేంద్రరావుగారు ప్రారంభించిన వ్యవహారంలో అంతిమఘట్టం, అనుకోని విధంగా, అత్యద్భుతంగా, హఠాత్తుగా సంఘటిల్లింది

ఉదయం పదిగంటలవేళ. ఆఫీసులో తొందరపను లున్నాయేమో, సూర్యం సుధాకరం కలిసికట్టుగా తొమ్మిదింటికే బయటికి వెళ్ళిపోయారు రావుగారు పది రోజులనుంచీ 'మెయింటైన్' చేస్తున్న పెళ్ళిళ్ళ ఫైలును ఒడిలో వుంచుకుని, కత్తి వాదరలా పదనెక్కిపోతున్న ముందు పెండల్ని చూస్తున్నారు.

ఆవేళప్పుడు అలాకూచుని పోస్టుమేన్ కోసం ఎదురుచూడడం ఆయనకు మామూలే!

కానీ ఆ పోస్టుమేన్ కోసం నాలుగైదు రోజులక్రిందట ఆయన ఎంత ఆసక్తితో, ఎంత కుతూహలంతోనైతే నిరీక్షించారో, యిప్పుడంతగా ఆయనలో ఉదాసీనభావం వేరూనుకపోయింది

అందుకు కారణం లేకపోలేదు.

వివరాలను నమోదుచేసుకుని ఇట్లు, ఇట్లుగా తిరిగివచ్చిన అవివాహితుల సంజాయిషీ పత్రాలను పరిశీలించనూ, పరిశీలించనూ ఆయనకిక ఈ సమస్యను పరిష్కరించడం తనతరంగాదన్న విషయం యిట్టే తేలిపోయింది

రావుగారు వేడెక్కిన బుర్రను చేతుల్లో వుంచుకుని సమస్య లోలోతుల్లోకి చొచ్చుకుపోయే అంతర్దృష్టితో సుదీర్ఘంగా ఆలోచించారు.

ఈ అవివాహితులందరూ ఎంతో బుద్ధిమంతులు! పైపైకి 'లోకముతో మనకేటికి' అన్నట్టు బలవంతాన సాగిపోతున్న సంసారరథంలో వెనకవైపున కూచుని ఎప్పుడో, ఎక్కడో క్రిందికి దూకి ఏ సుదూరసీమలకో పారిపోయే ఉద్దేశాన్ని ఎదలో దాచుకున్నట్టు కనిపించినా, నిజానికి వీళ్ళంతా నిర్లిప్తులు మాత్రం కారు! అందుకే బాహాటంగా అందరూ తమకయితే పెళ్ళిచేసుకునే సదుద్దేశం వుండనేవుందని ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు కానీ సంజాయిషీపత్రంలో నాలుగో అంశానికి నేరుగా 'పాజిటివ్' సమాధానం రావడంతోనే ఏమైంది? ఉన్న చిక్కంతా ఆ తరువాతి అంశంలోనే! అక్కడే ప్రతి అవివాహితుడూ గొంతుకలో వెలక్కాయపడ్డట్టు తబ్బిబ్బయిపోతూ, ఒకటి రెండు కుంటిసాకులు చెప్పి ఆఖరుకు ఉన్న పరిస్థితిని యథాతథంగా ఉదహరించి పథాంతర మేమిటన్న పెద్దప్రశ్నతో మానసికంగా కుస్తీ పట్టుతున్నాడు

అసలు విషయం యిది పెళ్ళికావలసిన అక్కచెల్లెండ్రు ఒక్కరో యిద్దరో లేని అవివాహితుడు మచ్చుకైనా కనపడ్డంలేదు మొదట ఆడబిడ్డకు పెళ్ళియితీరాలి! తరువాత నింపాదిగా మగవాడి మాట!

నిజమే! పెద్దలు, వాళ్ళ పెద్దలనుంచీ అనూచానంగా మోసుకొస్తున్న సాంప్రదాయాన్ననుసరించి ఆడబిడకు కాస్త పెందలకడనే పెళ్ళి చేసేయడమే న్యాయం!

ఐతే ఆడబిడ్డపెళ్ళికి కట్నాలు కావాలి. కానుకలు కావాలి

పెళ్ళికుమారుడి, తల్లికీ, తోబుట్టువులకూ మర్యాదలు జరగాలి

ఈ అనవాయితీలన్నీ యథావిధిగా జరిగిపోవాలంటే డబ్బుకావాలి

చేత డబ్బుంటేగానీ అమ్మాయికి పెళ్ళిగాదు. అమ్మాయికి పెళ్ళిగానంతవరకూ అబ్బాయి పెళ్ళిమాట తలపెట్టేవారు లేరు.

పిచ్చికుదిరితేగానీ పెళ్ళికాదు. పెళ్ళయితేగాని పిచ్చి కుదరదు.

ఇప్పుడేం చెయ్యాలి?

ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి?

రావుగారితల్లో ప్రశ్నలు సుడిగుండాల్లా హోరుమంటున్నాయి గేటు తెరచుకుని పోస్టుమేన్ లోపలికివచ్చి ఆయనచేతికో కవరందించాడు.

పరధ్యానంగా కవరుచించి రావుగారు కంటిజోళ్ళు సవరించుకున్నారు

కవరులోనుంచీ కాస్త నిడుపాటి వుత్తరమే క్రిందరాలింది రావుగారికళ్ళు రెండుమూడు వాక్యాలవెంబడీ పరుగెత్తాయో లేదో, ఆయన నిలువునా నిర్విణ్ణులై పోయారు

రేయింబవళ్ళూ తను మూలవిరాట్టులా యింటిపట్టున నిలకొనివుండగా, ముఖాముఖిగా మాట్లాడుకోడం పోయి తన కుమారులే తనకొక ఉత్తరం వ్రాయగలరని ఆయన ఎన్నడూ ఊహించలేదు!

అలా వ్రాయవలసి వచ్చినందుకు క్షమాపణ కోరుతూనే ఉత్తరం ప్రారంభమౌతోంది.

"మహారాజశ్రీ నాన్నగారికి నమస్కారాలు.

ఈ ఉత్తరాన్ని చూడగానే, మీకు ఆశ్చర్యమూ, దాని వెనువెంటనే కోపమూ కలగడానికి అవకాశం వుంది.

కానీ మీరు మమ్మల్ని మన్నించాలి

ఏదో నోటిమాటలతో ఉబుసుపోకగా

★ సంధ్యా సమస్యలు ★

చెప్పదలుచుకున్న విషయాన్ని కాగితం పై కెక్కించి నట్టయితే, ఆ విషయానికి కొంత బరువు చేకూరుతుందని మీరే సెలవిచ్చారు. మాకు పాఠికేళ్ళు మీరిపోయాయి మీ వుద్దేశానికేనాడూ వ్యతిరిక్తంగా ప్రవర్తించి నట్టు మాకు లీలా మాత్రంగానైనా జ్ఞాపకం లేదు.

ఇక ప్రస్తుత విషయాన్ని గురించి: పది పదిహేను రోజులనుంచీ మీరు ఆడపిల్లల పెళ్ళిళ్ళను గురించిన ఆలోచనలతో సతమతమైపోతూ వుండడం మేము కళ్లారా చూస్తున్నాం. నిజానికిది పద్మవ్యూహాల్లాంటి పెద్ద పెద్ద చిక్కుల్ని విడదీసి, ప్రభుత్వ వ్యవహారాల్లో ఢక్కా మొక్కీలు తిన్న మీ బోటి అనుభవజ్ఞులు చేయి చేసుకోవలసిన సమస్యే! కాని ఒక చిన్న విషయాన్ని మీ రిక్కడ గమనించాలి! "నేను సైతం ప్రపంచాబ్జపు తెల్ల రేకై పల్లవిస్తాను" అన్న కోరిక ప్రతి సామాన్యునికీ వుంటుంది. సరిగ్గా మాదీ అలాంటి కోరికే! ఈ మా తోడ్పాటుతో వివాహాల సమస్య పటాపంచలై, పంచబంగాళమై పోతుందని గాదు. మీ బోటి వారు వారిధిమీద వారధి నిర్మించడానికి ప్రయత్నిస్తే, మేము వుడతా భక్తిగా యథోచిత సహాకారం నెరపదలచుకోడం సమంజసం కాకపోదు.

అసలు విషయమేమిటంటే మీతో బాటు మేముగూడా గత రెండువారాలనుంచీ ఈ పెళ్ళిళ్ళ సమస్యను గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాం.

పరిమితమైన మా లౌకిక విషయపరిజ్ఞానంతో ఈ సమస్యను మథించగా తేలిన సారాంశాన్ని మీకు తెలివిడి చేసుకోడానికే ఈ ఉత్తరం వుద్దేశింపబడింది.

ఒకటి: పెళ్లి అనే సాంఘికాచారం ఆడపిల్లల కెంత అవసరమో, అబ్బాయిలకూ అంత అవసరమే! కానీ ఈడొచ్చిన అమ్మాయిని యింట్లో వుంచుకోడం లోకుల దృష్టిలో అగ్గిని ఒడిగట్టుకోడంలా భాసిస్తోంది. అందుచేత వయసు మీరిపోతున్నప్పటికీ కొడుకు నలా వుంచేసి, తలిదండ్రులు మొదట కుమార్తెకే శుభకార్యం జరిపేయాలని ఆశిస్తున్నారు.

రెండు: బాగా డబ్బున్నవాళ్లకూ, బొత్తిగా లేమిడికుటుంబాలకూ ఈ వివాహాలు ఒక సమస్యగానే తోచడం లేదనిపిస్తోంది. శ్రీమంతులు ఎంతడబ్బయినా వెదజల్లి ఆకాశమంత పందిరి, భూదేవంత అరుగూ వేసి పెళ్లిళ్ళకు కొట్టి కోలాహలం చేస్తారు. పేదవాళ్లు ఉన్నంతలో కట్నాలు, కానుకల ప్రసక్తి లేకుండా ఏదో అయిందనిపించేస్తారు. తిండికీ బట్టకూ జీతంరాళ్లు అందదుకులుగా సరిపోయే మధ్యతరగతి కుటుంబాలను మాత్రమే ఈ వివాహ సమస్య భీషణంగా ఎదుర్కొంటోంది. అది మంచికో, చెడ్డకో చెప్పలేముగానీ మన దేశంలో ఈ మధ్యతరగతి కుటుంబాలే హెచ్చు!

మూడు: పోనీ, కుమారుడికి పెళ్ళిచేస్తే కట్నం వస్తుందిగదా, ఆ కట్నంతోనే అల్లుడికెందుకు తెచ్చుకోగూడదని యిక్కడొక వాదం పైకిరావడానికి వీలుంది. కానీ కొంచెం కదిలించిచూస్తే యిదీ బొత్తిగా బలంలేని వాదమేనని తేలిపోతుంది. కూతుర్ని ఓమెట్టు పై కుటుంబంలో యివ్వాలనీ, తమకు అణగి మణగి వుండడంకోసం కోడల్ని ఓమెట్టు క్రింది కుటుంబంలోనుంచీ తెచ్చుకోవాలని తలిదండ్రులు వాంఛిస్తారు. ఈ పరిస్థితుల్లో కూతురిపెళ్ళికి తమ తాహతుకు మించిన కట్నాన్ని యివ్వవలసివచ్చి వీళ్ళంతగా ధనాభావానికి గురౌతారో, కుమారుడి పెళ్ళికి అటువైపున అతడి అత్తగారి కుటుంబమూ సరిగ్గా అలాంటి యిక్కట్టుకే గురౌతోంది. ఈ విషయం అటుండగా, కుమారుడి పెళ్ళికట్నం, ఆ పెళ్ళిలోనే సగానికి పైగా వ్యయమైపోతోంది. మిగిలిన డబ్బును తన్నుకపోవడానికి రాబందుల్లాంటి అవసరాలు కాచుకుని వుండనే వుంటాయి.

నాలుగు: కాగాపోగా ఇక ఈ పెళ్ళిళ్ళన్నీ సజావుగా జరిగిపోవాలంటే అందుకు ఒకే ఒక్క మార్గం మాత్రం వుంది. ఇదేమిటో అందరికీ తెలుసు! కానీ విచిత్రమేమిటంటే, యింత సులభమైన పద్ధతిని ఆచరణలో పెట్టి ఇటు తామూ, అటు ఎదుటివాళ్ళు సాఫీగా సంసారాల్ని లాక్కుపోవడానికి బదులు అందరూ కట్నాలనీ, కానుకలనీ చేజేతులా చిక్కుల్ని కొనితెచ్చుకుంటున్నారు.

రోగానికి మూలకారణమేదో గుర్తెరిగి, దాన్ని అక్కడినుంచే తుడిచిపెట్టే వైద్యప్రక్రియ చాలా మంచిదన్న విషయాన్ని మీరు ఒప్పుకున్నట్టయితే, ఈ వివాహాల అలజడికి మూలకందమైన కట్నాలతంతును సమూలంగా నాశనం చేయాలన్న మా నిర్ణయంతో ఏకీభవించకపోరు!

కానీ మనం నిర్ణయాలు చేసుకున్నంత మాత్రాన సంఘానికి పెద్ద లాభం చేకూరిపోదు.

కట్నం 'డిమాండ్' చేయడానికి అన్ని అర్హతలను కలిగివున్నా, దాన్ని నిరాకరించి, నలుగురికీ ఆదర్శప్రాయంగా కార్యాచరణ చేసి చూపెట్టడానికి మీ వంటి విజ్ఞులు ముందుకురావాలి.

ఇక్కడ వ్యయానా మీ చెల్లెలికి (మా మేనత్త కన్నమాట!) యిద్దరు కూతుళ్లున్నారనీ, ఒకప్పుడు బాగా బ్రతికినా యిప్పుడా కుటుంబం అల్లుళ్ళకు కట్నాలిచ్చే అంతస్థులో లేదనీ యిక్కడ మీకు విన్నవించుకోడం సముచితం గాకపోదని మా ఆశ!

మీరు చేబట్టిన ఆడపిల్లల పెళ్ళిళ్ళనే మహోద్యమానికి ఈ మా ముందంజ అంకురార్పణంగా పరిణమిస్తే, అంతకంటే మాకు సంతోషకరమైన విషయం మరొకటి వుండబోదు. ★

పాతిగాదులో గోపాలం

బి.ఏ. ప్యాసైన గోపాలం ఇంకా అవివాహితుడు! ఇదే గోపాలంతల్లి శేషమ్మని వేధించుకుతింటూన్న ఒకేఒక విషయం.

ఇరవైదూ ఏళ్ళ గోపాలం ఇంకా పెళ్లి చేసుకోకుండా వున్నాడు! పెద్దమనిషై ఒక సంవత్సర ప్రకాలికను అవలీలగా పూర్తి చేసుకున్న అమ్మాయినింట్లో వుంచుకున్న గోపాలం మేనమామ అప్పుడప్పుడు విచారంతో ప్రకటిస్తోన్న ఆశ్చర్యార్థకం.

“గోపాలం! ఇంకెప్పుడురా నీ పెళ్లింగు పార్టీ ఇచ్చేది మేము చూడు అప్పుడే పిల్లల తండ్రులం కావొస్తున్నాం”

అని సుభావంగా అంటూండడం గోపాలం ఫ్రెండ్సు కలవాటు.

వీళ్ళందరికీ దాదాపు రోజూ సమాధానం చెప్పవలసిరావడం గోపాలానికి మాపెద్ద చిరాకుగా వుండేది అందులో గోపాలం తల్లి మరీను. అందరి దొకఎత్తైతే శేషమ్మ గారి దొకఎత్తు. ఫ్రెండ్సు కేదో ఒకటి చెబుతూవచ్చినా, తల్లిని సమాధానపరచడం గోపాలానికి అసాధ్యంగా పరిణమించింది.

“ఎంతైనా తనకొడుకు తండ్రిలేని పిల్లాడు ఇంటికి పెద్దవాడు వంశాన్ని వుద్ధరించాల్సినవాడు. త్వరగా వాడికి ఆమూడు ముళ్లు వేసేస్తే తాను హాయిగా కృష్ణా-రామా అంటూ కాలం గడప వచ్చని శేషమ్మ అభిప్రాయం

ఎప్పుడూ అంటూనే వుండేది “నాయనా మా మయ్య తొందరపడుతున్నాడురా. పాపం ఆ అమ్మాయి వాడి గుండెమీద కుంపటై కూచుంది” అని.

‘అమ్మా నీ కిదొపిచ్చి-వాళ్లకోసం నన్ను బావిలో దూకమంటావేం? ఎవరి బాధ వాళ్లకుండనేవుంది. ఇంతవరకూ ఓ వుద్యోగం లేదు బ్రతుకు దెరువులేదు ఏదోఓటి అయిన తర్వాతే పెళ్లిచేసుకుంటాను ఇప్పుడేం తొందరొచ్చింది” విసుగుతో గోపాలం ప్రొటెస్టు చేసేవాడు.

ఇక మేనమామసంగతి అడగక్కరనే లేదు ఎంత త్వరగా ఆ గుదిబండని దించేసుకుంటే అంత మంచిదిరా బాబూ అన్నట్టుగా వాన్నకోసం ఎదురు చూస్తున్నాడు కూతురు రజస్వల అయినప్పటినుండి వారానికొకసారైనా చెల్లెలింటికి రాకమానడు. ఆయన గోపాలాన్ని డైరక్టుగా అడగక పోయినా చెల్లెలిద్వారా అడిగిస్తూనే వుండేవాడు ఇదే గోపాలానికి భరించరాని విషయమైంది.

ఒకసారి మేనమామని నిలేసి అడిగాడు: “ఏమిటీ అలా అమ్మని సంజాయిషీనడంకంటె నన్నడగరాదా” అని - అల్లుణ్ని వున్నపాళంగా అడగడం మామకి భయం.

ఒకసారి ఎదురింటి పేరయ్యగారి కొడుకు పెళ్లి కెళ్లొచ్చిన శేషమ్మ ఆ రాత్రంతా వీకరువుపెట్టసాగింది కొడుకు పెళ్ళిగురించి.

“చూడు గోపీ-పేరయ్యగారి కొడుకు నీకంటె చిన్నవాడు. ఎంత బుద్ధిమంతుడురా, ఎంతో ముచ్చటనిపించింది వాడు పెళ్ళిచేసుకొంటూంటే ఎంత చదివితేమాత్రం ఏం నీకింకా బుద్ధి రాలేదబ్బాయి! ఇంతకీ నారాత” అంటూ తలపట్టు కొక్కుంది కొడుకు ప్రక్కనే

వాళ్ల వీళ్ళగురించి తల్లి చెపుతూంటే

‘నయాగరా’

గోపాలానికికోపం రాసాగింది. కోపంతోనే “పేరయ్యగారి కొడుక్కేం, పుట్టుకతోనే డబ్బు తెచ్చుకున్నాడు. ఇంకా ఏడుతరాల దాకా కాలుమీద కాలేసుకుని కూచుని తిన్నా ఆ ధనరాసులు తరగవు. మనమూ వాళ్ళకి పోలికెక్కడ?” అని గోపాలం పూర్తిగా అనకముందే శేషమ్మ మళ్ళీ అందుకుంది అబ్బో ధనవంతులు - ధనవంతులట మనమేమన్నా కూటికి చస్తున్నామా! మీనాన్నగారున్నప్పుడు వాళ్ళు మనముందెంతరా? ఆయన చివరిఘడియల్లో తగలేశాడు కాని మన పూర్వులంతా కోటికి పడగెత్తిన వాళ్ళు కాదుట్రా. అంతకైతే మీమామయ్య వుండనే వుండె అసలాకి. వాడుమాత్రం వుత్త చేతులతో యిస్తాడా పిల్లని.”

గోపాలం తానెంతచెప్పినా తల్లి కర్థం కాదని ఏమీమాట్లాడలేదు. ఈ పెద్దవాళ్లతో వచ్చిన చిక్కే ఇంతనుకున్నాడు ‘ఎంతసేపటికి తాతలు నేతులు తాగిన రోజులగురించే ఆలోచిస్తారు ‘వాడు సాయంచేస్తాడు, వీడు పిలగబెడ్తాడు’ అనే గానీ ఇప్పుడున్న పరిస్థితుల్ని ఆలోచించరనుకుని, గోపాలం తల్లికేమీ బోధించడానికి ప్రయత్నించలేదు పైగా ఆమె వుపన్యాస ధోరణి చూసి విసుగెత్తి లేచిపోయాడక్కడినుంచి.

ఆరోజురాత్రి శేషమ్మ అన్నం ముట్టలేదు రోజూ కొడుక్కి తానే వడ్డించేది. ఆవాడుమాత్రం కొడుకుభోజనానికిరాగానే లోగిలి ముందరుగుమీద ముడుచుకుని పడుకుంది. గోపాలానికి చెల్లెలే వడ్డించింది. ఆ నాటినుండి శేషమ్మ కొడుకుతో మాట్లాడడమే మానేసింది. గోపాలం తల్లిని మాట్లాడించడానికి ఎన్నోసార్లు ప్రయత్నించాడు. కాని ఆవిడమాత్రం తాను పట్టినపట్టు వదలేదు. రానురాను అతడు కూడా ఆమెతో మాట్లాడడం మానేశాడు రోజులు గడచిన కొద్దీ శేషమ్మ క్షీణించిపోసాగింది. తరుచుగా ముడుచుకుని పడుకోవడం అలవాటు చేసుకుంది గోపాలం ఒకసారి మంచంలో వున్న తల్లిని చూసాడు. చొప్పబెండులా అయింది తల్లిని చూస్తూన్న గోపాలం కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి. పోవద్దనుకుంటూనే మంచం దగ్గర కెళ్లాడు శేషమ్మ వులకలేదు, పలకలేదు అలా పైకి చూస్తూ పడుకొనివుంది. భయం భయంతోనే ‘అమ్మా’ అన్నాడు శేషమ్మ కొడుకువైపు శూన్యంగా చూసింది అలాతల్లి చూసినప్పుడు అతనికేడ్పు ముంచుకొచ్చింది తల్లివైపు ముఖం పెట్టినవాడల్లా, ముంచుకొస్తున్న దుఃఖాన్ని ఆమె గూడకుండాలని మరోవైపు తిప్పాడు ఎంత ప్రయత్నించినా ఎక్కిళ్ళాగలేదు.

శేషమ్మ మెల్లగా ‘ఎందుకేడుస్తున్నావ్, నాయనా’ అని అనగలిగింది

‘అమ్మా, నే పెళ్లిచేసుకుంటానమ్మా!’ శేషమ్మ నమ్మకుచేయలేగు. ఆనందంతో కొడుకుని చూసుకొంది

“ఈ వేసవిలో తప్పకుండా చేసుకుంటానమ్మా ఇదిగో నీచేతిలో చేయేసి చెపుతాను” అంటూ గోపాలం తల్లి చేయిని తనచేతిలోకి తీసుకున్నాడు

శేషమ్మకొడుకు తలనిమురుతూ “ఎంత మంచివాడివిరా బాబూ, ఈ పాపపుకళ్లతో నీపెళ్లి చూస్తాననుకోలేదురా” అన్నది

గోపాలం తల్లిచేతిలో చెయ్యైతే వేశాడు గానీ పెళ్లనగానే భయంభయంగానే అనుపడసాగాడు అతడెన్నడూ ఆలోచించనంత ఘాటుగా “పెళ్లి”నిగురించి ఆలోచించడం మొదలెట్టాడు అతడికి ‘పెళ్లి’అ

★ సాలిగూడులో గోపాలం ★

గానే ఓహో పెళ్ళాం, పెళ్ళామవగానే తన అక్కయ్యకి వున్నంతమంది పిల్లలు–రోగాలు, వాళ్ళ పోషణ, చదువులు, తిండీ తిప్పలు–అన్నీ బుర్రలో మెదలసాగాయ్. ఇంకో అర్ధగంట ఆవిషయం మీద ఆలోచిస్తే బుర్ర పాడైపోతుందనుకొని వెంటనే ఆపేశాడు. ఆలోచనల్ని, ఛీ, పెళ్ళి చేసుకోగూడదు. ఈ మురికి కొంపలో—ఈ దీన రికంలో పెళ్ళేమిటి పెళ్ళి! వెర్రి వెంగళప్పాయలా—ఛస్తే చేసుకోగూడదు" అనుకున్న గోపాలానికి తల్లి, మామయ్య, స్నేహితులు, చెల్లెళ్ళూ అంతా జ్ఞాపకమొచ్చారు. కనీసం వాళ్ళకోసమైనా చేసుకోక తప్పదని గోపాలానికి ఆలోచించినకొద్దీ తెలిసిరాసాగింది.

2

ఇప్పుడు గోపాలం వివాహితుడు.

తల్లి దృష్టిలో వంశోద్ధారకుడు.

ఇప్పుడు తనకూతురు గోపాలానికి భార్య. మేనమామ దృష్టిలో 'చాలా మంచివాడు' గోపాలం.

ఇప్పుడు గోపాలం పెళ్ళిచేసుకున్నాడు.

ఎట్లాగైతేనేమి కొన్నిరోజులు బ్రహ్మచర్యాన్ని వెలగబెట్టినా చివరికి తమలో కలిశాడన్న సంతృప్తి వున్న ఫ్రెండ్సుకి శుభవార్త.

పెళ్ళైనాక చాలారోజులకు గోపాలానికి తాలూకాఫీసులో చిన్న గుమాస్తాగిరీ దొరికింది. ఇంత అల్పంగా కొడుక్కి వుద్యోగం దొరకడానికి కారణం కోడలు మంచిజాతకురాలు కాదని శేషమ్మ అభిప్రాయం. శేషమ్మకి కోడలిమీద సదరు అభిప్రాయం కుదరడానికి కారణం తమ్ముడు కొడుక్కిస్తానన్నంత డబ్బివ్వకపోవడం–కొడుక్కి ఉన్న వూళ్లోనే వుద్యోగం దొరకడంవల్ల శేషమ్మకు కదలాల్సిన అవసరం కలగలేదు.

శేషమ్మ తమ్ముడిమీద చిరుబురులాడుతూనే కోడల్ని తీసుకొచ్చింది. తమ్ముడిమీదికోపం అప్పుడప్పుడు కోడలుమీదకు మరలించేది శేషమ్మ. కోడలు కూడా తక్కువ తిన్నది కాకపోవడంవల్ల ఇద్దరిమధ్యన మాటి విరుపులూ, కీచుధ్వనులు పుట్టడం మొదలెట్టాయి.

మొదట్లో ఈరగడలు గోపాలం చెవిలోకి పోలేదు. గోపాలంకూడా అనుకునేవాడు అత్తాకోడళ్లు ఎంత అన్యోన్యంగా వుంటున్నారని. మొదటిరెండు సంవత్సరాలు భార్యతో సుఖంగానే కాలం గడిపాడు గోపాలం. మూడోసంవత్సరం ప్రారంభంలో ప్రారంభమయ్యాయి భార్యామణి చిరుకోపాలు, పెదవి విరుపులు. అప్పుడు వినబడసాగాయి అతని చెవులకి అత్తాకోడళ్ళ అలజడులు. అవి ఎట్లా బయటపడ్డాయంటే పెళ్ళాంమీదున్న నగల్ని తాకట్టుపెట్టి చెల్లెలి పెళ్ళి చేయడంతో. మామకికూడా కూతురు సొమ్ముల్ని తగలేశాడని గోపాలంమీద పట్టరానికోపం కల్గింది.

ఒకసారి భార్య, తల్లీ తనముందే పోట్లాడుకోసాగారు. గోపాలానికి కోపం ముంచుకొచ్చింది. వెంటనే తల్లిదగ్గరకువెళ్ళి 'అమ్మా వద్దంటూంటే పెళ్ళెందుకుచేశావ్' అని అడిగాడు.

'ఇపుడేం ముంచుకుపోయింది?' అని శేషమ్మ ఏమీ జరగనట్టడిగింది.

"ఏమిటా ముంచుకుపోయింది? రోజూ మీకీచులాట! ఆఫీసులో ఆ యముడుగాడు కొరుక్కుతింటాడు. ఇంట్లో మీ గొడవ. ఇల్లా నన్ను నాలుగ్రోజులు బ్రతకనివ్వండే! దానికి బుద్ధిలేకున్నా పెద్దదానివైన నీకైనా ఓపికుండక్కర్లా" అని కొడుకంటుంటే శేషమ్మ బిత్తరపోయింది.

'నాదేం తప్పుందిరా! చిన్నా పెద్దా వుండక్కర్లా దానికి? ఎట్లాబడితే అట్లా అంటుంటే నన్నే! నీవు దాన్ని వెనకేసుకొస్తున్నావ్! ఎలాగైనా పెళ్ళాం పెళ్ళా మేరా బాబూ" అంటూ రాగాలు మొదలెట్టింది శేషమ్మ. పక్కగదిలోనుండి భార్య కూడా ఏదో గొణగసాగింది. ఇదంతా చూస్తూంటే గోపాలానికేమీ తోచలేదు. ఎవరిది తప్పో నిర్ణయించలేకపోయాడు. అతనికి వెర్రెక్కినట్టయింది. 'ఈ కొంపలో ఒక్కక్షణంకూడా వుండ'నంటూ చరచర బయటికి వెళ్ళిపోయాడు.

గోపాలానికొచ్చే డెబ్భైరూపాయలు సరిపోవడం లేదు. ప్రతీ సంవత్సరం దొరికే ఇంక్రిమెంట్లకీ, ఇంట్లో భార్య కడుపుతప్పకుండా సంవత్సరానికొక సంతానాన్ని కనడానికి సంబంధమెక్కడా పొసగలేదు. వాళ్ళ బారసాలలకీ, వాళ్ళ పాలడబ్బాలకే సరిపోయేది అతను తెచ్చేజీతం. చేబదుళ్లు కొన్నా అప్పులుగా మారుతుండేవి.

ఒకసారి గోపాలం ట్రెజరీ సెక్షన్లో పని చేస్తున్నప్పుడు కుటుంబావసరాల మూలాన లెక్క బాగా తక్కువ వచ్చింది. ఆ లెక్కని భర్తీ చేయకపోతే వుద్యోగం వూడడం ఖాయం. ఇంట్లో ఏదైనా అమ్మి పూర్తి చేద్దామన్నా పెళ్ళాంమీద మంగళసూత్రం గొలుసు తప్ప మరేమీలేదు. దాన్ని నవన పరంగా ముట్టడం దేనికని తల్లి సలహామీద మామదగ్గరికెళ్లాడు. గోపాలం ఎన్నడూ ఎవరినీ యాచించి ఎరగడు. అదే మొదటిసారిగా మామమీద ఎంతో ఆశపెట్టుకుని అడిగాడు. అడగలేక అడిగాడు. అడగడగక అడిగినందుకు మామకూడా 'ప్రస్తుతం నా దగ్గర చిల్లిగవ్వ లేదు నాయనా' అని సున్నితంగా సాగనంపేడు. దాంతో ఇల్లాలిగళసీమని పసుపుకొమ్ము అలంకరించింది. తల్లి ఎప్పుడో పెళ్లికిముందు 'మీ మామ అప్పుడప్పుడాసరా పడుతాడురా' అని అన్నమాటలని అతను మనస్సులోనే పూడ్చేసుకున్నాడు.

గోపాలం ఇప్పుడు ఒక మెషీన్. ఆఫీసు టైము అయిపోయిన తరవాతకూడా పనిచేస్తున్నాడు. పెద్దమ్మాయి పెళ్ళి, రెండవవాడి చదువు అతన్నెదురుకుంటున్న సమస్యలు. తన శరీరాన్ని ఆ ఆఫీసు కుర్చీకి, టేబిలికి ఎంత అంటిపెట్టుకున్నా–కుటుంబావసరాలు గడవడమే కష్టంగా వుంది.

గోపాలం తన యౌవనాన్నంతా ఆఫీసు కర్పించాడు. ఫైళ్ళే అతని పఠనగ్రంథాలు.

గోపాలం సాధించిన టార్గెటు అతని సంతానం. తన చుట్టూ తన పిల్లలంతా కూడినప్పుడు అచ్చం పిల్లలకోడిలాగ ఉంటాడు.

3

క్లార్క్ గోపాలం ఇప్పుడు రిటైర్డ్ గోపాలం—

పెద్దమ్మాయికింకా పెళ్ళిచేయలేదని తల్లి, భార్యలకోపం.

గోపాలం కటిక నిష్ప్రయోజకుడు—

ముసలి మామగారి గట్టి నమ్మకం.

గోపాలం చేబదుళ్లకు పెట్టినపేరు—

ఫ్రెండ్సంతా ఏకగ్రీవంగా పాసుచేసిన తీర్మానం. ★



మోసపోయిన పాప

చిన్నారి పాపాయి
చిలక కావాలంటు
నాన్నారి నెంతోను
బ్రతిమిలాడింది.

మాటలు నేర్చిన
మామంచి చిల్కను
నాన్నారు పాపకు
బహుమతిచ్చారు.

ఆటలూ నేర్పింది
పాటలూ నేర్పింది
చిన్నారి పాపకు
వయ్యారి చిలుక.

ఆటలు పాటలు
ముఖ్యంబుగా నమ్మ
"అ ఆ"లు చెప్తాను
పలక తెమ్మంది.

చిలుక మాటలకెంతో
పరవశించిన పాప
పరుగు పరుగున వెళ్లి
పలక తెచ్చింది.

అక్కరంబులమీద
మక్కువ ఎక్కువై
పంజరం తల్పును
పైకి లాగింది.

బిరబిరా చిలకమ్మ
ఎగిరిపోయింది
మోసపోయిన పాప
బిక్కపోయింది!

శ్రీ విఖనస

ఒళ్ళు గుమ్మడిపండు

అయ్యగారి విశ్వేశ్వరరావు

రాజానందం, దేవానందం అనే ఇద్దరుస్నేహితులుఆశాపురంలో నివసిస్తూండేవారు. వాళ్లిద్దరూ కూడా ఒక్క గురువుగారి దగ్గరే విద్యాభ్యాసం చేశారు. మంచి పండితులయ్యారు. పెద్దవాళ్లయి-పెళ్లిళ్లు చేసుకున్నారు. రాజానందం పెళ్లాంపేరు సీతమ్మ. దేవానందం పెళ్లాంపేరు రత్నమ్మ.

రాజానందం దర్జాగా ఆశాపురం రాజాగారి పరిచయం సంపాయించుకొన్నాడు. ఆస్థానంలో పండితుడుగా ఉన్నాడు. కావలసినంత పలుకుబడి సంపాదించుకున్నాడు. పెళ్లాం బిడ్డలతో ఏలోటూ లేకుండా సాగిపోతూంది అతనికి.

దేవానందంఎప్పుడూభగవంతుని స్మరిస్తూవుండేవాడు. అతనిభార్య రత్నమ్మ, సంసారం యీదే ఉపాయం చూడండీ- దరిద్రంతో యిలా భజనచేయడంకన్న- రాజాదరణతో దర్జాగా వుందాం. మీరు కూడా రాజాగారిని సందర్శించి - వారి ఆదరాభిమానాల్ని పొందండి. పెళ్లాం బిడ్డల్ని చూచైనా మీ భజనలు మానండి అని చెవిని ఇల్లుకట్టుకొన్నట్లు పోరుపెట్టేది.

ఎంత దరిద్రస్థితిలోవున్నా దేవానందం దైవభజన మానలేదు. ఒక రోజున రాజానందం, దేవానందాన్ని చూడటానికి వచ్చాడు. వాళ్లిద్దరూ మాట్లాడుకునే ధోరణిలో రాజబలం కావాలి, మనం బాగుపడాలి అని రాజానందం అన్నాడు. అది కేవలం పిచ్చి! మనిషి బాగుపడాలంటే దైవబలం ఉండితీరాలి అన్నాడు దేవానందం.

ఆ మాట వినగానే రాజానందం వెంటనే అందుకున్నాడు. నీ దైవ బలం వాదంతో నీవు సాధించింది ఏముందయ్యా? పెళ్లాం బిడ్డల్ని పస్తుండమంటున్నావు. కట్టుకోడానికి చింకిగుడ్డలైనా లేవు. ఇల్లంతా సూర్యచంద్ర నక్షత్రాలకు ఆటస్థలం అయింది. రేపో—మాపో ప్రాణం పోయే నీరస స్థితిలో మీరంతా అఘోరిస్తున్నారు. పిచ్చి వేదాంతంతో పెళ్ళాం బిడ్డల ప్రాణాల్ని నిలువునాతీసే నీ దైవ బలం ఇంతేకదూ! అంటూ రాజానందం-కళ్లకు ఎదురుగా కనిపించే పరిస్థితిని ఆధారంగా తీసుకొని దులిపేశాడు.

దేవుడు ఈయనగారికోసం — కొండమీంచి దిగివస్తాడా ఏమిటి? ఇదోరకం పిచ్చ అంది రత్నమ్మ. ఆడాళ్లకి డబ్బుపిచ్చ బయులుదేరితే ఏవంటున్నారోకూడా తెలియదుగా మరి—

సరే-నీ రాజబలం గొప్పది అంటూవన్నమాట అన్నాడు దేవానందం.

అక్షరాలా సుఖపెట్టేబలం-మన కష్టకాలంలో ఆదుకొనే బలం — అన్నింటికీ అండగావుండే బలం-కనిపించే బలం ఇది. ఈ రాజబలమే నా దృష్టిలో అన్ని బలాలూను. దైవబలం అనేది వేరే లేదు. ఈ రాజబలంలో భాగమే దైవబలం అంటాను. రాజాశ్రయం వుంటే - అదే పదివేలు అన్నాడు రాజానందం.

పాపం-దేవానందం తాత్కాలికంగా మాట్లాడలేక పోయాడు. మాట్లాడకపోయినా మతం మాత్రం మార్చుకోలేదు. రత్నమ్మకి బెంగగానే వుంది. కష్టాలకాపరం దినదినగండంగా సాగుతూంది.

*   *   *

ఆనాడు సంవత్సరాదిపండుగ. ఆశాపురం రాజుగారి దర్బారు గొప్పగావుంది. దేశదేశాల నుంచి పండితులు వచ్చారు. రాజుగారిని ఆశీర్వదించారు. రాజానందం అందరికన్నా గొప్పగా ఆశీర్వదించాడు. రాజుకూడా అతనిని ఎంతో మెచ్చుకున్నాడు. ఇంకా సభ సాగుతూనే వుంది రాజదర్బారులో.

ఆశాపురంలో ఎక్కడ చూచినా ఉగాది ఆనందం తాండవిస్తోంది. పాపం దేవానందం ఇంట్లోమాత్రం ఇనపగజ్జలతల్లి నృత్యం చేస్తోంది. పెళ్లాంబిడ్డల ప్రాణాలు కళ్ళల్లో

ఉన్నాయి. దేవానందం మాత్రం దైవపూజమానలేదు. ఎంత దరిద్రం వచ్చినా - ఎన్ని కష్టాలు వచ్చినా - ఎన్ని నష్టాలు వచ్చినా - దేవానందం దేవుడే దిక్కని దైవపూజ మానటం లేదు.

ఇంతలోనే తలుపు చప్పుడైంది. తలుపు తెరిచారు. రాజానందం పెద్దకూతురు ఒక కుళ్లు గుమ్మడి కాయ పట్టుకొచ్చింది. దాన్ని రత్నమ్మచేతిలో పెట్టింది. మాఅమ్మ మానాన్న మీకిచ్చిరమ్మన్నారంది. దేవానందం పూజలోనే వున్నాడు. రత్నమ్మకి కుళ్లు గుమ్మడికాయ చూచేసరికి ఒళ్లు మండిపోయింది. లేనివాళ్లమని ఇలా అవమానిస్తారా! కుళ్లు గుమ్మడికాయ కూరకా— పులుసుకా—గోతిలో కప్పెట్టుకోవడానికా అంటూ రత్నమ్మ వేళ్లు విరిచింది. మూతి ముక్కులు మూడు మూలకీ త్రిప్పింది అంత నడమంత్రమా! ఆ సీతమ్మకి—అంది! రాజుగారిచ్చిన అయిన బహుమానాలు అక్కడుంచుకొని — కుళ్లు గుమ్మడికాయ మా మొహాన పడేసిందా! అన్నన్నా—ఇంత మిడిసిపాటా? ఆ సీతమ్మకి అంటోంది రత్నమ్మ. దేవానందం పూజలోంచి లేవలేదు. ఇంకా పూజ చేస్తూనే వున్నాడు.

* * *

దీనికి పూర్వం రాజసభనుంచి. రాజానందం యింటికి రావడమే అదో మాదిరిగావున్న మొహంతో వచ్చాడు కత్తినాటుకి నెత్తురుచుక్క లేదు. అతని మొహంచూస్తే చాలా నిరాశపొందిన వాడిలాగ వున్నాడు రాజుగారు — ఉగాదినాడు మెచ్చి మేకతోలు కప్పుతాడనుకొంటే— కుళ్లుగుమ్మడికాయ చేతిలోపెట్టాడు. మరేమీ యియ్యలేదు. సంవత్సరానికి కావలసిన గ్రాసం—ఉగాదినాడు వచ్చేది. ఈ మాటుదొరికింది కుళ్లుగుమ్మడికాయ— ఆ బెంగతో ఇంట్లో అడుగుపెట్టేడు రాజానందం. సీతమ్మ చూచింది కుళ్లు గుమ్మడికాయను. ఇంట్లోకి కూడా తీసుకురాకూడదనుకుంది. దాపాడు గుమ్మడికాయను అనుకుంది. పాపం-వెర్రి మొగుడు- రాజదర్బారునుంచి యింటిదాకా ఆ కుళ్లు గుమ్మడికాయను మోసుకొనివచ్చినందుకు మెచ్చుకుంది. శుభమా-అంటూ ఉగాదినాడు మన కొంపకీ కుళ్లు గుమ్మడికాయ ఎందుకు? సంవత్సరం పొడుగునా యిలాంటి కుళ్లుగుమ్మడికాయలే మనకివస్తాయి అనుకుంది సీతమ్మ. వెంటనే పెద్దకూతుర్ని పిలిచింది. భద్రంగా - యీపాడు కుళ్లుగుమ్మడి కాయను రత్నమ్మ మొహానకొట్టిరా అంది. ఆపిల్ల యిచ్చిందిగా రత్నమ్మకి.

* * *

దిక్కుమాలినపూజలతో కొంప నాశనం అవుతోంది. కొంప నాశనమైనా—కూడూగుడ్డా లేకపోయినా మీపూజలు మీవే — అంటూంది రత్నమ్మ. దేవానందం పూజ చేస్తున్నాడు. రత్నమ్మ చేతిలోనే వుంది కుళ్లుగుమ్మడిపండు. దేవానందం పూజలోంచి లేచాడు. ఇదిగో- యీ ఉగాదినాడు మీ దేవుడిచ్చింది యీ కుళ్లు గుమ్మడికాయ-చూడండి దైవకటాక్షం అంటూ టపీలుమని దేవానందంముందర ఆకుళ్లుగుమ్మడి పండును గిరవాటేసింది రత్నమ్మ. గుమ్మడిపండు కుళ్లింది — విచ్చి

★ కుళ్లగుమ్మడి పండు ★

పోయింది. కాని అందులోనుంచి రాలుతున్నాయి కెంపులు-వజ్రాలు-రత్నాలు-బంగారు కణికలు కావలసినన్ని - ఇంటినిండా? రత్నమ్మ తెల్లబోయింది. దేవానందం దేవుడికి ఇంకోసారి దణ్ణం పెట్టుకున్నాడు.

* * *

మర్నాడు రాజానందం - దేవానందందగ్గరకు వచ్చాడు. సాగిలపడి నమస్కరించాడు. రత్నమ్మ తెల్లబోతోంది. రాజానందం యిలా అన్నాడు. దైవబలం నిజంగా గొప్పదయ్యా-నేనుగ్రహించానుఅన్నాడు.

దేవానందం చిరునవ్వునవ్వాడు. సీతమ్మ—బెదురుతోంది ఎందుకో మరి— రాజానందం మళ్లీ అందుకున్నాడు. ఉగాదినాడు నాకు రాజాగారిచ్చినది కుళ్లగుమ్మడికాయ. దానినే మీకు పంపించాను. కాని అది కుళ్లగుమ్మడికాయ కాదు. రత్నాలు, కెంపులు, వజ్రాలు, బంగారు కణికలతో నిండిన మూట. రాజుగారు ప్రత్యక్షంగా ఈయక—నా తెలివి తేటలకు ఒకపరీక్షగా యీవిధంగా యిచ్చారు. నా తెలివి-నా అహంకారం మబ్బులలో మాయమైంది. రాజబలంతో సంపాయించింది నేనైనా-దైవబలంతో అనుభవించేది నీవు అన్నాడు రాజానందం.

"వద్దు - యీ కెంపులు - యీ రత్నాలు-యీ వజ్రాలు - నీవే—నాకేల? తీసికొనిపోవయ్యా" అన్నాడు దేవానందం. రత్నమ్మ ఎందుకో చింబుకొంటూంది ముఖాన్ని.

నాకెందుకు? అవినీవే? నీ దైవబలమే గొప్పది. నీ విశ్వాసమే గొప్పది. నీ అచంచల విశ్వాసానికి అది నా బహుమానం అన్నాడు రాజానందం.

ఎప్పటికీ కూడా దేవానందం ఆ నమ్మికతోనే వుండేవాడు.

మధ్యలో తనమతం మార్చుకుని అతని శిష్యుడయ్యాడు రాజానందం.

కుళ్లగుమ్మడికాయ కధ ఇప్పటికీ ఆశాపురంలో అదృష్టగాధగా — మనమలకి—తాతయ్యలు— పండు వెన్నెలలో—వసంత రాత్రులలో-మంచాలమీద పడుకుని దర్జాగా చెప్పుతూంటారట. ★

మద్దెలగాడు

గంగలకుర్రు అనే గ్రామంలో సోమయ్య అనే మద్దెల గాడొకడున్నాడు. అతడు మద్దెల వాయించడంలో గొప్ప ప్రవీణుడు. ఆ ప్రాంతములో ఎక్కడ పెళ్లిళ్లు; హరికథ లొచ్చినా, ఇతనిని ఆహ్వానించేవారు. ఎంతవారికైనా ఒక్కొక్కప్పుడు కష్టాలొస్తూంటాయి!

ఆ వూళ్లో దురదృష్టవశాత్తు పెద్ద కాటకం బయలుదేరింది. గ్రామం కాటకంతో నిండిపోతే హరికథ లెక్కడ జరుగుతాయి? పెళ్లిళ్లెలా జరుగుతాయి? ఈ రెండూ లేకపోతే, సోమయ్య డొక్కాడదు! డొక్కాడాలంటే, రెక్కాడాలిగా మరి. కనుక పొట్టకై పెనుగులాడసాగాడు, సోమయ్య.

ఆ వూళ్లోనే దొంగలముఠా ఒకటుంది. ఆ దొంగలందరూ రోజుకొకసారి పట్టణానికెళ్లి దొంగతనం చేసుకొచ్చేవారు. మన కథానాయకుడికి పని లేకపోవటం చేత ఆ ముఠాలో తానూ చేరాడు.

కాలచక్రం తిరుగుతోంది. ఆ గ్రామంలో మళ్లీ వర్షాలు కురియడమూ, పంటలు పండడమూ జరిగాయి. ఊరినిండా భోలెడంత డబ్బుంది. రైతులందరూ హరికథలు చెప్పించుకొంటున్నారు. మద్దెల వాయించేవార్కి అది మంచిఅదను. సోమయ్యకోసం అనేకమంది వచ్చి తిరిగి వెళ్ళిపోతున్నారు. కాని సోమయ్య ఆ సమయానికి లేకపోవడమో, క్రొత్త వృత్తి లాభసాటిగా వుండి, ఆ పాతవృత్తిలో తిరిగి ప్రవేశించనని చెప్పడమో జరుగుతూంది. అలా సోమయ్య చెప్పడానికి కారణం? అతనికి హాయిగా, తేరగా సంచీలకు సంచీలు డబ్బు వస్తున్నప్పుడు ఇక ఆ వృత్తెందుకనుకున్నాడు. దోపిడీలు పెరిగిపోయాయి.

వాడ్రేవు
సత్యనారాయణమూర్తి

ఇలా కొంతకాలం జరిగింది. ఒకనాడు దొంగలముఠా ఒకచోట చేరి: "మనం ప్రతిసారీ పొరుగూళ్లుపోయి దొంగతనం చేయడం ప్రయాసగా వుంది. కాబట్టి ఈరాత్రి మన ఊరిలోనే కన్నంవేద్దాం," అని నిశ్చయించుకొన్నారు.

ఆనాటిరాత్రి రెండు ఝాముల వేళ సోమయ్యతోసహా బయలుదేరారు. కొంచెం పేరుబడ్డ చాకలి సన్యాసిగారిల్లు వారి కంటబడింది. వెంటనే మేడకు పైభాగంలో కన్నం వేశారు.

అది వేసవికాలం అవడంవల్ల బయట పడుకొన్నారందరూను. నగలన్నీ జాగ్రత్తగా బయటకు చేరవేస్తున్నారు. సోమయ్య మిద్దె దిగి ఏమున్నాయో చూచి పట్టకుపోదామని చూస్తుండగా అతనికి గోడకు తగిలించివున్న మద్దెల కనపడింది. పైగా అతను మద్దెలగాడు కూడాను. అది మెళ్ళో వేసుకుని: "తద్ధిమికిట", "తద్దిమికిటం ధిం" అని వాయించడం ప్రారంభించాడు!

ఇంకేముంది! మిద్దెగలవారు మేల్కొని దొంగలు! దొంగలు!! అని అరవసాగారు. ఇంట్లోకి ప్రవేశించి చూచారు. ఈలోగా దొంగలు తమకు దొరికినన్ని వస్తువులలో కాళ్లకు బుద్ధి చెప్పారు. సోమయ్య మాత్రం పారిపోదామని క్షంగారుగా కన్నంలో దూరబోయాడు. అది చిన్నకన్నం అవటంచేత వెళ్లలేకపోయాడు. వాణ్ణి పట్టుకుని పెడరెక్కలు విరిచికట్టి తన్నులు తన్ని తరిమివేశారు. పాపం..!తన బుద్ధిహీనతకు సిగ్గుపడి ఆ వూరినుండి వెళ్లిపోయాడు సోమయ్య! ★

సినిమా

'కాబూలీవాలా' చిత్రానికి బెర్లిన్ బహుమతి

బెర్లిన్ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో భారతీయచిత్రం "కాబూలివాలా" ప్రత్యేక బహుమతిని గడించుకొని, చలన చిత్ర ప్రపంచంలో మనదేశానికి గల మంచి పేరును పెంచింది. గతసంవత్సరం 'పథేర్ పాంచాలీ' చిత్రం ఇక్కడ బహుమతి అందుకోవడం విదితమే.

ఈసారి ఉత్సవంలో మన దేశానికివచ్చిన ఈ బహుమతి 'కాబూలివాలా' చలన చిత్రానికి కాక, ఆ చిత్రం సంగీత దర్శకుడు, సితార్ విద్వాంసుడుఅయిన పండిట్ రవిశంకర్ వినిపించిన సంగీతానికి వచ్చింది. వెండితో చేసిన ఒక ఎలుగుబంటి విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చారు.

ప్రధమ బహుమతి

ఈ ఉత్సవం మొత్తంమీద ఉత్తమ చిత్రంగా ఎన్నికై 'సువర్ణభల్లూక' విగ్రహాన్ని అందుకున్నది యునైటెడ్ ఆర్టిస్ట్స (అమెరికా) వారి 'పన్నెండుగురు కోపిష్టులు.'

కథాప్రధాన చిత్రాలలో 'హూమ్ గాడ్ ఫర్‌గివ్స' అనె శ్వానిక్ చిత్రానికి ప్రత్యేక బహుమతి-రజత విగ్రహం-ఇచ్చి గౌరవించారు


ఇతర బహుమతులు: ఉత్తమ డాక్యుమెంటరీ-వాల్ట్‌డిస్నీ నిర్మించిన 'సీక్రెట్స అఫ్ లైఫ్." దీనికి సువర్ణవిగ్రహాన్ని బహూకరించారు "ది లాస్ట్ పారడైజ్" అనే ఇటాలియన్ డాక్యుమెంటరీ రజిత విగ్రహాన్ని సంపాదించుకొన్నది.

చిన్న చిత్రాలలో "పీపుల్ ఇన్ ది డిస్టెన్స" అనే ఇటాలియన్ చిత్రం సువర్ణ విగ్రహాన్ని 'బిగ్ బిల్ బ్లూస్' (బెల్జియం), లేక్స అఫ్ ప్లిట్ వైస్' (యుగోస్లావియా), 'తౌజండ్‌స్మాల్ సైన్స' (జర్మనీ)లు రజత విగ్రహాలనూ సంపాదించు కున్నాయి.

ఉత్తమ దర్శకుడు మరియో మానిసెల్లి (ఇటలీ—ఫాదర్స అండ్‌సన్స),

ఉత్తమనటుడు పెడ్రో ఇన్‌ఫాంటీ (మెక్సికో), నటి యైవన్ మిచెల్ (బ్రిటన్) ఉత్తమ సంగీత దర్శకుడు రవిశంకర్ (భారత

(56-వ పేజీ చూడండి)



సంగీతా ప్రొడక్షన్స్‌వారి తొలిచిత్రం "ఇంటిగుట్టు" లో సావిత్రి, రామారావు.

సోనాలీ కథ

జులై 8వ తేదీ సాయంకాలం 7 గంటల వేళ ప్రఖ్యాతనటి ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్, లండన్‌లో ప్రధాని నెహ్రూ బసలో విందారగింప వెళ్లింది. భోజనసమయంలో ఆమె తను వచ్చినపని నెహ్రూకు వివరించింది.

ఆమె వెళ్లిన పని: భారతదేశంలో ఉన్న తన భర్త గురించి చెలరేగిన పుకార్ల నిజానిజాలు ప్రధాని ముఖతః తెలుసుకోవడం. ఇందుకోసం ఆమె పారిస్ నుండి లండన్ వెళ్లింది.

ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్ భర్త ప్రసిద్ధ ఇటాలియన్ చలనచిత్ర దర్శకుడు రాబర్టో ('స్ట్రాంబోలీ', 'పైజా') రాసెలినీ. ఆయన మనదేశం స్థితిగతులను ఆధారం చేసుకుని ఒక డాక్యుమెంటరీ చిత్రం నిర్మించాలని నాలుగు నెలల క్రితం బయలుదేరి వచ్చారు. దేశంలో కొన్నాళ్లు పర్యటించి, బొంబాయిలో మకాం పెట్టి స్క్రిప్టు రచన ఏర్పాట్లకు పూనుకొన్నాడు. బొంబాయిలో హరిదాస్ గుప్త అనే దర్శకుడున్నాడు. ఆయన భార్య సోనాలీ. రచయిత్రి. ఆమె వయసు 29 ఏళ్లు. ఇద్దరు పిల్లలు.

రాసెలినీ చిత్ర నిర్మాణంలో ఆమె స్క్రిప్టు రచనలో తోడ్పడుతూ వచ్చింది.

భారతదేశం అంతా చూచిన రాసెలినీ, "నేను భారతావనిని ప్రేమిస్తున్నాను. ఈ అందాలసీమలోనే ఆజన్మాంతం గడప దలచుకొన్నాను. ఇంక ఇటలీ వెళ్ళను" అన్నాడు.

* * *

"ఇక్కడ భారతదేశం అంటే 'సోనాలినీ' అనే అమ్మాయి అనిమాత్రమే అర్థమనీ" రాసెలినీ ఇంతకన్న విశాలదృష్టితో మాట్లాడలేదని తేలిందనీ" పరిస్థితులు గమనించిన కొందరు అర్థం చెప్పారు

"ఇది అర్థం కాదు అపార్థం మాత్రమే" అని మరికొందరన్నారు.

బొంబాయి పత్రికలు కొన్ని "రాసెలినీ సోనాలీల ప్రేమలీల" అంటూ యీ కథను అచ్చువేశాయి. దరిమిలా 'టైమ్ మాగజిన్' వంటి అమెరికన్ పత్రికలు కూడా దీనికి ప్రముఖస్థానం ఇచ్చాయి.

రాసెలినీ, సోనాలీ వివాహం చేసుకుంటారనీ, ఆయన ఇటలీలో ఉన్న తనభార్య ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్‌కు విడాకులు ఇస్తాడనీ పుకార్లు లేచాయి. (ఆమెకు నలుగురు బిడ్డలున్నారు.)



ఎఫ్. సి. మెహ్రా కొత్తచిత్రం "అజీ బస్ షుక్రియా"లో, ప్రియురాలి (గీతాబాలి) కాలిని నొప్పించిన కంటకాన్ని 'ఫొటోజెనిక్'గా తీసివేస్తున్న సురేష్.

ఇది ఇలా ఉండగా రాసెలినీ మనదేశంలో ఉండడానికి అవసరమైన అనుమతి పత్రంలో నిర్ణయించిన వ్యవధి పూర్తికావచ్చింది. "ఢిల్లీ వెళ్లి దీన్ని పొడిగిస్తూ అనుమతి తెచ్చుకుంటాను" అని రాసెలినీ అన్నారు. ప్రధాని నెహ్రూ తనకు మిత్రుడని అపుడు చెప్పారు. ఆయన ఈ దేశంవచ్చిన రోజున ఢిల్లీ వెళ్ళి ప్రధానిని కలుసుకొని మాట్లాడి వచ్చినందువల్ల అనుమతి పొడిగింపు సులభంగా వస్తుందని కొంతమంది అన్నారు.

'సోనాలీ' బంధువులు, వివాహితకు ఇది తగదని ఆమెకు చెప్పిచూశారు. తరవాత కొందరు ఢిల్లీ వెళ్లి ప్రధాని నెహ్రూను కలుసుకొని, సంగతి సందర్భాలు వివరించారు.

'రాస్కెలినీ!'

"ఆ రాస్కెల్ నాకు మిత్రుడేం కాడు. అతను ఒక్కసారే నన్ను కలుసుకున్నట్టున్నాడు" అని ప్రధాని నెహ్రూ అన్నారట. ఈ వార్తను 'టైం' పత్రిక ప్రకటించి, రాసెలనీకి అనుమతిపత్రం దొరకదన్నట్టు

(52-వ పేజీ చూడండి)

"అపరాధి కౌన్?"

బిమల్ రాయ్ ప్రొడక్షన్స్ కొత్తచిత్రం "అపరాధి కౌన్" షూటింగ్, అసిత్ సెన్ దర్శకత్వాన ఇటీవల ప్రారంభమైంది.

అసిత్ సేన్ "ఉభయతారకమంత్ర"తత్వం అవగాహనచేసుకున్న నవదర్శకుడు. ఈయన తొలిచిత్రం "పరివార్" ఇటు బాక్సాఫీస్ హిట్ అయింది; అటు ఉత్తమ స్థాయిని అందుకున్న మంచి చిత్రంగా పత్రికల, ప్రజల ప్రశంసలూ అందుకొంది. సర్వసాధారణమైన కుటుంబగాధను ఆధారం చేసుకుని పాతపద్ధతి సూత్రాలు ఏవీ లేకుండా, సృజనాత్మకమైన ప్రతిభతో అసిత్ సేన్ ఆ చిత్రాన్ని తీశాడు.

ఇపుడు "అపరాధి కౌన్" అతని రెండవ చిత్రం. దీనికి అపరాధపరిశోధన ఇతివృత్తం. ఒక జమీందారీ వారసత్వంకోసం ముగ్గురన్నదమ్ములు పోటీలు పడతారు. ఈ గొడవలో జమీందారు 'విల్లు' కొస్తా గల్లంతవుతుంది. దానికితోడు దెయ్యమో, దొంగో స్పష్టంగా చెప్పేసి తనను తాను పరిచయంచేసుకోవాలన్న మర్యాద తెలీనిశాల్తీ ఒకటి ఆభవంతిలో తారట్లాడుతూ వుంటుంది. చివరకి ఒకఖూనీ కూడా జరిగాక రహస్య భేదనకు మార్గం ఏర్పడుతుంది, ఇదీ స్థూలంగా ఏర్పాటు.

ఇందులో మాలాసిన్హా, అభిభట్టాచార్య, నర్తకి హెలెన్, మినూముంతాజ్, ధుమల్, కుముద్ త్రిపాఠీ నటిస్తున్నారు.

మోతీలాల్ ఇందులో మూడు వేషాలు వేస్తున్నాడు.


వీరుకాక, తరుణ్ బోస్ అనే ఒక కొత్త నటుడికి దర్శకుడు ఈ చిత్రంలో ప్రముఖ భూమికచ్చారు. తరుణ్, నాగపూర్ లో ఒక నాటకంలో వేషం వేస్తూవుండగా దర్శకనిర్మాత బిమల్ రాయ్ అతణ్ని చూచి, బొంబాయి తీసుకువచ్చారు.

"అపరాధి కౌన్" చిత్రానికి ప్రేమేన్ మైత్రా కథ వ్రాశారు. సంభాషణలు - వ్రజేంద్రగౌర్. ఛాయాగ్రహణం కమల్ బోస్. ★

నాగేశ్వరరావు చలనచిత్ర వజ్రోత్సవం

నటుడు శ్రీ ఎ. నాగేశ్వరరావు పాల్గొన్న 60 వ చిత్రం "దొంగల్లో దొర" (చందమామా ఫిలింస్) విడుదలసందర్భంలో జరుప నిశ్చయించిన చలనచిత్ర వజ్రోత్సవాలు, ఇతఃపూర్వం ప్రకటించినట్లు జూలై 14 న కాక, 28 వ తేదీ ఆదివారంనాడు, కోడంబాకంలోని 'విజయా' గార్డెన్స్‌లో జరుగుతాయి.

చలనచిత్ర పరిశ్రమకు, తదితర రంగాలకూ చెందినవారు దాదాపు రెండువేలమంది పాల్గొనే ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అధ్యక్షత వహిస్తున్నారు. ★



ఎం. జి. ఎం. వారి "టీ హవుస్ ఆఫ్ ఆగస్ట్ మూన్" చిత్రంలో గ్లెన్‌ఫోర్డ్, మార్లన్ బ్రాండో, జాపనీస్ నటి మిచికో క్యో.



బి. ఆర్. చోప్రా నిర్మిస్తున్న "నయా దౌర్" లో 'భాంగ్రా' (పంజాబీ జానపదం) అనే నృత్య సన్నివేశం. (భారీ ఎత్తున చిత్రించిన ఈ నృత్యంలో వైజయంతిమాలతోపాటు దిలీప్‌కుమార్, అజిత్, చాంద్ ఉస్మానీలుకూడా పాల్గొన్నారు.)

బొంబాయి సినిమా లేఖ

బొంబాయి సినిమాలలో నంబర్ వన్ రోమియో దేవానంద్ అచిరకాలంలోనే అగ్రశ్రేణినటులలో అగ్రగణ్యుడు (కుసుమదృష్ట్యా) కాబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇపుడతను నటిస్తున్న చిత్రాలు: తనే నిర్మిస్తున్న "నౌదో గ్యారా", మందిబర్మన్ నిర్మిస్తున్న "మంజిల్" (ఇందులో నాయకి నూతన్) రాజ్ ఖోస్లా చిత్రం "సొల్వా సాల్" (వహీదా రహమాన్‌తో), క్వాత్రా ఫిలింస్ వారి "దుష్మన్" (ఇందులో నాయిక మటుకు ఉషాకిరణ్. ఈమె రెండువారాలక్రితమే తల్లి అయింది)

ఇవిగాక దక్షిణభారతనటుడు శివాజీ గణేశన్ నిర్మిస్తున్న హిందీచిత్రం ("అమరదీపం"కు హిందీప్రతి) లో కూడా ఇతడు ముఖ్య భూమిక నిర్వహిస్తున్నాడు. ఇందులో పద్మిని, వైజయంతిమాల నటిస్తున్నారు. దీని తరువాత దేవానంద్, నర్గీస్‌తో కలసి మరి రెండు చిత్రాలలో నటిస్తాడు.

*   *   *

భరత్ భూషణ్ ఇటీవల రెండు ఉత్తమ శ్రేణిభూమికలు నిర్వహించడానికి కంట్రాక్టు వ్రాసుకున్నాడు. ఒకటి చంద్రగుప్త. మరొకటి ఉమర్ ఖయాం. రెండూ భారీఎత్తున నిర్మించబడేవే. "చంద్రగుప్త" చిత్రానికి ప్రముఖ కేవయొలిన్ విద్వాంసుడు కల్యాణ్‌జీ. వి. షా సంగీతం సమకూర్చుతాడు.

రెండోదికూడా సంగీత ప్రధానంగానే తయారవుతుంది.

ఇవికాక, తాయ్ సమాచార శాఖవారి శాద్రచిత్రం "అంగులిమాళ" లోనూ, "సోహినీ మహీవాల్", "ఫగుణ్" అనే రెండు సంగీతచిత్రాలలోనూ కూడా భరత్ ముఖ్యనటుడు.

"సోహినీ మహీవాల్"లో నాయిక నిమ్మి. నౌషాద్ ఆచిత్రానికి సంగీతదర్శకుడు.

బి. మైత్రా నిర్మిస్తున్న "ఫగుణ్" లో భరత్ భూషణ్‌కు నాయిక, వైజయంతిమాల. సంగీతదర్శకుడు ఓ. పి. నయ్యార్.

*   *   *

ఇటీవల గుర్రంమీదనుండి పడి దెబ్బలు తగుల్చుకున్న షమ్మీకపూర్ పూర్తిగా కోలుకున్నాడు. ఫిలింసాన్‌వారి తాజా చిత్రం షాట్ డోర్ షూటింగ్‌లో పాల్గొంటూ ఉండగా ఈ ప్రమాదం జరిగిన విషయం పాఠకులకు విదితమే.

మొన్న జులై 1వ తేదీన షమ్మీకపూర్, గీతాబలి తమ కుమారుడు 'మికీ' (ఆదిత్య రాజ్) తొలి పుట్టినరోజు పండుగ జరిపారు. ఆ క్రితం రోజున కల్పనా, దేవ్ ఆనంద్‌లు

★ బొంబాయి సినిమా లేఖ ★

తమ కులదీపకుడు సునీల్ పుట్టినరోజు పండుగ జరిపారు.

షమ్మీకపూర్ ఇప్పుడు తిరిగి యథా ప్రకారం 'షూటింగ్' కు వెళ్తున్నాడు. ఇపుడతడు నటిస్తున్న చిత్రాలు: ఫిలింస్థాన్ వారి 4వ చిత్రం; ఎఫ్. సి. మెహ్రా నిర్మిస్తున్న 'ముజ్రిం' (ఇందులో నర్తకి రాగిణి నాయికగా నటిస్తుంది), "మిర్జాసాహిబా" అనే మరో చిత్రమూను.

* * *

రాజ్ కపూర్ పాత నియమాలకు, స్వస్తి చెప్పి, 'ఫ్రీలాన్సర్' గా వ్యవహరిస్తూ, అందరి చిత్రాలలోనూ భూమికలు స్వీకరిస్తున్నాడు. ఇపుడతడు పాల్గొంటున్న చిత్రాలు: ప్రసాద్ ప్రొడక్షన్స్ వారి "శారద" (నటి మీనాకుమారి), సి. ఎం. త్రివేదీ చిత్రం "రిపోర్టర్", మహీపత్ రాయ్ నిర్మించనున్న కొత్త చిత్రం. రాజ్ కపూర్, తన స్వంత చిత్రం "అబ్ దిల్లీ దూర్ నహీఁ" ని త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు.

* * *

బొంబాయి చిత్రరంగంలో క్రమంగా పైకివస్తున్న బెంగాలీ నటి మాలాసిన్హా ఇపుడు "నయా జమానా", "ఫాషన్," సొహ్రాబ్ మోడీ చిత్రం "నౌషర్వాన్ ఎ. అదిల్" బిమల్ రాయ్ అపరాధ పరిశోధక చిత్రం "అపరాధీ కౌన్?", ప్రభృతి చిత్రాలలో పాల్గొంటోంది. మాలాసిన్హా నర్తకిగా కూడా ప్రతిభగలదనిపించుకుంది. ఇతఃపూర్వం బెంగాలీ చిత్రాలలో ఆమె, తన వేషాలకు ప్లేబాక్ పాటలు కూడా తనే పాడేది.

* * *

బొంబాయిలో ప్రస్తుతం ప్రదర్శించబడుతున్న చిత్రాలు:

ప్యాసా: దర్శక నిర్మాత, ముఖ్యనటుడు గురుదత్. వహీదారెహమాన్, మాలాసిన్హా, జానీవాకర్, రెహమాన్ ప్రముఖ భూమికలు నిర్వహించారు. పాటలు సాహిర్ లూధియాన్వి. సంగీతం శచిన్ దేవ్ బర్మన్. మినర్వా థియేటర్ లో 19 వ వారం సాగుతోంది. రజతోత్సవాలు జరుపుకోవచ్చు.

మిస్ ఇండియా: రచయిత, దర్శకుడు, ముఖ్యనటుడు ఐ. ఎస్. జోహార్. ఇది బాక్సాఫీస్ హిట్. నర్గీస్, జోహార్ ఇందులో ఉత్తమమైన నటనను ప్రదర్శించారు. బర్మన్ సంగీతం, జోహార్ సంభాషణలూ కూడా అంతటి ఉత్తమస్థాయిలోనూ సాగాయి. ఖచ్చితంగా శతదినోత్సవాలు (రాక్సీలో) జరుపుకుంటుందనవచ్చు.

బందీ: అశోక్ కుమార్, కిశోర్, శ్యామ, బీనారాయ్ నటించారు. దర్శకుడు సత్యేన్ బోస్. అఖండమైన విజయాన్ని సాధించకపోయినా చెప్పుకోతగ్గ ప్రజాదరణ సంపాదించుకుంటుందనవచ్చు. ఈ చిత్రంలో ప్రధానమైన లోపం కథ కల్పనలో ఉంది. సంఘటనలన్నీ కాకతాళీయంగా జరిగిన తరహా కనిపిస్తాయి. సంగీతంకూడా అమోఘంగా లేదు.

చంపాకలి: పేలవమైన కథ, అందుకుతగ్గ దర్శకత్వం కలసిన ఫలితంగా తయారైన 'ఓమోస్తరు' చిత్రం. భరత్ భూషణ్, సుచిత్రసేన్ నటించారు. నాయిక నటన మొక్కు తీర్చుకున్నట్టు సాగింది. సంగీతంమటుకు అలాటిపని చేయలేదు. ఈ సంగీత దర్శకుడు క్రితం చిత్రాలకు కూర్చిన వరసల దారిలోనే సాగుతూ వాటిని జ్ఞాపకంచేస్తూఉంది. ఈ చిత్రం లిబర్టీ థియేటర్ లో 12 వారాలు ప్రదర్శించబడుతుంది.

అభిమాన్: సార్ వాల్యూ లేని నటీనటులు పాల్గొన్నా మహేష్ కౌల్ దర్శకత్వానతయారైన ఈ చిత్రం విశేష ప్రజాదరణపొంది విజయవంతంగా సాగుతోంది.

(ఆంధ్రవారపత్రిక బొంబాయి విలేఖరి) ★



"చంద్రగుప్త" అనే చిత్రానికి ఒక పాటను రికార్డుచేస్తున్న మధురగాయని లతామంగేష్కర్; ఆ చిత్రం సంగీతదర్శకుడు కల్యాణ్ జీ. వి. షా.

సోనాలీ కథ

(49-వ పేజీ తరువాయి)

ధ్వనించింది.

వారం తిరిగేసరికి, రాసెలినీకి అనుమతి పత్రం మంజూరైంది!

ఐతే ఇపుడేం జరుగుతుంది?

రాసెలినీ తనభార్యకు విడాకులిస్తాడా? సోనాలీదాస్‌ను పెళ్లాడి ఇక్కడే ఉండిపోతాడా? అని చాలామందికి సందేహం కలిగింది.

అందరికన్న ఎక్కువగా రాసెలినీ భార్యకు ఇలాటి ఆందోళన కలగడం సహజం.

అందుకనే ఆమె జులై 8వ పారిస్‌నుండి లండన్ వెళ్లి ప్రధాని నెహ్రూను కలుసుకుంది.

లండన్ పత్రిక 'డెయిలీహెరాల్డ్' విలేఖరి ఆమెను తరువాత కలసుకొని, నెహ్రూ ఏమన్నారని అడిగాడు.

"ఆయన ఏమన్నారో నేను ఇపుడు చెప్పలేనుగాని, ఆయన చెప్పిన మాటలు నా ఆందోళన తొలగించి, సంతోషం కలిగించాయి. కాగా మరొక్క విషయం. నెహ్రూ నాభర్త గురించి నిందాపూర్వకమైన మాటలు ఏమీ అనలేదు. తను అలాటి ప్రకటన చేయలేదని, ఆ విషయమై తననెవరూ అభిప్రాయాలు అడగనేలేదనీ నెహ్రూ స్పష్టంగా నాతో చెప్పారు" అన్నది ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్ ★

చలచిత్రకథలు:

విక్రమార్కుడి మార్కు సింహాసనం

ఎస్. పార్థసారథి

భూమిక

సాగుతున్న చిత్రంలాగే చూడవచ్చిన జనంకూడా జోగుతున్నారు.

గాలివిసురుకు సినిమా డేరా, అందులో తెరాకూడా ఊగుతున్నాయి.

తెరమీద మాళవ రాజకుమారుడు వేటకెళ్ళి విల్లెక్కుపెట్టి బాణం వేశాడు. అది సూటిగా అమెరికావెళ్ళి అక్కడి అడివిలోని పులికి తగిలేసరికి ఆ దెబ్బకి ఆఫ్రికాలోని సింహం భయంకరంగా పర్జన్యంలా గర్జించింది. దాంతో ఆచుట్టుపక్కల జింకలూ జిరాఫీలూ, ఇండియాలోని కుందేళ్ళూ, మళ్లీ ఆఫ్రికాలోని సింహాలూ, కొరనుములూ కంగారుపడి పరుగెత్తాయి.

అంతలోకే అమెరికాలో కారు మబ్బులు అలముకున్నాయి. ఇందాకళ ఆఫ్రికన్ సింహం తమని కాపీకొట్టినట్టు గర్జించిందన్న కసి కొద్దీ ఈ పర్జన్యాలు సింహంలాగర్జించి ఊరుకున్నాయి.

"డైరెక్టరు పప్పులో కాలేశాడు" అన్నాడు వరహాలరాజు తెక్షణం గంభీరంగా చూచి.

అతగాడి జతగాడు ఏం అని అడగలేదు ఎందుకంటే రాజు కెంత తెలుసో ఇతనికీ అంత తెలుసు. అడగడంచిన్నతనం. అయినా అతనికేం తెలీదని రాజుకి గట్టి నమ్మకం. మొహమాట పడుతున్నాడనుకుని జాలి తలచి కిటుకుచెప్పేశాడు హడావుడిగా "సింఘం మేహంలా అరచింది."

"తెలుసు లేవోయ్ మింఘం సేహంలా కూడాఅర్చింది. నేను ఫష్టుసారే కనిపెట్టేశానులే"అన్నాడు అతనిమిత్రుడు అంతకన్న చురుకుగా.

రాజు మాటాడలేదు. శ్రద్ధగా సినిమా చూస్తూ 'హీరోయాక్షను' ఒక్కటే 'ష్టడీ' చేస్తున్నాడు.

ఈ చిత్రం అతనుచూడ్డం ఇంకా ఒకసారికూడా పూర్తికాలేదు. అతనెప్పుడూ మొదటిసారి హీరోనిచూసేసి, తరవాతసారి విలన్నీ, రేలంగినీ ష్టడీచేసేసి, మూడోసారి నించి, మ్యూజిక్కూ, సంభాషణలు సంతృప్తికరంగా రసవంతంగా ఉన్నాయో లేదో, డైరెక్షను చప్పగా ఉందో లేదో, సౌండు ఫరవాలేదో అవునో పరిశీలిస్తాడు.

అపుడప్పుడుమాత్రం చిన్న విమర్శలు చేస్తాడు.

ఈసారి మాత్రం, కూడావచ్చిన మిత్రుడు ముత్యంకొంచెంచిన్న యాక్టర్లనికూడాఒకంట కనిపెట్టాలని పోరి మరీ టికట్టుకొన్నాడు. హీరోయాక్టింగు కిటుకులన్నీ తెలిసిపోయినా సినిమావాళ్లు ఓ పట్టాన నమ్మరుట. సుందర చిన్న వేషాలువేసే తీరాలంటారుట. అందుకని.

"ఇదోగురూ ఇపుడీ సీనులో ఓ'ఎక్స్ట్రా' గాడొస్తాడు చూడు నారంగా.. యేమి యాక్షను చేశాడురా నాయనా! వాడెవడో తెలుసా ? ఇదివరకు ద్వారపూడి సంతదగ్గర లాట్రీ నడిపేవాడూ—వాడే. హఠాత్తుగా పరారైపోయి, మళ్లీ ఇక్కడ కనబడ్డాడు. ఇట్టె దూరిపోయాడురా! చిత్రం" అన్నాడు ముత్యం.

మేఘగర్జన మళ్ళీ వినబడింది.

"వాలాస్తోర్డి" అన్నాడు రాజు బద్ధకళ్గా ఆవలిస్తూ.

"నీ బొంద. అది బైటవాన. నిజం పిడుగు. తరవాత సీనులోగాని సినిమాలో వానరాదులే ఇప్పుడే మనవాడు వస్తాడు. వచ్చిభయపడ్డట్టు ఫేసు మీద ఓ ఎక్స్ప్రెషను పెట్టేసి ఒక యాక్షన్ చేస్తాడు చూడు నారంగా."

అంతలోకే తెరమీదకి చిన్న హాస్యగాడు వచ్చేసి ఆఫ్రికా సింహంగర్జనవిని భయపడ్డట్టు "ఫేసు మీద ఓ ఎక్స్ప్రెషన్" పెట్టేసి ఊహూ యాక్షన్ చేసెయ్యడం మొదలెట్టాడు.

"ఓవరాక్షన్ కదూ?" అన్నాడు రాజు గంభీరంగా.

"హుం నీకేంతెల్సు గురూ. ఓక్కోసారి ఓవర్ చెయ్యక పోతే లాభం లేదట. మన్నసలు ఎవడూ చూడ్డు. ఇపుడు మనం చూసే వాళ్లమా చెప్పు. అందికే మన ఆచారి యాక్షను మీద రాసిన బుక్కులో ఏం రాశాడు?

చవటవేషమైన, జడ్డివేషమైనను
నవధి తప్పవైన, నతివయున్న



వరసనలేని 'సరస' తో చదలవాడ సరసం
ప్రతిభావారి "దొంగలున్నారు జాగ్రత్త"లో.



సత్యేన్‌బోస్ దర్శకత్వాన తయారైన "బందీ"చిత్రంలో
కిశోర్ కుమార్, కామోాల నృత్యసన్నివేశం.

★ విక్రమార్కుడి మార్కు సింహాసనం ★

టట్టటాటటాట టాటటాటాటటా
డోసుమీరవచ్చు డోకురాదు"
అని గర్వంగా చుట్టూ పరకాయించాడు ముత్యం

హాలులో ఉన్న మిగతా యాభైయిద్దరూ సినిమా చూస్తున్నందు వల్ల, ముత్యాన్ని ఎవరూ చూడలేదు చూసినా ఆ చీకట్లో గర్వంగా చూచుట, వినయముగా చూచుట, లేక భయ, భీభత్స, రౌద్ర, శృంగార రసాదులను అభినయించుట తెలిపిగా స్పష్టంగా కనపడేవి కావు

అందరూ మత్తుగా జోగుతున్నారు. రాజులాంటి నిశిత విమర్శకులు, కొందలచుకున్న హీరోలూ మాత్రం ఓపిగ్గా చూస్తున్నారు

రాజు పరిభాషప్రకారం "తెరమీది కొసరుతారడు" తెగ నటించేస్తున్నాడు.

తెరమీద మబ్బులూ తెరామీద మబ్బులూ కూడా గర్జిస్తున్నాయి గాలి రివ్వున వీస్తోంది పెద్ద పిడుగు పడింది తెరమీద నటుడు హాఠాత్తుగా కాలు తొట్రుపడి, కొండమీంచి తూలి, తెరలోంచి ఊడి దభేలున నేల టిక్కెట్టు జనాభామధ్య పడ్డాడు

ఒక్కసారిగా మహారాజ పోషకుల మధ్య కలకలం చెలరేగింది "సినిమావోడు ఊడి పడిపోనాడేస్" అన్న కేకలు చెలరేగి పోయాయి.

రాజు, ముత్తెం, తదితరులూ ఆ చిన్నవాడిని చుట్టుముట్టారు

అతడు మెల్లిగా కళ్లు తెరిచి, లేచి చూట్టూ చూసి, చట్ట విరిగేలా ఆశ్చర్యపడిపోయి మళ్లీ లేచి నేనెక్కడున్నాను? అన్నాడు

"మెవ్వారం టెంటు సినిమాలో"అన్నారెవరో సగౌరవంగా.

"ఇది కోడంబాకం కాదా? మాంబళం కాదా. నీ ఫ్లోరు కాదా" అన్నాడు నటుడు

బోధపడక ఎవరూ జవాబివ్వలేదు

"మనమాటేకాదేస్ మనమాటాకాదు, .. మన బాసా కాదనిపిస్తది అసలాడు మడిసి కాదు గందా సినిమాబొమ్మ మరి అందులోనే ఉంటేనే ఊసులు సోగ్గా ఉంటాయి ఊడిపడితే యింకేటుంటది పాణమూ పాడా" అన్నాడొక ముసలయ్య మెల్లిగా

"అణి ముట్టకు నేవు బుల్లోడా సినిమా వెల్లికరింటు షాకిత్తాది" అన్నాడెవరో.

ఇలా అయితే లాభం లేదనుకున్నాడు రాజు వెంటనే ఓ సోడా తెప్పించి ఇచ్చాడు పడిపోయిన నటుడికి అయ్యా మీ పేరేమిటి? తమరు నటులా, బొమ్మలా? అన్నాడు.

"దుక్కలా నిలబడుంటే బొమ్మంటా వేమిటోయ్ బైతులాగ నేను వర్ధమాన నటుణ్ణి. నా పేర్ 'శ్రీకుమార్' అన్నాడు నటుడు తెరా పైకప్పు వేపు ఫోటోజెనిక్ గా చూస్తూ.

'ఓ! మీరా.' అన్నాడు రాజు శ్రీకుమార్ ప్రోఫైల్ గుర్తుపట్టి 'ఇలా వచ్చేశారేం?'

"మహాశయ్యా! మీరిప్పుడు ఎనిమిది సినిమాలలో నటిస్తున్నారని నేనూ కొందని రాజూ వాదించుకుంటున్నాము. మీ రెవరిలో ఏకీభవిస్తా రెడిటర్జీ?" అన్నాడు అప్పటికి పరిస్థితిని అర్థం చేసుకుని ఫుంజుకున్న ముత్యం.

"జ్ఞాపకం లేదు" అన్నాడు శ్రీకుమార్ తలకాయని ప్రొఫైలులోంచి ఫుల్ ఫ్యాకు 'పాన్' చేస్తూ.

"మా ముత్యానికి సినిమాలలో చేరాలని ఉబలాటం అండీ మీరెలాగా వచ్చారు కాబట్టి కాస్త వీణ్ణి మీలో తీసుకెళ్లి——"

"అభ్యే నాదేముంది కాని, మా రాజా ఎక్‌ టి. రామారావుని, ఘనగా ఇమిటేటు చేసిపారేస్తాడండి వీణ్ని తీసికెళ్లి ఆయనకి చూపిస్తే ఎగిరి గంతేసి బుక్ చేస్తారు" అన్నాడు ముత్యం వినమ్రత ఉట్టిపడేలా.

"బాగుంది కాని, నేను ఇప్పుడు అర్జెంటుగా మెడ్రాసెళ్లాలంటే రైలు ఛార్జీలు కూడా లేవు గదా. అసలంతకన్న అర్జెంటు ఇపుడీ ఫిలింలో ఖాళీ నింపకపోతే ఠపు షో ఎలా? ప్రొడ్యూసరేమనుకుంటాడు. రైలు ఛార్జీలేకుండా మెడ్రాసునుంచి ఈ వూరొచ్చి ఇక్కడ చల్లగా జారిపోయాననుకుంటాడు. తప్పు కాదు? అసలదీ కాక నాకీ వెధవపల్లెటూళ్ళో ఏంతోచటం లేదు తక్షణం మళ్ళీ ఫిలిములోకి వెళ్ళిపోవాలి. ఎలా?" అన్నాడు శ్రీకుమార్ గుక్కతిప్పుకోకుండా

అందరూ ముగ్ధులై పోయారు అతని వాగ్ధాటికి

'మరి ఎలా ఎక్కుతారు, అన్నాడు ముత్యం.

'దానికేముంది సినిమా మళ్లీ వేస్తేసరి, ఈయన ఊడిపోయిన చోట ఖాళీ వుంటుందిగా అదిరాగానే గబుక్కుని ఎక్కిపోతాడు. అంతే. అసలు సినిమాలు అలాగే తీస్తారులే. మహాబలిపురంలో షూటింగుతీసి, స్టుడియోలో యాకర్లని మళ్ళీ వేరే షూటింగుతీసి, ఆనక రెండూ కలిపేస్తారు ఉందిలే పద్ధతి"అన్నాడు రాజు మళ్లీ గంభీరంగా నే

"ఒరేయి ఈయన ఎలాగా వచ్చాడు. సన్మానంచేసి కెపుపంపిద్దాం" అన్నాడు ముత్యం.

"లాభంలేదు" అన్నాడు శ్రీకుమార్.

చివరికి మళ్లీ సినిమా వేశారు

తెరమీద మబ్బులూ, తెరా అవతల మబ్బులూ కూడా ఉరుముతున్నాయి. గాలి రివ్వున వీస్తోంది. . శ్రీకుమార్ స్టైజ

మీద రెడీగా నిల్చున్నాడు. రాజూ, ముత్యం పక్క నిలబడ్డారు.

తెరమీద శ్రీ కుమార్ నటించిన "కాళీ చోటు" వచ్చేసింది.

బయట పెద్ద పిడుగు పడింది.. ఆ హడావుడిలో శ్రీ కుమార్ తెరమీద కాళీలోకి దూకాడు. ముత్యం రాజూ అతన్ని అందులోకి తోసేసి, చేతులు దులుపుకు చక్కావచ్చి యథాస్థానంలో కూర్చున్నారు.

"బలేగా ఎక్కిపోయాడురా, మనం కూడా వాడితో పాటే దూరిపోతే బాగుండేది మెద్రాసులో ఎవడి చుట్టూరా తిరక్కుండానే హీరోలై పోయేవాళ్ళం" అన్నాడు రాజు, జరిగిన గమ్మత్తు మత్తులో అర్థనిమీలిత నేత్రుడై.

"అర టిక్కట్టు కొనుక్కురావలసింది అలా సగం కళ్లు ముసుగుచూసేకొడికి వెధవ బడాయీ నువ్వూను. ఈలోగా నీ జోడి బోజుని ఎవడూ ఫోటో తియ్యడులే తీసినా చీకట్లో అది షూట్ కాదు. పూర్తిగా కళ్లు తెర్చి చూడు" అని మందలించాడు—పంచవర్ష ప్రణాళికలో ప్రతి డబ్బూ సద్వినియోగం కావాలన్న సూత్రాన్ని చాతనైనంత వరకూ అమలు జరపదలచుకున్న ముత్యం

తెరమీద తుపాను చల్లారింది. తరవాతి దృశ్యంలో తెల్లారింది .

*   *   *

...తెల్లారింది. కవికన్న మిన్న అన్న పేర్ల తెచ్చుకోవాలన్న ఉత్సాహంలో సూర్య భగవానుడు కాంతికిరణాలను మూలమూలలకీ ప్రసరించి చూస్తున్నాడు బద్ధకిష్టులను నిద్ర లేపుతున్నాడు ఒక కాంటికిరణం శివాలయం అవతలఉన్న పెంకుటింటి పిథరుగుమీది తడక వసారాలోకి ప్రవేశించింది అక్కడ రాజు బద్ధకంగా నిద్రపోతున్నాడు. తడకని తాకి, దాని అవతల ఉన్న 'తారామండలాన్ని' ఛేదించి లోపలికొచ్చిన ఆ కిరణం రాజు కుడి కంటిరెప్పమీద సూటిగా దిగి ఘాటుగా పొడిచింది. లేలే అంది

రాజు ఆవులించి, మెల్లిగా కళ్ళు తెరచి, తడకమీద అంటించుకున్న 'తెర వేలుపు'ల వదనారవిందాలు చూచి ఆనందించి, మళ్లీ కళ్లు మూసుకుని, అరచేతిలో 'నర్గీస్' చుట్టుకొని కళ్లకద్దుకుని, కళ్లు తెరిచి ఫొటోజెనిక్ గా ఆవలించి, 'హాయ్ రాజ్' అనుకున్నాడు.

అతనిదృష్టి తడకమీద నిలచింది ఊహాలు రెక్కలువిప్పి ఎగిరాయి రాజ్ కపూర్ ఇపుడు టీ తాగుతూ ఉంటాడు. దిలీప్ కుమార్ దిగాలుగా చూస్తూ ఏ కిటికీవెనకో నిలిచి ఫోటో తీయించుకుంటూ ఉంటాడు. నరీస్ బొమ్మలతో ఆడుకుంటూ ఉంటుంది. నాగేశ్వరరావు ఈ పాటికల్లా మేకప్ చేసుకొని సెట్ మీదకి వెళ్లిఉంటాడు యన్. టి. రామారావు భూంఖ టీతాగి షూ డి ర్యూకి వెళ్లుంటాడు. రేలంగి ఆ సినీ బండపడ అని ఎవరో ఒకర్ని ఏడిపిస్తూ ఉంటాడు జమున శరత్ పుస్తకం చదువుతూ ఉంటుంది ఎస్ వరలక్ష్మి పువ్వులుకోస్తూ ఉంటుంది. అంజలి డాన్సు నేర్చుకుంటూ ఉంటుంది. భానుమతి త్యాగరాజకీర్తనలు పాడుకుంటూ ఉంటుంది. సావిత్రి కథలు పుస్తకం చదువుతూ వుంటుంది. బాబ్బ బలే వుంటుంది సినిమా స్టార్ లైఫ్ అనుకున్నాడు రాజు ఇంగ్లీషులో.

'కాస్తలో తప్పిపోయిందిగదా ఛాన్సు' అనుకున్నాడు కాసేపాగి ఆ ఊహ రాగానే ఉలికిపడి లేచి కూచున్నాడు

రాత్రి సినిమాలోంచి ఎవడో ఊడి పడిపోయాడుగదా అప్పుడు మళ్ళీ సినిమా వేసివాడు ఊడిపోయిన చోటురాగానే గబుక్కున అందులోకి ఎక్కించేశారుగదా చిత్రంగా ఉందే-అలా ఎలా ఊడి పోతారు? ఒకవేళ ఊడినా మళ్లీ ఎలా ఎక్కుతారు? ఇంపాసిబుల్. కలేమో అనుకున్నాడు రాజు.

అతనికి హఠాత్తుగా అనుమానం వచ్చింది.

అసలు తనురాత్రి సినిమాకెళ్ళాడా? అని.

సినిమా కెళ్లినటూ అక్కడే గారడీ జరిగినట్టూ కలొచ్చిందా? లేకపోతే, సినిమా చూసొచ్చి పడుకున్నాక, ఈ గారడీ మాత్రమే కలగా వచ్చిందా? అసలు రెండూ జరిగాయా? రెండు జరగలేదా. మరిఉందా పోయిందా?...

"ఒరే అబ్బీ నీకు మతుందా పోయిందా? రైలుకి వేళైంది అలా వల్లమందుభాయిలా కూచుంటావేం. లే లే" అన్నాడు రాజు జతగాడు ముత్యం లోపలికొచ్చి.

"ఎక్కడికి?" అన్నాడు రాజు.

"బావుందిరా అబ్బీ మెద్రాసెళ్తావన్నావు గదరా? సైకిలమ్మేశావు. అప్పు చేశావు. ఇంతాచేసి ప్లానుమార్చావా?" అన్నాడు ముత్యం

"అబ్బే లేదు లేదు కానుగాని మనం రాత్రి ఏ సినిమా కెళ్ళాం" అన్నాడు రాజు

"ఇంక లాభంలేదు నువు మెద్రాసెళ్ళకు. విశాఖపట్నం టికెటుకొను అలాఅయితే మీ తాతకి చెప్పే వెళ్ళొచ్చు"అన్నాడు ముత్యం నవ్వుతూ

"అయితే రాత్రి మనం ఎక్కడున్నాం?"

"ఏమిటోయ్ ఏండిపెట్టింగు మొదలెట్టావేమిటి యాక్టింగు వదిలేసి లేలే మీ తాతపాలంనించి వచ్చేస్తే కథ అడ్డం తిరుగుతుంది" అన్నాడు ముత్యం హడావుడిగా.

రాత్రి జరిగింది కలా? కల్లా? అన్నాడు రాజు లేస్తూ

"డైలాగుఅనడానికిబాగుందిగాని రెండూ ఒకటే అదేసినిమాలోవస్తే, రచయితపప్పులో కాలేశాడు అంటావు నువ్వే, పదు పదు"

★ పక్రమార్కుడి మార్కు సింహాసనం ★

రాజు ఇంక మాట్లాడలేదు

గబగబా మొహం కడుక్కుని, తరవాణీ అన్నం తిని, ఓ చిన్న పెట్టెలో సినిమాపత్రికలూ, తను రాసిన సినిమాకథలూ, సినేరియోలూ, విమర్శలు, పాటలూ, పాటలపుస్తకాలూ అన్నీ పదిలంగా సర్దేసుకుని, ఇప్పుడేవస్తాను బామ్మా అని చెప్పి రైలుస్టేషనుకి దారి తీశాడు

దారిలో, జంకుతునే, రాత్రిసంగతి మళ్లీ కదలేశాడు అది కలో, నిజమో బోధపడ లేదతనికి ఇంకా

"ఒరేయ్ రాజా, నువ్వింకా పెద్దవాడివి కాకుండానే ఇలాటి బడాయిలు పోబోకు నాకు ఒళ్లుమండుతుంది నువ్వు గొప్పవాడివై పత్రికలవాళ్లు ఇంటర్వ్యూ చేసినప్పుడు మరుపూ గిరుపూ చెలాయించు ఇప్పుడు కాదు" అన్నాడు ముత్యం

రైలు కదిలేవేళైంది.

"జాగర్త రాజా. ఎలా నెగ్గుకొస్తావో- మ్రదాసంటే పట్టపగలు టోకరాయిస్తారట. మూరుమార్కెట్టులో ఏమీ కొనకు. తిష్టావాళ్లతో మాట్లాడకు అరవం గబగబ నేర్చుకో. సర్టిఫికెట్లు జాగర్త" అని హెచ్చరించాడు ముత్యం

రాజుకి కంటనీరు తిరిగింది

"కొంచెం భయంగానే ఉంది గురూ నిన్నురమ్మంటే రావంటావు ఎలా."

ముత్యం మాట్లాడలేదు ఆలోచిస్తూ నిలబడి పోయాడు గార్డు ఈల వేశాడు

హఠాత్తుగా ముత్యం తెగించి ఒకనిర్ణయం చేశాడు.

"గురూ పోతేపోయింది గాని, "వానపాము" నాటకంలో కూడా హీరో రోలు నువ్వేవేశావని చెప్పెయి డైరక్టర్లతో. అది కూడా కలిపితే అరడజను నాటకాలూ అవుతాయి." అన్నాడు


రాజుకి నోటమాట రాలేదు ఆశ్చర్య సంభ్రమాలవల్ల ఐనా ప్రయత్నించాడు "ఇంత త్యాగంచేసేస్తున్నావా గురూ నీ కీర్తి శాశ్వతంగా—"

"గురూ అది హెవీడైలాగు సోషల్సులో బాగుండదు. ఇలాటివి అక్కడ రాసేవు. ఒద్దంటారు జాగర్త నీకు ఛాన్సురాగానే నాకు టెలిగ్రాం ఇస్తావుగా. వస్తాను" అన్నాడు ముత్యం

"తప్పకుండా నిన్ను—నా ప్రాణమిత్రుడిని—" అన్నాడు రాజు గద్గద స్వరంతో

ఈ ఘట్టంలో కదలొచ్చునో, కూడదో తేల్చుకోలేక ఒక్కక్షణం తటపటాయించి, తనుకూడా బొంగురు గొంతుకతో మూలిగి, ముందుకు నడిచిందిరైలు ★

(పై వారం తొలికథ ప్రారంభం)



సి. బి. డిమిల్ చిత్రం "టెన్ కమాండ్ మెంట్స్"లో రెండవ రామెసిస్ ప్రభువుగా యుల్ బ్రైనర్.

కాబూలీవాలా చిత్రానికి బెర్లిన్ బహూమతి

(48-వ పేజీ తరువాయి)

దేశం)

ఈ బెర్లిన్ ఉత్సవం పశ్చిమ బెర్లిన్ నగరంలో జూన్ 21 న ఆరంభమై జూలై 2 న పరిసమాప్తమైంది ఆఖరురోజున, అమెరికన్ చిత్రం, 'టి హౌస్ ఆఫ్ ఆగస్ట్ మూన్'ను అతిథులకు చూపించారు

ఈ ఉత్సవం పేరిట దేశదేశాల ఫిలిం కళాకారులు, వ్యాపారులూ కలుసుకొని మంచిచెడలు ముఖాముఖిని మాట్లాడి పరస్పరం తెలియచెప్పుకోడానికి దోహదం జరిగింది

చాలా దేశాల దర్శక నిర్మాతలూ, ఫిలిం డిస్ట్రిబ్యూటర్లూ భారతీయ చిత్రం 'కాబూలీవాలా'ను చూచి మెచ్చుకున్నారు ఇటువంటి చిత్రాలను యూరప్ దేశాలలో విడుదలచేస్తే ప్రజలు బాగా ఆదరించగలరని వారు అన్నారు కొందరు నిర్మాతలు భారతీయ నిర్మాతలతో కలసి చిత్రాలు నిర్మించే విషయమై సంప్రదింపులు కూడా ఆరంభించారు

చిత్రాల పొడుగు

ఈవిధంగా ఇంతవరకు మనకు లభ్యంకాని యూరప్ విపణులు ఇప్పుడు అందివచ్చే అవకాశాలు ఏర్పడడంముదావహం అయితే యూరప్ దేశాలలో విడుదలచేసే చిత్రాలు చిన్నవిగా, భారతీయ జీవితాన్ని ప్రతిబింబించేవిగా ఉండడంఅవసరం. ఈ సంగతి అక్కడివారు పలువురు చెప్పారు. పాశ్చాత్య చిత్రాన్ని అనుకరించి తీసిన చిత్రాన్ని మళ్లీ పాశ్చాత్యులకే చూపించి వ్యాపారం చేయబోవడం అనేది హాస్యాస్పదం హాస్యంమాటఎలాఉన్న సాగిరానిపని.


జెక్ ఉత్సవం

బెర్లిన్ ఉత్సవాలు ముగిసిన మూడురోజులకల్లా 'కార్లోవివారి' నగరంలో జెకోస్లోవాకియా చలనచిత్రోత్సవాలు ఆరంభమయ్యాయి

జూలై 6 న మొదలైన ఈ ఉత్సవంలో అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్సు, ఇటలీ, జపాన్, ఇండియా ప్రభృతి దేశాలు 45 పాల్గొంటున్నాయి. యూరప్ మొత్తంమీద ఇంతపెద్దఎత్తున ఉత్సవం జరుగడానికిదే తొలిసారి

ఇక్కడ జూలై 8 న, ఆర్ కె ఫిలింస్ చిత్రం "జాగ్ తేరహో"ను ప్రదర్శించారు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd , by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S Sambhu Prasad.



"క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప !"

—ఫొటో: టి. వాసుదేవన్